
శుక్రవారం
8•2•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 8 • సంచిక 224
• పేజీలు : 16 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



లోయర్ మానేరు డ్యాం మధ్యలోని మైసమ్మగుట్టపై అభివృద్ధి చేయనున్న కేసీఆర్ ఐ లాండ్ నమూనా చిత్రం.

ఎల్ఎండీలో 'కేసీఆర్ ఐలాండ్'

- నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు
- అంచనా వ్యయం రూ.20 కోట్లు
- అత్యాధునిక హంగులతో కాటేజీలు ఫ్లోటింగ్ బ్రిడ్జి, ఫ్లోటింగ్ రెస్టారెంట్
- గుట్టపై భాగంలో ప్రెసిడెన్షియల్ సూట్
- పిల్లలకు, పెద్దలకు వేర్వేరు స్విమ్మింగ్‌పూల్స్

3

వడ్డీరేట్లను తగ్గించిన ఆర్బీఐ





- పావు శాతం దిగొచ్చిన రెపో, రివర్స్ రెపో
- వాహన, గృహ రుణాలు మరింత చౌక
- రైతన్నకు రిజర్వ్ బ్యాంక్ కానుక
- తాకట్టు లేని వ్యవసాయ రుణాల పరిమితి రూ. 1.60 లక్షలకు పెంపు
- వచ్చే ఏడాది వృద్ధి 7.4 శాతంగా అంచనా

11

రెవెన్యూ డివిజన్లుగా కోరుట్ల, కొల్లాపూర్

- ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల
- 30 రోజులపాటు అభ్యంతరాల స్వీకరణ
- ఆ తరువాత ఫైనల్ నోటిఫికేషన్

హైదరాబాద్, మెట్‌పల్లి, కోరుట్ల టౌన్, కొల్లాపూర్/నమస్తే తెలంగాణ :

జగిత్యాల జిల్లాలోని కోరుట్లను, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్‌ను రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటుచేస్తూ రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి గురువారం ప్రిలిమినరీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలను 30 రోజుల్లోగా జిల్లా కలెక్టర్లకు తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆ తరువాత ఫైనల్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అప్పటినుంచి ఈ రెండు రెవెన్యూ డివిజన్లు ఉనికిలోకి వస్తాయి. మూడు మండలాలతో కోరుట్ల డివిజన్, నాలుగు మండలాలతో కొల్లాపూర్ డివిజన్ ఏర్పాటుచేస్తున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపాలిటీతో పాటు మూడు మండలాలను కలుపుకొని కోరుట్ల డివిజన్ ఏర్పాటు చేస్తున్నారు. కోరుట్ల మండలంలోని 15 గ్రామాలు, కథలాపూర్ మండలంలోని 19 గ్రామాలు, మేడిపల్లి మండలంలోని 25 గ్రామాలు కొత్తగా ఏర్పడే డివిజన్ పరిధిలోకి

మిగతా 9వ పేజీలో

ఈ సీజన్‌లోనే ఎస్సారెస్పీ ఆయకట్టుకు

కాళేశ్వరం జలాలు

14.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

జూన్ నాటికి కాల్వల మరమ్మతు పూర్తిచేయాలి

ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధి ప్రజాప్రతినిధులతో సమావేశంలో సీఎం కేసీఆర్



గురువారం ప్రగతిభవన్‌లో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ కూడా ఉన్నారు.

- చెరువులు నింపేందుకు తొలిప్రాధాన్యం
- అవసరమైన నిధులు సత్వర విడుదల
- పనుల పూర్తికి ఎక్కువమంది కాంట్రాక్టర్లను నియమించండి: ముఖ్యమంత్రి కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఈ వానకాలం సీజన్‌లోనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని మొత్తం 14.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు కాళేశ్వరం నీళ్లు అందించాలని, ఇందుకు అనువుగా జూన్ నాటికే కాల్వలు, తూముల నిర్మాణం, లైనింగ్ పనులు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోభాగంగా నిర్మిస్తున్న మేడిగడ్డ బరాజ్ నుంచి ఈ వానకాలంలోనే నీటిని ఎత్తిపోయడం ప్రారంభమవుతుందని, ఆ నీటిని మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లకు తరలిస్తామని చెప్పారు. ఈ రెండుడ్యామ్‌లలో 50 టీఎంసీల నిల్వసామర్థ్యం ఉంటుందని, ఆ నీటితో ఎస్సారెస్పీ కాల్వల ద్వారా అన్ని చెరువులు నింపాలని సూచించారు. 'ప్రాజెక్టుల ద్వారా నీళ్లొస్తున్నాయి.. పనులు చేయడానికి నిధులు ఇస్తున్నాం.. అయినప్పటికీ పంటపొలాలకు నీళ్లందించకుంటే పాపంచేసిన వారమవుతాం' అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రగతిభవన్‌లో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రాజెక్టు పరిధిలోని మొత్తం ఆయకట్టుకు నీరందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా చర్చించారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నదో గుర్తించి, అప్పటికప్పుడే పరిష్కరించారు. భూసేకరణకు, ఇతర పనులకు కావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదేశించారు.

కాల్వలన్నింటికీ మరమ్మతు చేయాలి

'గోదావరిలో పుష్కలంగా నీళ్లున్నాయి. వాటిని ఎత్తిపోయడానికి భారీవ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నం. ఈ ఏడాది వానకాలం నుంచే మేడిగడ్డ నుంచి నీటిని

మిగతా 2వ పేజీలో

సిర్పూర్‌కు కాగితపు సిరి



గురువారం సిర్పూర్ పేపర్ మిల్లులో యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీఎం ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పీకే సూరి, పక్కన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తదితరులు

కాగజ్‌నగర్ ఎస్పీఎంలో మళ్లీ ఉత్పత్తి మొదలు

- పని ప్రారంభించిన ఏడో నంబర్ యంత్రం
- మాట నిలబెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం
- కార్మికుల్లో వెల్లివిరిసిన ఆనందం

కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కాగజ్‌నగర్ కాగితపు పరిశ్రమకు మళ్లీ కళ వచ్చింది. 2014లో మూతపడిన పరిశ్రమ తెలంగాణ ప్రభుత్వ చొరవతో తెరుచుకున్నది. గురువారం రాత్రి 8.20 గంటలకు తిరిగి పేపర్ ఉత్పత్తి ప్రారంభమైంది. సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, వర్క్స్ అండ్ డైరెక్టర్ పీకే సూరి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎస్పీఎం యూనిట్ హెడ్ మయాంక్ జిందాల్ ప్రత్యేక పూజలు చేసిన అనంతరం స్విచ్ ఆన్ చేసి ఉత్పత్తిని ప్రారంభించారు. అనంతరం మయాంక్ జిందాల్ కార్మిక కుటుంబాలకు చీరలు, స్వీట్స్ పంపిణీ చేశారు. అంతకుముందు రాత్రి 7.07 గంటలకు ఏడో నంబర్ యంత్రం వద్ద పీకే సూరి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక పూజలు, హోమాన్ని నిర్వహించారు. చిప్పర్‌హౌస్‌లో నిల్వ ఉంచిన పల్ప్ (గుజ్జు) పేపర్‌గా మారి బయటకు వచ్చింది. ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతంగా కాగితం ఉత్పత్తి జరిగింది. దీంతో మిల్లు కార్మికులు సంబురాలు చేసుకున్నారు. తమ జీవితాల్లో కొత్త వెలుగులు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు.

ఇచ్చిన మాట ప్రకారం..

నిజాం కాలంలో 1938లో ఎస్పీఎంను స్థాపించారు. 1950లో బిర్లాగ్రూప్ టేకోవర్ చేసింది. అప్పటినుంచి నిరాటంకంగా ఉత్పత్తి కొనసాగింది. కొత్త యంత్రాల కొనుగోలు పేరుతో యాజమాన్యం 2007-08లో మిల్లును ఐడీబీఐకి తాకట్టు పెట్టింది. అయితే నష్టాలు పెరిగిపోవడంతో 2014 సెప్టెంబర్ 27న షట్‌డౌన్ చేసింది. కంపెనీ మూసేనాటికి 3,200 మంది కార్మికులు

మిగతా 9వ పేజీలో



గురువారం ఉదయం బీజాపూర్ జిల్లా బైరాంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిన స్థలంలో మావోయిస్టుల మృతదేహాలు

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- బీజాపూర్ జిల్లాలో 10 మంది మావోయిస్టులు మృతి
- మరికొందరు నక్సల్స్‌కు గాయాలు!
- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- మృతుల వివరాలను తేల్చే పనిలో అధికారులు

కొత్తగూడెం క్రైం / రాయ్‌పూర్:

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం ఉదయం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 10 మంది నక్సల్స్ మరణించినట్టు పోలీసులు వెల్లడించారు. బీజాపూర్ జిల్లా బైరాంగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని రాష్ట్ర డీజీపీ డీఎం అవస్థి రాయ్‌పూర్‌లో విలేకరులకు వెల్లడించారు. మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యులు రాజ్మన్ మాండవి, సుఖలాల్, మరో 50-60 మంది నక్సలైట్లు బైరాంగఢ్ అడవిలోని మారుమూల ప్రాంతంలో దిగువస్థాయి క్యాడర్‌కు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ (స్పెషల్ టాస్క్ ఫోర్స్), డీఆర్జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బలగాలకు చెందిన దాదాపు 200 మంది సిబ్బంది బుధవారం రాత్రి కూబింగ్ ప్రారంభించారని తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బోర్గా గ్రామానికి సమీపాన కూంబింగ్ బృందానికి మావోయిస్టులు తారసపడిన సమయంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని, దాదాపు రెండున్నర గంటల పాటు సాగిన భీకర పోరులో 10 మంది నక్సలైట్లు మృతిచెందారని డీజీపీ వివరించారు. ఘటనా స్థలం నుంచి 10 మంది

మిగతా 9వ పేజీలో

మహాకల్తీ కూటమి

కాంగ్రెస్‌పై పార్లమెంట్‌లో నిప్పులు చెరిగిన ప్రధాని మోదీ

దేశ ప్రజాస్వామ్యం కాంగ్రెస్ కూటమిని తిరస్కరిస్తుందని వ్యాఖ్య



5

బీజేపీకి వ్యతిరేకంగాప్రతిపక్షాలు ఏర్పాటు చేస్తున్నది 'మహాకల్తీ' కూటమి అని, దేశ ప్రజాస్వామ్యం దానిని తిరస్కరిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ముంగిట ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై దాడిచేసేందుకు మోదీ పార్లమెంట్‌ను వేదికగా చేసుకున్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు గురువారం సమాధానమిస్తూ మాట్లాడిన మోదీ.. ఎమర్జెన్సీని విధించి, న్యాయవ్యవస్థను బెదిరించి, ఎన్నికల సంఘంపై విమర్శలు చేసి, సాయుధ దళాలను నిర్వీర్యం చేసిన కాంగ్రెస్ పార్టీ తనను రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేశాడంటున్నదని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌ది అధికారం కోసం పాకులాడే తత్వమని, తమది సేవాభావమని చెప్పారు. రాఫెల్ ఒప్పందాన్ని తప్పుపడుతున్న కాంగ్రెస్.. ఎవరి కోసం సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నదని నిలదీశారు.

ఇక ఎండలు ముదురుతాయ్!

- రాష్ట్రవ్యాప్తంగా 30 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 34 డిగ్రీల సెల్సియస్
- గ్రేటర్ హైదరాబాద్‌లో 32 డిగ్రీలు నమోదు

2


మిషన్ కాకతీయ అద్భుత పథకం

నీటి సంరక్షణకోసం ఆధునిక విధానాలు అనుసరించాలి

నీటి కొరతను అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలి

'నీటి సంరక్షణ- అందరి బాధ్యత' సెమినార్‌లో సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ హుస్సేన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:




సదస్సులో ప్రసంగిస్తున్న మసూద్ హుస్సేన్

నీటి సంరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ కాకతీయ' గొప్ప పథకమని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) చైర్మన్ మసూద్ హుస్సేన్ ప్రశంసించారు. గురువారం హైదరాబాద్‌లోని టీఎస్ జెన్‌కో ఆడిటోరియంలో 'నీటి సంరక్షణ- అందరి బాధ్యత' అనే అంశంపై జరిగిన తొలి హిందీ టెక్నికల్ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్‌కే మాథుర్, సంయుక్త కమిషనర్ మోతీలాల్, గోదావరి నదీ నిర్వహణ బోర్డు చైర్మన్ ఆర్కే జైన్ పాల్గొన్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో వాన నీటిని ఒడిసిపట్టడం, నదీజలాలు, జలాశయాలు, ఇతర నీటివనరుల నిర్వహణ, సంరక్షణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మసూద్ హుస్సేన్ మాట్లాడుతూ.. నీటి సంరక్షణకోసం ఆధునిక విధానాలు అనుసరించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ప్రభుత్వాలతో పాటు, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి నీటి కొరతకు అంతం పలుకాలని పిలుపునిచ్చారు. విదేశాలతో పోల్చితే మన దేశంలో నీటి సంరక్షణపై ప్రజలకు పెద్దగా అవగాహన లేదని చెప్పారు. ప్రపంచ జనాభాలో 18 శాతం ఉన్న భారత్‌లో కేవలం 4శాతం మాత్రమే నీటివనరులు ఉన్నాయని తెలిపారు. నదులు, జలాశయాలను కాపాడుకోవాలని,

మిగతా 2వ పేజీలో

స్వచ్ఛ వరంగల్



రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఓడీఎఫ్ ++ నగర హోదా

స్వచ్ఛభారత్ మిషన్ ప్రకటన

వరంగల్ కలెక్టర్‌ను, కమిషనర్‌ను అభినందించిన మాజీ మంత్రి కేటీఆర్

3

ఆర్థికశాఖకు ఏకీకృత సర్వీస్‌రూల్స్ ఫైల్

- భాషా పండితులు, పీఈటీల దస్త్రం ప్రభుత్వానికి పంపించాం
- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భాషా పండితులు, పీఈటీల పదోన్నతులకు సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో.. సంబంధిత ఫైల్‌ను తిరిగి ప్రభుత్వానికి పంపినట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ టీ విజయకుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో కలిసిన విలేకరులతో మాట్లాడుతూ.. భాషా పండితులు, పీఈటీల పదోన్నతులపై త్వరలోనే తుది ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నదన్నారు. గ్రేడ్-2, గ్రేడ్-1 భాషా పండితుల పోస్టులను ఉద్యోగులతోపాటు అప్‌గ్రేడ్‌చేయడం వల్ల న్యాయపరమైన సమస్యలు తలెత్తే అవకాశంలేదని, నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని పేర్కొన్నారు. అయితే ఈ ఫైల్ ఆర్థికశాఖ ఆమోదంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చేరినట్లు తెలిసింది. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్‌రూల్స్‌పై సుప్రీంకోర్టు తాజాతీర్పు నేపథ్యంలో.. ఆ ఫైల్‌ను కూడా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపినట్లు విద్యాశాఖ డైరెక్టర్ చెప్పారు. కాగా భాషా పండితులు, పీఈటీల పదోన్నతులు, ఏకీకృత సర్వీస్‌రూల్స్‌పై చొరవ చూపుతున్న సీఎం కేసీఆర్‌కు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర నాయకులు బీరెల్లి కమలాకర్‌రావుతోపాటు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యూపీపీ) రాష్ట్ర నాయకులు ఎండి అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు.



గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నల్లగొండ జిల్లాలో జరిగే చెరువుగట్టు బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానిస్తూ జడల రామలింగేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మండలి విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.



ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు బుద్ధుడి ప్రతిమను అందజేస్తున్న నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి ఎంపీపీ, టీఆర్‌ఎస్ నాయకుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి



గురువారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం పోచారం గ్రామంలో స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి మాతృమూర్తి పాపవ్వ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, సీఎస్ ఎస్కే జోషి తదితరులు కూడా ఉన్నారు.



అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పరామర్శిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీలు బీబీ పాటిల్, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కే కవిత, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డికి సీఎం పరామర్శ



గురువారం నిజామాబాద్ జిల్లా పోచారంలో అసెంబ్లీ స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డిని ఓదారుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

- నిజామాబాద్ జిల్లా పోచారంలోని స్పీకర్ స్వగృహానికి వెళ్లిన కేసీఆర్
- పరిగె పాపవ్వ చిత్రపటానికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి
- స్పీకర్‌ను పరామర్శించిన పలువురు ప్రముఖులు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు గురువారం పరామర్శించారు. స్పీకర్ మాతృమూర్తి పరిగె పాపవ్వ (107) చిత్రపటానికి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో కలిసి హెలికాప్టర్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో పోచారం గ్రామానికి వెళ్లారు. సీఎం కేసీఆర్ స్పీకర్ ఇంటికి చేరుకోగానే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఆత్మీయ ఆలింగనం చేసుకొని, సానుభూతి తెలిపారు. పరిగె పాపవ్వ(107) చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం స్పీకర్ కుటుంబసభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆయన కుమారులు పరిగె రవీందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డితో కొద్దిసేపు సంభాషించారు. ఈ సందర్భంగా స్పీకర్ పోచారం తన మాతృమూర్తితో ఉన్న అనుబంధాన్ని సీఎం కేసీఆర్‌తో పంచుకున్నారు. ఆ తర్వాత సీఎం కేసీఆర్ అక్కడున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కొద్దిసేపు మాట్లాడి తిరుగుప్రయాణమయ్యారు.

ప్రముఖుల పరామర్శ

మాతృవియోగంతో బాధపడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గురువారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు. పోచారంను కలిసినవారిలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీమంత్రులు నాయిని నర్సింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, ఎంపీలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీబీ పాటిల్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంత్‌షిండే, గంప గోవర్ధన్, బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, గణేశ్ గుప్తా, జాజాల సురేందర్, కొప్పుల ఈశ్వర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, టీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఈగ గంగారెడ్డి, కామారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, డీఐజీ శివశంకర్‌రెడ్డి, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్తికేయ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వెబ్‌సైట్లకు ఏకరూపు

టీ-వెబ్ సాయంతో యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దుతున్న సర్కారు

ఇప్పటికే 125 వెబ్‌సైట్లు ఆధునీకరణ.. ఏడాదిలోగా మిగతావి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టీ-వెబ్ ప్రాజెక్టు ద్వారా వివిధ శాఖల వెబ్‌సైట్లనింటినీ ఒకే ఫార్మాట్‌లోకి తీసుకొస్తున్నారు. అంతేకాకుండా వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలు, సదరు శాఖ పూర్తి సమాచారాన్ని ఒకే ప్లాట్‌ఫాం మీదికి తెస్తున్నారు. ఇప్పటికే 125 వెబ్‌సైట్లను టీ-వెబ్ పరిధిలోకి తీసుకొచ్చి, యూజర్ ఫ్రెండ్లీగా మార్చామని అధికారులు చెప్తున్నారు. దివ్యాంగులు సైతం ఇబ్బంది పడకుండా వినియోగించే స్థాయిలో వీటిని రూపొందించామని పేర్కొన్నారు. మిగిలిన 375 ప్రభుత్వ వెబ్‌సైట్లను టీ-వెబ్ పరిధిలోకి తీసుకొచ్చి ఏడాదిలోగా యూజర్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దుతామన్నారు.

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం..

దేశవ్యాప్తంగా ప్రభుత్వ వెబ్‌సైట్లను ఒకే ఫార్మాట్‌లోకి తీసుకొచ్చి, అత్యంత భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలు సులభంగా యాక్సెస్ చేసేలా మార్చాలని కేంద్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఈ మేరకు 115 ప్రమాణాలు రూపొందించి అన్ని రాష్ట్రాలకు పంపించింది. అయితే రాష్ట్రాలు అంతగా ఆసక్తి చూపలేదు. 2016లో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అన్ని రాష్ట్రాలు ఈ గైడ్‌లైన్స్‌ను పాటించడం మొదలుపెట్టాయి. తెలంగాణ ప్రభుత్వం కేంద్రం గైడ్‌లైన్స్‌కు అదనంగా మరో నాలుగు కార్యక్రమాలను జోడించింది. టీ-వెబ్, మొబైల్ ఫ్రెండ్లీ కాంపొనెంట్-సెర్చ్ ఇంజన్ ఆపరేషన్(ఎస్‌ఈవో), సోషల్ మీడియా ఇంటిగ్రేషన్, లోకలైజేషన్ (వెబ్‌సైట్ తెలుగులో కూడా ఉండేలా) కార్యక్రమాలను చేపట్టింది. అదేవిధంగా ఆధార్, ఐటీ, ఆర్టీఐ చట్టాలకు అనుగుణంగా కొత్త గైడ్‌లైన్స్‌ను రూపొందించింది. ఈ విధంగా టీ-వెబ్ ప్రాజెక్టు కింద వెబ్‌సైట్లను ఒకే ఫార్మాట్‌లో, యూజర్ ఫ్రెండ్లీగా మార్చే ప్రక్రియను గత ఏడాది ఆగస్టులో ప్రారంభించారు. ఇప్పటివరకు 125 వెబ్‌సైట్లను అభివృద్ధి చేశారు. గత ఏడాది డిసెంబర్ నాటికి 250 వెబ్‌సైట్లను పూర్తి చేయాలని భావించినా, ఎన్నికల నేపథ్యంలో ఆలస్యం అయింది. త్వరలో పార్లమెంటు ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, అవి పూర్తయిన తర్వాత మిగతా పనుల్లో వేగం పెరుగుతుందని అధికారులు చెప్తున్నారు. tweb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి ప్రభుత్వ సమాచారాన్ని, పథకాలు, ఇతర కార్యక్రమాల వివరాలను తెలుసుకోవచ్చని అధికారులు వివరించారు.

సూర్యాపేట అభివృద్ధికి రూ.9.8 కోట్లు

ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9.8 కోట్లు విడుదల చేసింది. ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి నిధులు మంజూరుచేస్తూ గురువారం రాష్ట్ర ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.50 గంటలకు

సూర్యాస్తమయం: 6.11 గంటలకు

వికంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం తదియ ఉదయం 10.20 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: పూర్వాభాద్ర మధ్యాహ్నం 3.00 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, అమృతఘడియలు: ఉదయం 6.03 నుంచి 7.39 వరకు, రాహుకాలం ఉదయం 11.05 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 9.06 నుంచి 9.51 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.53 నుంచి 1.38 వరకు, వర్జ్యం: లేదు.

చేనేత పర్సన్ ఇంచార్జీల పదవీకాలం పొడిగింపు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలోని ప్రాథమిక చేనేత సంఘాల పర్సన్ ఇంచార్జీల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. వీరి పదవీకాలం ఈ నెల 11తో ముగుస్తుంది ఎన్నికల నిర్వహించే వరకు లేదా ఆరు నెలలు పర్సన్ ఇంచార్జిల పాలన కొనసాగించాలని గురువారం సహకారశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి ఉత్తర్వులు జారీచేశారు.

టీఎస్‌ఐపాస్‌లో స్వల్ప మార్పులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్ ఐపాస్‌లో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఒకరోజులోనే కంపెనీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాణిజ్యపన్నులశాఖలో వృత్తిపన్ను చెల్లింపు పరిధిలో కంపెనీ రిజిస్ట్రేషన్ చేసుకొనే ప్రక్రియ కాలపరిమితిని కుదిస్తూ పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. టీఎస్ ఐపాస్ ద్వారా ఒక కంపెనీకి అవసరమైన అన్ని శాఖల అనుమతులు ఇవ్వడానికి 15 రోజుల గడువును విధించారు. దీనిలో భాగంగా కొత్తగా వాణిజ్యపన్నులశాఖలో వృత్తిపన్ను చెల్లింపు పరిధిలోకి వచ్చే కంపెనీని ఒకరోజులో రిజిస్ట్రేషన్ చేసుకొనే అవకాశాన్ని కల్పించారు.



గురువారం ప్రగతిభవన్‌లో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ సీతారాంనాయక్, మండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, రెడ్యానాయక్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ తదితరులు కూడా ఉన్నారు.

'కిసాన్ సమ్మాన్ నిధి' పక్కాగా అమలు చేయండి

రాష్ట్రాలకు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి ఆదేశం

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని రాష్ట్రాలు పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి ఆదేశించారు. గురువారం ఢిల్లీ నుంచి కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధానకార్యదర్శులు, కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం మార్గదర్శకాలను రాష్ట్రాలకు వివరించారు. సాధ్యమైనంత త్వరగా రాష్ట్రాలు ఈ పథకాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని సూచించినట్లు సమాచారం. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ సచివాలయం నుంచి వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

..కాళేశ్వరం జలాలు

మొదటిపేజీ తరువాయి...

ఎత్తిపోసి మిడ్‌మానేరు, లోయర్ మానేరు డ్యామ్‌లకు తరలిస్తాం. అక్కడి నుంచి ఎస్సారెస్పీ కాల్వల ద్వారా అన్ని చెరువులకు మళ్లించాలి' అని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. చెరువులను నింపడమే ప్రథమ ప్రాధాన్యంగా గుర్తించాలని, ఇందుకోసం ఎస్సారెస్పీ కాల్వలన్నింటినీ మరమ్మతు చేయాలన్నారు. కావాల్సినచోట తూములు నిర్మించాలని, భూసేకరణతోపాటు, రెండోఫేజ్‌లో నిర్మించిన కాల్వలకు లైనింగ్ పూర్తిచేయాలని సూచించారు. ఎక్కడ ఏ పనిచేయాలో 50 మంది ఇంజినీర్లను నియమించుకుని యుద్ధప్రాతిపదికన సర్వేచేసి, అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. అవసరమైన అన్నినిధులనూ వెంటనే మంజూరు చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లో ఈ వానకాలానికి ఎస్సారెస్పీ పరిధిలోని 14.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రాంతం నుంచి మొదలుకుని చివరి ఆయకట్టు కలిగిన డోర్నకల్, తుంగతుర్తి, భూపాలపల్లి, పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల వరకు అన్ని దిక్కులకూ సాగునీరందాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ ఎస్కే జోషి, సీఎంవో కార్యదర్శి స్మితాసబర్వాల్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, నీటిపారుదలశాఖ ఈఎన్సీలు మురళీధర్, అనిల్‌కుమార్, నాగేందర్, సీఈలు శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు సంతోష్‌కుమార్, సీతారాంనాయక్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి, డీఎస్ రెడ్యానాయక్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బాల్కసుమన్, సుంకె రవిశంకర్, సంజయ్‌కుమార్, కోరుకంటి చందర్, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, గంగుల కమలాకర్, ఆరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, గాదరి కిశోర్, నన్నపునేని నరేందర్, వీ సతీశ్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో ముఖ్యమంత్రి చెప్పిన మరికొన్ని ముఖ్యాంశాలు

- కాకతీయ కాల్వ- వరద కాల్వ మధ్య ఉన్న 1.10 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలి. తూములు ఏర్పాటుచేయాలి. సర్వేచేసి పనులు ప్రారంభించాలి.
- ఎస్సారెస్పీ స్టేజ్ -2లో అన్ని డిస్ట్రిబ్యూటరీలకు లైనింగ్‌చేయాలి. వెంటనే అంచనాలు రూపొందించి, టెండర్లు పిలవాలి. ఎండాకాలంలోపు పనులు పూర్తికావాలి.
- ఎస్సారెస్పీ కాల్వల నిర్మాణ పనులకు ఎక్కువ మంది కాంట్రాక్టర్లను నియమించాలి. అంతటా పనులు సమాంతరంగా జరిగేలా చూడాలి.
- అన్ని ప్రాజెక్టుల కాల్వల హద్దులను నిర్ణయించాలి. ప్రాజెక్టుల భూముల సమగ్ర వివరాలు (ఇన్వెంటరీ) రూపొందించాలి.
- కడెం గేటు మరమ్మతు పనులు చేపట్టాలి.
- ఎస్సారెస్పీ పంటకాల్వలను ఎవరైనా దున్నుకుంటే.. వాటిని పునరుద్ధరించాలి. ఇందుకు ఎమ్మెల్యేలు చొరవచూపాలి.
- అన్ని ప్రాజెక్టుల ప్రొఫైల్, ప్రతి ప్రాజెక్టుకు ఆపరేషన్ రూల్స్ తయారుచేయాలి.
- ప్రాజెక్టుల నిర్వహణకు ఎంత వ్యయం అవుతుందో అంచనావేయాలి. ఆ నిధులను బడ్జెట్‌లోనే కేటాయిస్తాం.
- చనాఖా-కొర్ట పనులు మే 15 నాటికి పూర్తికావాలి.
- దేవాదుల నీటిని తరలించే రామప్ప, లక్నవరం, ఘన్‌పూర్, పాకాల కాల్వల పనులను ఎండాకాలంలోనే పూర్తిచేయాలి.
- దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన పాలకుర్తి, ఉప్పుగల్లు, చెన్నూరు రిజర్వాయర్ల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించాలి.

మిషన్ కాకతీయ అద్భుత పథకం

మొదటిపేజీ తరువాయి...

వాన నీటిని ఎక్కడికక్కడే ఒడిసి పట్టుకోవాలని సూచించారు. గంగా, బ్రహ్మపుత్ర, నర్మదా, తపతి, మహానది, గోదావరి, కృష్ణ, కావేరీ తదితర ఎన్నో నదులు మన దేశాన్ని సస్యశ్యామలం చేస్తున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. నదీజలాల పంపిణీ మన దేశంలో నిరంతర సమస్యగా మారిందని, రాష్ట్రాల మధ్య నెలకొన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పలు ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. నీటి సంరక్షణ గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజినీర్ డీ రంగారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగర నీటి అవసరాలను తీర్చేందుకు గోదావరి, కృష్ణా నదుల నుంచి సరఫరా చేస్తున్నారని, ప్రతి కిలో లీటర్ నీటి కోసం ఒక కిలో వాట్ విద్యుత్ అవసరం అవుతుందని వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు.

లోకం పోకడ



మార్చి 13 నుంచి పీజీఈసెట్ దరఖాస్తులు

- ఏప్రిల్ 30 చివరి తేదీ
- మే 28 నుంచి పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ఎంటెక్, ఎంఫార్మసీ కళాశాలల్లో సీట్లభర్తీకి పీజీఈసెట్-2019 నోటిఫికేషన్‌ను ఉన్నత విద్యామండలి గురువారం విడుదల చేసింది. మార్చి 13 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. మే 22 నుంచి 27 వరకు విద్యార్థులు హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మే 28 నుంచి 31 వరకు ప్రవేశపరీక్షలు జరుగనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి ఆధ్వర్యంలో పీజీఈసెట్ కమిటీ సమావేశమైంది.

గురుకుల లెక్చరర్ అభ్యర్థులకు రాతపరీక్ష

14 నుంచి 20 వరకు నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గురుకుల డిగ్రీ, జూనియర్ కళాశాలల లెక్చరర్ పోస్టుల భర్తీకి అభ్యర్థులకు రాతపరీక్షను ఈ నెల 14 నుంచి 20 వరకు చేపట్టనున్నట్టు తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www. treirb.telangana. gov.in నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ఇక ఎండలు ముదురుతాయ్!

- రాష్ట్రవ్యాప్తంగా 30 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 34 డిగ్రీలు నమోదు
- హైదరాబాద్‌లో 32 డిగ్రీలు

హైదరాబాద్/ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ఇకనుంచి ఎండలు ముదిరే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శుక్రవారం నుంచి మూడ్రోజులపాటు పొడివాతావరణ పరిస్థితులు ఉంటాయని, పగలు ఎండ, రాత్రివేళల్లో చలితీవ్రత కొనసాగుతుందని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలు అన్ని ప్రాంతాల్లోనూ 30 డిగ్రీలపైనే నమోదవుతున్నాయి. గురువారం అత్యధికంగా నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 34 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. ఆదిలాబాద్, మెదక్‌లో 33 డిగ్రీలు, భద్రాచలం, రామగుండం, హైదరాబాద్‌లో 32 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. శుక్ర, శనివారాల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా.. చలి ప్రభావం తగ్గుతున్నది. తెల్లవారుజామున కొంత చల్లగా ఉంటున్నది. పొగమంచు కొనసాగుతున్నది. గురువారం గ్రేటర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణ స్థాయికంటే ఒక డిగ్రీ సెల్సియస్ పెరిగి 32 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 19.3 డిగ్రీలు నమోదైంది.

స్వచ్ఛ వరంగల్

- రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఓడీఎఫ్++ నగర హోదా
- కలెక్టర్‌ను, కమిషనర్‌ను అభినందిస్తూ కేటీఆర్ ట్వీట్

వరంగల్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత ఓడీఎఫ్ ++ హోదా పొందిన రెండో మహానగరంగా వరంగల్ రికార్డు నెలకొల్పింది. బహిరంగ మల, మూత్ర విసర్జనరహిత నగరంగా స్వచ్ఛభారత్ మిషన్ ప్రకటించింది. వరంగల్ మహానగర పాలక సంస్థను హైదరాబాద్ తర్వాత రెండో నగరంగా ఓడీఎఫ్ ++గా తీర్చిదిద్దినందుకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్‌ను, వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్‌ను అభినందిస్తూ ట్వీట్ చేశారు. స్వచ్ఛభారత్ మిషన్ థర్డ్ పార్టీ పర్యవేక్షణ గతనెల 18, 19 తేదీల్లో జరిగింది. వరంగల్, హన్మకొండ, కాజీపేట పట్టణాల్లోని కమ్యూనిటీ టాయిలెట్ల నిర్వహణ, అమ్మవారిపేటలో మానవ వ్యర్థాల శుద్ధీకరణ (శానిటేషన్ రిసోర్స్‌పార్క్) నిర్వహణ అత్యద్భుతంగా చేపడుతున్నారని థర్డ్‌పార్టీ పరిశీలనలో తేలింది. వరంగల్ మహానగరంలో 43 పబ్లిక్ టాయిలెట్లు ఉండగా ఇందులో 28 ప్రాంతాల్లోని పబ్లిక్ టాయిటెట్లను పరిశీలించి.. 13 పబ్లిక్ కమ్యూనిటీ టాయిలెట్లకు స్వచ్ఛభారత్ మిషన్ గ్రేడింగ్ ఇచ్చింది. అందులో పోచమ్మ మైదాన్, రాజీవ్‌పార్క్ టాయిలెట్లను అతిశుభ్ర నిర్వహణగా, ఎల్బీనగర్, వేయిస్తంభాల గుడి సమీపం, కాకతీయ కెనాల్, భద్రకాళి చెరువు సమీపం, వరంగల్ బస్టాండ్ ఈ ఐదింటిని ఉత్తమ నిర్వహణ టాయిలెట్లుగా, హన్మకొండలోని కుమార్‌పల్లి, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్, లక్ష్మీపురం, గోపాలస్వామి గుడి దగ్గర, హన్మకొండ బస్టాండ్, ఖిలా వరంగల్ ఈ ఆరు పబ్లిక్ టాయిలెట్లను అత్యుత్తమ టాయిలెట్లుగా తేల్చింది. దేశవ్యాప్తంగా 4050 పట్టణాలు స్వచ్ఛసర్వేక్షణ్‌లో భాగంగా పోటీపడుతున్నాయి. అందులో ఉన్న ప్రధానమైన బహిరంగ మల, మూత్ర విసర్జనరహిత విభాగంలో ఓడీఎఫ్ వరంగల్ అర్బన్ జిల్లాగా ప్రతిపాదనలు పంపింది. అయితే స్వచ్ఛభారత్ మిషన్ తాజాగా ప్రకటించిన ఓడీఓఫ్ ++ హోదా ను వరంగల్ నగరం సొంతం చేసుకోవడం విశేషం. రాష్ట్ర పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ విషయాన్ని ట్వీట్ చేయగానే టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ మున్సిపల్‌శాఖను, వరంగల్ కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్‌ను అభినందిస్తూ రీట్వీట్ చేశారు.



అభినందనలు బావా..

- సిద్దిపేట సమీకృత మార్కెట్‌పై హరీశ్‌రావుకు ట్విట్టర్‌లో కేటీఆర్ ప్రశంసలు
- కృతజ్ఞతలు తెలుపుతూ రీట్వీట్ చేసిన హరీశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సిద్దిపేట జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత మార్కెట్ అత్యద్భుతంగా ఉన్నదని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ప్రశంసించారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ట్విట్టర్‌లో పోస్టు చేసిన సమీకృత మార్కెట్ ఫొటోలపై ఆయన స్పందించారు. నా అభినందనలు బావా.. అంటూ ట్వీట్ చేశారు. దీనిపై హరీశ్‌రావు కృతజ్ఞతలు తెలుపుతూ రీట్వీట్‌చేశారు.

ఒకే దఫాలో పార్లమెంట్ ఎన్నికలు!

- రాష్ట్రంలో అధికార యంత్రాంగం సిద్ధంగా ఉంది
- కేంద్ర ఎన్నికల సంఘానికి సీఈవో రజత్‌కుమార్ ప్రతిపాదన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పార్లమెంట్ స్థానాలకు ఒకే దఫాలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమవుతున్నది. ఈ మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన, భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో చర్చిస్తున్నది. బందోబస్తు కోసం రాష్ట్రానికి సరిపడా సిబ్బంది ఉన్నారని డీజీపీ సైతం స్పష్టత ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలను ఒకేదఫాలో పూర్తిచేసేందుకు సర్వం సిద్ధంచేశామంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్ సమగ్ర నివేదికను తయారుచేసి ఇటీవలే సీఈసీకి పంపించారు. భద్రత కోసం అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే రాష్ట్రంలోని 60 వేల నుంచి 70వేల మంది భద్రతా సిబ్బందిని వినియోగిస్తామని, వీరికి అదనంగా 200 కంపెనీల కేంద్ర బలగాలు, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా నుంచి హోంగార్డులను పంపాలని నివేదికలో ప్రతిపాదించినట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న ఘటనకు కూడా తావు లేకుండా విజయవంతంగా పూర్తిచేశామని, రాష్ట్ర ఎన్నికల అధికారులకు అవార్డులు కూడా వచ్చాయని గుర్తుచేసినట్టు తెలిసింది.

పొరపట్లు పునరావృతం కానీయం

పక్కా ప్రణాళికతో రాష్ట్రంలో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహిస్తామని సీఈవో రజత్‌కుమార్ తన నివేదికలో తెలిపారు. 31 జిల్లాలకు తగిన ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉన్నదని, పోలింగ్‌కు కావాల్సిన ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామని, అదనపు బలగాల మోహరింపు, కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయడం, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి చర్యలు తీసుకున్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు కార్యక్రమం పూర్తయిందని, వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామన్నారు.

షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా సిద్ధమే

పార్లమెంట్ ఎన్నికలకు ఎప్పుడు షెడ్యూల్ విడుదలైనా తాము సిద్ధంగా ఉన్నామని రజత్‌కుమార్ నివేదికలో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో వచ్చినా ఏర్పాట్లు పూర్తిచేస్తామని భరోసా ఇచ్చారు. ఈవీఎంలు, వీవీప్యాట్లపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈవీఎంలపై అనుమానాలను నివృత్తిచేస్తున్నామని వివరించారు.

తల్లిదండ్రుల కల నిజంచేశాడు



- ఐఎఫ్ఎస్ టాపర్‌గా నల్లగొండవాసి మందాడి నవీన్‌రెడ్డి

రామగిరి: ఐఎఫ్ఎస్‌లో టాపర్‌గా నిలిచిన నల్లగొండవాసి మందాడి నవీన్‌రెడ్డిపై ప్రశంసల జల్లు కురుస్తున్నది. కుమారుడు తమ కలలను నిజం చేశాడంటూ తల్లిదండ్రులు పద్మ, శేఖర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్-ముంబై)లో ఇంజినీర్‌గా పనిచేస్తూనే ఐఎఫ్ఎస్‌కు ప్రిపేర్ అయి టాప్‌ర్యాంకు సాధించాడని తెలిపారు. నవీన్‌రెడ్డి స్వస్థలం నార్కట్‌పల్లి మండలం తిరుమలగిరి. నల్లగొండలోని వీటీకాలనీలో 14 ఏండ్ల కిందట స్థిరపడ్డారు. తండ్రి న్యాయశాఖలో ఉద్యోగి. మిర్యాలగూడ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మ గృహిణి. చెల్లెలు భవానీ బీటెక్ పూర్తిచేసింది. పీజీసీఐఎల్-ముంబైలో సీనియర్ ఇంజినీర్‌గా రెండున్నరేండ్లు ఉద్యోగం చేశాడు. సెలవు పెట్టి, ఢిల్లీలో ఉంటూ ఐఎఫ్ఎస్‌కు ప్రిపేరయ్యారు.

నా లక్ష్యం సివిల్స్

- ఐఎఫ్ఎస్ 45వ ర్యాంకర్ అబ్దుల్ షాహిద్



అచ్చంపేట, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట బల్మూర్ మండలం తుమ్మెన్‌పేటకు చెందిన అబ్దుల్ షాహిద్ ఐఎఫ్ఎస్‌లో జాతీయస్థాయిలో 45వ ర్యాంకు సాధించారు. అతడి తల్లిదండ్రులు హన్నాన్, రెహానాబేగం ఇద్దరూ టీచర్లే. అబ్దుల్‌షాహిద్ 5వ తరగతి వరకు బల్మూరు మండలం కొండనాగుల ప్రభుత్వ పాఠశాలలో, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు వట్టెం నవోదయ పాఠశాలలో చదివారు. హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీలో ఇంటర్, సీబీఐటీలో బీటెక్ (ఈఈఈ) పూర్తిచేశారు. విద్యాభ్యాసం అనంతరం హైదరాబాద్‌లోని మూడేండ్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేశారు.

నాలుగో ప్రయత్నంలో విజయం

సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో అబ్దుల్ షాహిద్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఢిల్లీకి వెళ్లి ఒకేసారి ఐఏఎస్, ఐఎఫ్ఎస్‌కు కోచింగ్ తీసుకున్నారు. మూడేండ్లపాటు శిక్షణ తీసుకున్నారు. మూడుసార్లు ఎంట్రెన్స్ టెస్టులు రాసినా ఎంపిక కాలేదు. అయినా ధైర్యం కోల్పోకుండా, మరింత పట్టుదలగా చదివి నాలుగో ప్రయత్నంలో విజయం సాధించారు. ఐఎఫ్ఎస్ సాధించినా.. తన అంతిమ లక్ష్యం సివిల్సేనని అబ్దుల్ చెప్తున్నారు. సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికయ్యానని, త్వరలో హాజరు కావాల్సి ఉన్నదన్నారు. అందులోనూ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తంచేశారు.

నీట్ పీజీలో గిరిజన విద్యార్థి ప్రతిభ

- రాష్ట్ర 2వ ర్యాంక్ సాధించిన ప్రదీప్‌రాజ్ చౌహన్



అచ్చంపేట, నమస్తే తెలంగాణ: నీట్ (ఎన్ఈఈటీ) పీజీ వైద్య ప్రవేశపరీక్షలో తెలంగాణకు చెందిన గిరిజన విద్యార్థి ప్రతిభ చాటారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే లక్ష్మాపూర్‌కు చెందిన ముడావత్ ప్రదీప్ రాజ్‌చౌహన్ నీట్ మెడికల్ ఎంట్రెన్స్-2019లో ప్రతిభ చూపారు. జాతీయస్థాయిలో నిర్వహించిన పరీక్షలో రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించారు. నీట్‌లో సీటు సాధించడంపై తల్లిదండ్రులు ప్రదీప్‌కు అభినందనలు తెలిపారు.



లోయర్ మానేరు డ్యాం మధ్యలో ప్రస్తుతం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైసమ్మగుట్ట



కేసీఆర్ ఐలాండ్ నమూనా చిత్రం,



ఐలాండ్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ వినోద్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ (ఫైల్)

ఎల్‌ఎండీలో కేసీఆర్ ఐలాండ్

- లోయర్ మానేరు డ్యాం మధ్యలో 4 ఎకరాల్లో మైసమ్మగుట్టపై ఏర్పాటు
- రూ.20 కోట్ల అంచనాతో రాష్ట్ర పర్యాటకశాఖ గ్రీన్‌సిగ్నల్
- అంతర్జాతీయస్థాయి పరిజ్ఞానంతో కాటేజీల నిర్మాణం
- ఫలించిన ఎంపీ వినోద్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కృషి

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కరీంనగర్ జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న లోయర్ మానేరు డ్యాం (ఎల్‌ఎండీ) మరో పర్యాటక ప్రాంతానికి కేంద్రంగా మారబోతున్నది. ఇప్పటికే డ్యాం దిగువ భాగంలో రూ. 551 కోట్లతో మానేరు రివర్‌ఫ్రంట్ ఏర్పాటుకు సీఎం కేసీఆర్ అనుమతిస్తూ నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. తాజాగా డ్యాం మధ్యలో నాలుగు ఎకరాల్లో ఉన్న మైసమ్మగుట్టపై రూ.20 కోట్లతో 'కేసీఆర్ ఐలాండ్' పేరుతో అత్యాధునిక హంగులతో టూరిస్టులను ఆకట్టుకునేలా పలు రకాల నిర్మాణాలు చేపట్టాలని పర్యాటకశాఖ నిర్ణయించింది. మొదటి దశలో రూ.5 కోట్లు కేటాయించారు.

డ్యాం పరిసరాలపై సీఎం కేసీఆర్‌కు పూర్తి పట్టు

డ్యాంతోపాటు మానేరు నదిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అంశంపై సీఎం కేసీఆర్ ముందునుంచీ దృష్టిపెట్టారు. డ్యాంతోపాటు పరిసర ప్రాంతాలపై సీఎం కేసీఆర్‌కు పూర్తి పట్టు ఉండటం దీనికి ప్రధాన కారణం. ఇందులో భాగంగానే డ్యాంకు దిగువన మానేరు రివర్ ఫ్రంట్‌ను రూ.551 కోట్లతో ఏర్పాటు చేయాలని నిర్ణయించి గత బడ్జెట్‌లోనే రూ. 350 కోట్లు కేటాయించారు. ఆ దిశగా పనులు కొనసాగుతున్నాయి. డ్యాం పరిసర ప్రాంతంలో సీఎం కేసీఆర్ ఐటీ టవర్ మంజూరు చేయగా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇదే ప్రాంతంలో ఒకవైపు ఉజ్వల పార్కు, మరోవైపు డీర్ పార్కు ఉన్నాయి. మానేరు రివర్ ఫ్రంట్ పూర్తయితే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా భాసిల్లనున్నది. ఈ పనులు సాగుతున్న తరుణంలోనే దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా తాజాగా కేసీఆర్ ఐలాండ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు.

కేసీఆర్ ఐలాండ్ ఏర్పాటు

కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయితే ఎల్‌ఎండీ ఏడాదిపొడవునా పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడనున్నది. దాంతో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన మైసమ్మగుట్టను మరింత రమణీయంగా తీర్చిదిద్దడంతోపాటు పర్యాటకరంగానికి కేరాఫ్‌గా మార్చాలని ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ భావించారు. ఆ మేరకు కరీంనగర్ సిటీ రెనోవేషన్‌లో భాగంగా మైసమ్మగుట్టపై కేసీఆర్ ఐలాండ్ ఏర్పాటు చేయాలని ఎంపీ, ఎమ్మెల్యే కొద్ది రోజుల కిందట నిర్ణయించారు. ఈ విషయాన్ని గత అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రస్తావించారు. సాధ్యాసాధ్యాలపై, ఇండోనేషియా, బెంగళూరుకు చెందిన ఇన్ఫినిట్యూడ్ డిజైన్స్ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించి మైసమ్మగుట్టపై అత్యద్భుతమైన పర్యాటక కేంద్రాన్ని ఏర్పాటు చేయవచ్చని ప్రాథమిక నివేదిక అందజేశారు. దీని ఆధారంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పర్యాటకశాఖతో చర్చించారు. రాష్ట్రంలో ప్రాజెక్టు మధ్యలో గుట్ట ఉండి, నలువైపులా నీళ్లున్న ప్రాంతం ఎక్కడా లేదన్న విషయాన్ని గుర్తించిన పర్యాటకశాఖ రూ.20 కోట్లతో 'కేసీఆర్ ఐలాండ్'కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ప్రపంచస్థాయి పరిజ్ఞానంతో నిర్మాణాలు

కేసీఆర్ ఐలాండ్‌ను ప్రపంచస్థాయి పరిజ్ఞానంతో నిర్మించనున్నారు. ప్రతి నిర్మాణాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్ది పర్యాటకులను విశేషంగా అకట్టుకునేలా ఇప్పటికే ఇన్ఫినెట్యూడ్ డిజైన్ కంపెనీ తమ ప్రణాళికతోపాటు డిజైన్లు అందజేసింది. ఈ డిజైన్లను ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు. అనంతరం కంపెనీ ప్రతినిధులు వాటిని పర్యాటకశాఖకు అప్పగించారు.

కేసీఆర్ ఐలాండ్ విశేషాలు..

- ఆధునిక హంగులతో అత్యంత విశాలంగా ఎంట్రెన్స్ లాబీ.
- పూర్తిగా అద్దాలతో బాంకెట్ హాల్, మెడిటేషన్ హబ్, యూనెక్స్ పార్లర్, డబుల్ కాట్ బెడ్స్‌తోపాటు ఆధునిక వసతులతో ఐదు ప్రీమియం సూట్స్.
- ఇండోనేషియా ఆర్కిటెక్చర్ నమూనాలో 18 వెదురు కాటేజీలు.
- 40 మందికిపైగా విందు చేసుకునేందుకు వీలుగా ఫ్లోటింగ్ రెస్టారెంట్.
- క్యాండిల్‌లైట్ డిన్నర్, కాక్‌టెల్ పార్టీల కోసం నలుమూలలా ఫ్లోటింగ్ బ్రిడ్జీలు.
- సెవెన్‌స్టార్ హోటల్‌కు మించిన సదుపాయాలతో వీవీఐపీల కోసం గుట్టపైభాగంలో ప్రెసిడెన్షియల్ సూట్.
- పిల్లలు, పెద్దలకు వేరువేరుగా స్విమ్మింగ్ పూల్స్.
- రెండు ఎలివెటేడ్ బ్రిడ్జీలు.
- పర్యాటకులు వివిధ సూట్స్‌కు వెళ్లడానికి కావాల్సిన లిఫ్టులు.



క్యాండిల్ లైట్ డిన్నర్, కాక్‌టేల్ పార్టీల కోసం ఫ్లోటింగ్ బ్రిడ్జి నమూనా చిత్రం

ఏడాదిలో పూర్తిచేస్తాం



కరీంనగర్ రెనోవేషన్ సిటీలో భాగంగా నిర్మించనున్న కేసీఆర్ ఐలాండ్‌ను ఏడాదిలోపు పూర్తిచేయడానికి కాంట్రాక్టు సంస్థలు మాకు హామీ ఇచ్చాయి. ఇది పూర్తయితే దేశ, విదేశాల నుంచి పర్యాటకులు తరలివస్తారు. యుద్ధప్రాతిపదికన పనులు చేయడానికి కరీంనగర్ కార్పొరేషన్‌కు సీఎం కేసీఆర్ ఇచ్చిన రూ.100 కోట్ల నుంచి రూ.3 కోట్లు కేటాయించాం. మరో రూ.2 కోట్లను పర్యాటకశాఖ కేటాయించింది. దశలవారీగా జరిగే నిర్మాణాలకు ముందుముందు కావాల్సిన నిధులను కేటాయిస్తాం. కేసీఆర్ ఐలాండ్ కరీంనగర్‌కే కాదు యావత్ తెలంగాణకు ఒక మణిహారంలా నిలువనున్నది.

- గంగుల కమలాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే

పర్యాటకరంగానికే ఐకాన్‌గా నిలుస్తుంది



సాధారణంగా సముద్రాల్లో ఈ తరహా ఐలాండ్లను ఏర్పాటుచేస్తారు. అక్కడ ఎక్కువ రోజులు బస చేయలేం. కానీ ఎల్‌ఎండీ దీనికి పూర్తిగా భిన్నం. మంచి నీళ్ల మధ్య ఏర్పాటుచేసే ఈ పర్యాటక ప్రాంతానికి ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంటుందని భావిస్తున్నాం. ఎల్‌ఎండీలో ఉన్న గుట్ట మన రాష్ట్రంలో మరే ప్రాజెక్టులోనూ కనిపించదు. అందులోనూ నాలుగు ఎకరాల గుట్ట ఉండటం వల్ల ఆ స్థలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవచ్చు. ప్రపంచస్థాయి పరిజ్ఞానంతో నిర్మించే కేసీఆర్ ఐలాండ్ తెలంగాణ పర్యాటకరంగానికే ఒక ఐకాన్‌గా నిలుస్తుంది. దశలవారీగా పనులను పకడ్బందీగా చేస్తాం. పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేసేలా నిర్మాణాలుంటాయి.

- మనోహర్‌రావు, ఎండీ, పర్యాటకశాఖ

8,912 గ్రామాల్లో కంటిపరీక్షలు పూర్తి

- 1,46,51,778 మందికి పరీక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంధత్వ రహిత తెలంగాణ సాధన లక్ష్యంగా ప్రారంభించిన కంటివెలుగు కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతున్నది. ఈ కార్యక్రమం ప్రారంభించిన నాటినుంచి గురువారం వరకు 108 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1,46,51,778 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 22,04,420 మందికి కండ్లద్దాలను అందజేశారు. మరో 17,30,049 మందికి ప్రత్యేక అద్దాలు ప్రతిపాదించారు. శస్త్రచికిత్సలకు 8,96,761 మందిని రెఫర్‌చేశారు. ఇప్పటివరకు రాష్ట్రంలోని 8,912 గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలోని 810 వార్డుల్లో కంటి వైద్య శిబిరాల నిర్వహణ పూర్తయింది. కాగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 68,423 మందికి కంటిపరీక్షలు చేసి.. 4,351 మందికి కండ్లద్దాలు పంపిణీచేశారు. మహబూబాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 5,20,795 మందికి కంటిపరీక్షలు నిర్వహించి.. 55,956 మందికి కండ్లద్దాలు పంపిణీచేశారు. శస్త్రచికిత్సలకు 43,259 మందిని రిఫర్‌చేశారు. కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 407 గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి.. 5,11,882 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. వీరిలో 74,736 మందికి కండ్లద్దాలను పంపిణీచేశారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో మొత్తం 3,13,960 మందికి పరీక్షలుచేశారు. వీరిలో 42,962 మందికి అద్దాలు పంపిణీచేశారు. 14,762 మందిని ఆపరేషన్ల కోసం రెఫర్‌చేశారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 6,93,375 మందికి కంటిపరీక్షలుచేసి.. 1,15,451 మందికి కండ్లద్దాలు అందజేశారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు 5,95,367 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా.. కొత్తగూడెం జిల్లాలో 4,83,264 మందికి కంటిపరీక్షలు చేశారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లిలో కంటిపరీక్షల కోసం క్యూలో ఉన్న మహిళలు

కంటి వైద్యశిబిరాల్లో సేవలు పొందినవారి సంఖ్య

క్యాటగిరీ	గురువారం	మొత్తం శిబిరాల్లో
పరీక్షలు చేయించుకున్నవారు	68,423	1,46,51,778
రీడింగ్ అద్దాలు పొందినవారు	4,351	22,04,420
ప్రత్యేక అద్దాలకు ప్రతిపాదన	4,451	17,30,049
కంటి సమస్యలపై రెఫరల్	2,628	8,96,761



108వ రోజు

తలనొప్పి తగ్గింది



కంటివెలుగు శిబిరంలో కంటిపరీక్షలు చేయించుకున్నాను. నాకు కండ్లద్దాలు ఇచ్చిండ్రు. అవి పెట్టుకుంటే మంచిగా కనవడుతున్నది. తలనొప్పి కూడా తగ్గింది. కేసీఆర్ సారుకు ధన్యవాదాలు.

- బచ్చు మనీష, బోయినపల్లి, రాజన్న సిరిసిల్ల

పారిశ్రామిక పార్కులకు మూడు టీఎంసీల నీళ్లు

- 80 కొత్త పార్కులకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా
- ప్రభుత్వానికి టీఎస్‌ఐఐసీ నివేదిక



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్‌ఐఐసీ ద్వారా కొత్తగా ఏర్పాటయ్యే పారిశ్రామిక పార్కులకు ఏడాదికి మూడు టీఎంసీల నీరు అవసరముంటుందని అంచనావేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలి కాలంలో పెద్దఎత్తున కొత్త పారిశ్రామిక పార్కుల పనులను ప్రారంభించింది. మరికొన్ని ప్రతిపాదన దశలో ఉన్నాయి. వీటన్నింటినీ క్యాటగిరీలవారీగా విభజించి వాటికి అవసరమైన నీటిసరఫరాపై రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనల ప్రకారం 80 కొత్త పారిశ్రామిక పార్కులు ఏర్పాటుకానున్నాయి. వీటన్నింటికీ ఏడాదికి మూడు టీఎంసీలు అవసరమవుతాయని అంచనావేశారు. ఔటర్ రింగ్ రోడ్ అవతల ఏర్పాటయ్యే పారిశ్రామిక పార్కులకు మిషన్ భగీరథ ద్వారా పార్కు స్థలంవరకు నీటిని అందిస్తారు. పార్కులో అంతర్గతంగా నీటిసరఫరా చేసే బాధ్యతలను టీఎస్‌ఐఐసీ తీసుకోవాల్సి ఉంటుంది. పారిశ్రామిక పార్కుల్లో ఉద్యోగులకు, కార్మికులకు, యంత్రాలకు నీరు అవసరం ఉంటుంది. కొన్ని రకాల కంపెనీలకు నీటి వినియోగం అత్యధికంగా, మరికొన్నింటికి పరిమితంగా ఉంటుంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని అంచనాలను రూపొందించారు. పారిశ్రామికవాడల్లో కంపెనీల అవసరాలను సాంకేతికంగా అంచనా వేసి టీఎస్‌ఐఐసీ పంపిణీ చేస్తుంది. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఏర్పాటయ్యే పారిశ్రామిక పార్కులకు హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ నీటిని అందించనున్నది. పార్కుల్లో అంతర్గతంగానూ పంపిణీ చేస్తారు. టీఎస్‌ఐఐసీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అనేక పారిశ్రామిక పార్కులు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటికి అవసరమైన మౌలిక సదుపాయాల పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే మౌలిక సదుపాయాలు పనులు ప్రారంభమై నీటి అవసరాల కోసం చూస్తున్న పార్కులను మొదటి ప్రాధాన్యంగా నీటి సరఫరా పనులు చేయాలని నిర్ణయించారు. ఫార్మా సిటీ, జహీరాబాద్ నిమ్జ్, వరంగల్ రూరల్ జిల్లాలో మెగా టెక్స్‌టైల్ పార్కు, సుల్తాన్‌పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్కు, ఫిక్కి లేడీస్ పార్కు, ఎమ్మెస్‌ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు, చందన్ వ్యాలీ ఇండస్ట్రియల్ పార్కు, ఎల్‌ఈడీ పార్కు, సీడ్ పార్కు, ప్లాస్టిక్ పార్కు, ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ) ఇలా అనేక పార్కులకు నీటిని సరఫరాచేసేందుకు సమగ్ర ప్రణాళికను సమర్పించారు. గత నెలలో పారిశ్రామిక పార్కులకు నీటి సరఫరాపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సమీక్షించారు. టీఎస్‌ఐఐసీ పారిశ్రామికపార్కుల అవసరాలపై సమగ్ర నివేదిక, మ్యాపులతో సమర్పించాలని సూచించారు. ఈ నేపథ్యంలో టీఎస్‌ఐఐసీ అధికారులు పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి అందించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల పర్యావరణానికి హాని కలిగించే ఎలాంటి పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయడంలేదు. ఈ నేపథ్యంలో ఓఆర్‌ఆర్ లోపల తక్కువ నీటి అవసరాలు ఉంటాయని అంచనావేశారు.

నేటినుంచి జేఈఈ మెయిన్ 2 దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జేఈఈ మెయిన్ 2 దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. దరఖాస్తులకు మార్చి 7 చివరి తేదీ. ఏప్రిల్ 6 నుంచి 20 వరకు జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. జేఈఈ మొదటి విడుత పరీక్షలు రాసినవారుకూడా ఈ పరీక్షలకు హాజరుకావచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షల తర్వాత ర్యాంకులను విడుదల చేస్తారు.

సాంకేతికతతో ఫిజికల్ ఈవెంట్స్

- తొలిసారిగా ఆర్‌ఎఫ్ఐడీ చిప్స్
- సిబ్బందికి ప్రత్యేక శిక్షణ పూర్తి
- రోజుకు వెయ్యి మందికి పరీక్ష
- ఎస్సై, కానిస్టేబుల్ ఈవెంట్స్‌కు సిద్ధమవుతున్న టీఎస్ఎల్పీఆర్బీ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: రాష్ట్రంలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 11 నుంచి ఫిజికల్ ఈవెంట్స్‌ను నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్పీఆర్బీ) సిద్ధమవుతున్నది. ఎక్కడా చిన్న పొరపాటుకు తావు లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నది. ఇప్పటికే ఈవెంట్స్‌కు అర్హత సాధించిన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు మంగళవారం నుంచి అడ్మిట్‌కార్డులు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఈసారి ఫిజికల్ మెజర్‌మెంట్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌ల నిర్వహణలో పూర్తిస్థాయిలో టెక్నాలజీని టీఎస్ఎల్పీఆర్బీ వాడనున్నది. తద్వారా పారదర్శకత పెరుగడంతోపాటు ఈవెంట్స్ నిర్వహణలో సిబ్బంది సంఖ్య సైతం తగ్గనున్న ది. అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా పూర్తయింది. రోజుకు వెయ్యి మంది పురుష అభ్యర్థులకు, 1400 మంది చొప్పున మహిళా అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించనున్నట్టు టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు.

హై జంప్ మినహా అన్ని సాంకేతికంగానే

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంట్స్ టెస్ట్‌లను డిజిటల్ మీటర్ల ద్వారా కొలువనున్నారు. అభ్యర్థుల ఎత్తు, ఛాతిలను ఈ పద్ధతిలో రీడింగ్‌లు నమోదుచేస్తారు. ప్రతి కొలత వెంటనే కంప్యూటర్‌లోని అభ్యర్థి వివరాల జాబితాలో నమోదవుతుంది. అది సర్వర్‌లోకి వెళ్తుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ కొలతలు మార్చే వీలుండే అవకాశం ఉండబోదు.

ఆర్‌ఎఫ్ఐడీ చిప్స్‌తో పరుగు ఈవెంట్

పరుగు ఈవెంట్‌లో ఈసారి రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్‌ఎఫ్ఐడీ) చిప్స్ వినియోగించనున్నారు. ఈ విధానంలో అభ్యర్థికి చిన్న ట్యాగ్‌లాంటివి అంటిస్తారు. పరుగుపందెం మొదలయ్యేచోట ఒక లేజర్ సెన్సార్ ఉంటుంది. పరుగు ప్రారంభించగానే అది నమోదుచేస్తుంది. పరుగు ముగిసేచోట మరో లేజర్ సెన్సార్ ఉంటుంది. అది పరుగు ఎంత సమయంలో పూర్తిచేసింది నమోదుచేస్తుంది. ఈ రికార్డు ఆటోమెటిక్‌గా కంప్యూటర్‌లో నమోదవుతుంది. 800 మీటర్ల పరుగుకు మూడురౌండ్లలో దీన్ని లెక్కించి, నమోదు చేస్తారు. లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో కొలతలను గతంలో మాదిరిగా టేప్‌లతో కాకుండా సివిల్ ఇంజినీరింగ్ వాళ్లు వినియోగించే థియోడొలైట్ పరికరాన్ని వినియోగించి లెక్కించనున్నారు.



సతీమణి జ్ఞాపకార్థం.. గులాబీ

న్యూఢిల్లీ: దేశ తొలి ప్రధాని నెహ్రూ తాను ధరించే కోటుపై రోజు గులాబీ పువ్వును ఎందుకు పెట్టుకునేవారన్న దానికి జవాబు లభించింది. 'దీర్ఘకాల అనారోగ్యం తో ఆయన భార్య కమలా నెహ్రూ 1938లో మరణించారు. ఆమెతో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకోవడానికి నెహ్రూ ప్రతి రోజు గులాబీ పువ్వును కోటుకు ధరించేవారు' అని కాంగ్రెస్ పార్టీ గురువారం రోజ్‌డే సందర్భంగా తెలిపింది.

భార్య హత్యకు ఇండియన్ అమెరికన్ కుట్ర

- సహకరించిన ప్రియురాలు
- కిరాయి హంతకుడిగా వచ్చి భగ్నం చేసిన పోలీసు



నర్సన్ లింగాల, సంధ్యారెడ్డి

వాషింగ్టన్: భారత సంతతి అమెరికన్ తన ప్రియురాలితో కలిసి మాజీ భార్యహత్యకు పన్నిన కుట్ర భగ్నమైంది. కిరాయి హంతకుడిగా పోలీసు వచ్చాడని తెలియక తన కుతంత్రాన్నంతా చెప్పి కటకటాలపాలయ్యాడు. నర్సన్ (55)కు 1995లో వివాహమైంది. వారికో కొడుకు, కూతురు ఉన్నారు. నర్సన్ 2011లో భార్య తో గొడవపడి విడిపోయాడు. ఆస్తి పంపకాల్లో ఏకాభిప్రాయం రాక విడాకుల కేసు పెండింగ్‌లో ఉంది. గతేడాది మే నెలలో వేరే కేసులో నర్సన్ మిడిల్‌సెక్స్ కౌంటీ పోలీస్ కస్టడీలో ఉన్నప్పుడు మరో ఖైదీని పరిచయం చేసుకొని తన భార్య హత్యకు ఒక కిరాయి హంతకుడిని చూపెట్టమన్నాడు. నర్సన్ గత ఆగస్టులో పోలీసు కస్టడీ నుంచి బయటకొచ్చాక ప్రియురాలు సంధ్యారెడ్డి (52)తో కలిసి న్యూజెర్సీలోని ఓ షాపింగ్ మాల్ వద్ద హంతకుడిగా వచ్చిన పోలీసుతో కలిసి పథకం రచించారు. 5000-10 వేల డాలర్లకు బేరం కుదిరింది. వీరికి తెలియకుండా సంభాషణను పోలీసు వీడియో తీశాడు. ఆ వెంటనే వారిని చుట్టుముట్టిన పోలీసులు నర్సన్‌ను, సంధ్యారెడ్డి అరెస్టు చేశారు. గురువారం మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు.

తండ్రి ముందే యువతిపై సామూహిక లైంగికదాడి

కిషన్‌గంజ్ (బీహార్), ఫిబ్రవరి 7: బీహార్‌లో ఘోరం జరిగింది. 19 ఏండ్ల యువతిపై ఆమె తండ్రి ముందే ఆరుగురు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ దారుణం కిషన్‌గంజ్ జిల్లా కోదివాడి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆరుగురు దుండగులు బలవంతంగా యువతి ఇంట్లోకి ప్రవేశించి ఆమెతోపాటు ఆమె తండ్రిని కూడా నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అనంతరం యువతి తండ్రిని తాడుతో కట్టేసి ఆయన ముందే యువతిపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ విషయం బయట చెబితే చంపేస్తామని బెదిరించి వెళ్లిపోయారు. తీవ్ర బాధలో ఉన్న తండ్రి బిడ్డ కలిసి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దుండగులను పట్టుకోవడానికి గాలిస్తున్నారు.



మమతతో కలిసి ధర్నాలో పాల్గొన్న పోలీస్ ఉన్నతాధికారులు(ఫైల్)

బెంగాల్ పోలీస్ అధికారులపై కేంద్రం కన్నెర్ర

- మమత ధర్నాలో పాల్గొన్న ఐదుగురిపై తీవ్ర చర్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ ఇటీవల చేపట్టిన ధర్నాలో పాల్గొన్న ఆ రాష్ట్ర డీజీపీ సహ ఐదుగురు పోలీసు ఉన్నతాధికారులపై క్రమశిక్షణా చర్యలకు కేంద్రం సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా వారికి లభించిన ప్రతిభ అవార్డులను వెనుకకు తీసుకోవడం, సీనియారిటీ జాబితా నుంచి వారి పేర్ల తొలిగింపు వంటి చర్యలు ఉండవచ్చని భావిస్తున్నారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌పైనా దాదాపు ఇటువంటి చర్యలే ఉండవచ్చునని అధికార వర్గాల కథనం. మమతతోపాటు ధర్నాలో కూర్చున్నందుకు రాజీవ్‌కుమార్‌పై చర్య తీసుకోవాలని కేంద్ర హోంశాఖ పట్టుబడుతున్నట్టు తెలిసింది. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు ఈనెల 4న కోల్‌కతాలో సీఎం మమత ఆకస్మికంగా చేపట్టిన ధర్నాలో పాల్గొనడాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తున్నదని ఓ హోం శాఖ అధికారి తెలిపారు. డీజీపీ వీరేంద్రకుమార్, ఏడీజీలువినీత్‌కుమార్ గోయల్, అనుజ్ శర్మ, బిధాన్‌నగర్ పోలీస్ కమిషనర్ జ్ఞాన్‌వంత్‌సింగ్, అదనపు పోలీస్ కమిషనర్ సుప్రీతం సర్కార్‌పై కేంద్ర హోం శాఖ చర్యలకు ఉపక్రమించినట్టు ఆ అధికారి చెప్పారు. వీరికి ఇంతవరకు లభించిన ప్రతిభ అవార్డుల ఉపసంహరణతోపాటు కొంతకాలం వారు కేంద్రం సేవల్లో పాల్గొనకుండా నిషేధం విధించే అవకాశమూ ఉన్నట్టు తెలిపారు. ఆల్ ఇండియా సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించిన ఈ అధికారులపై చర్య తీసుకోవాలని కేంద్రం పశ్చిమ బెంగాల్ సర్కార్‌కు కూడా సూచించింది. యూనిఫాం ధరించే దళాలకు చెందిన అధికారులు నియమావళికి కట్టుబడి ఉండేలా, తమ హోదాకు తగినట్టు వ్యవహరించేలా చర్య తీసుకోవాలని పేర్కొంటూ కేంద్రం త్వరలోనే అన్ని రాష్ట్రాలకు ఒక సూచనను జారీ చేయనున్నట్టు తెలిసింది.

రెండోరోజూ ప్రశ్నల వర్షం



న్యూఢిల్లీలోని ఈడీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న రాబర్ట్ వాద్రా

- రాబర్ట్ వాద్రాను వెంటాడుతున్న ఈడీ
- 9 గంటలు ప్రశ్నించిన అధికారులు.. నేడు కూడా
- ఈడీ ఆఫీస్‌కు వచ్చి భర్తను తీసుకెళ్లిన ప్రియాంక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: హవాలా మార్గంలో విదేశాలకు డబ్బు తరలించి అక్కడ ఆస్తులు కొనుగోలు చేశారన్న ఆరోపణపై సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వరుసగా రెండోరోజు 9 గంటల పాటు ప్రశ్నించింది. గురువారం ఉదయం 11.25 గంటలకు వాద్రా తన న్యాయవాదులతో కలిసి ఈడీ కార్యాలయానికి వచ్చారు. రాత్రి 9.30 గంటల సమయంలో ప్రియాంక గాంధీ వచ్చి ఆయనను తీసుకెళ్లారు. బుధవారం దాదాపు ఐదున్నర గంటలపాటు ఆయనను ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మళ్లీ శుక్ర లేదా శనివారం మరోసారి ప్రశ్నించ నుంది. బ్రిటన్‌లో స్థిరాస్తుల కొనుగోలుకు సంబంధించి మరికొన్ని ప్రశ్నలకు ఆయన జవాబులు చెప్పాల్సి ఉన్నదని, అందుకే ఆయనను మరోసారి రావాలని కోరామని ఈడీ అధికారులు చెప్పారు. ఆయన చెప్పే సమాధానాలను హవాలా చట్టం కింద రికార్డు చేస్తామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ముగ్గురు ఈడీ అధికారులు వాద్రాను డజనుకుపైగా ప్రశ్నలు వేసినట్టు తెలిసింది. తన భార్య, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొత్తగా నియమితులైన ప్రియాంక గాంధీతో కలిసి ఆయన బుధవారం ఈడీ కార్యాలయానికి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అధికార బీజేపీ ఈ కేసును అడ్డం పెట్టుకొని తమ కుటుంబాన్ని వేధిస్తున్నదని, కుటుంబమంతా కలిసే దీనిని ఎదుర్కొంటామన్న సందేశం ఇచ్చేందుకే ప్రియాంక స్వయంగా తన భర్తను ఈడీ కార్యాలయానికి తీసుకొచ్చారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అక్రమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వాద్రా ఒక దర్యాప్తు సంస్థ ఎదుట హాజరు కావడం ఇదే మొదటిసారి. విదేశాలలో తనకెటువంటి ఆస్తిపాస్తులు లేవని వాద్రా చెప్తున్నారు. ఈడీ దర్యాప్తును ఆయన తమపై సాగుతున్న రాజకీయ కక్షసాధింపు చర్యగా పేర్కొన్నారు. ఈడీ అధికారుల అన్ని ప్రశ్నలకు వాద్రా జవాబు చెప్పారని, ఆయనపై మోపిన అభియోగాలన్నీ తప్పు అని వాద్రా తరఫు న్యాయవాది సుమన్ జ్యోతి ఖైతాన్ చెప్పారు. మరో కేసుకు సంబంధించి వాద్రా ఈ నెల 12న జైపూర్‌లోని ఈడీ కార్యాలయంలో హాజరు కావాల్సి ఉంది. బికనీర్‌లో జరిగిన ఓ భూకుంభకోణానికి సంబంధించిన కేసులో ఈడీకి సహకరించాలని రాజస్థాన్ హైకోర్టు వాద్రాను ఆదేశించింది.

ఐఎన్‌ఎక్స్ కేసులో కార్తీని ప్రశ్నించిన ఈడీ



రాబర్ట్ వాద్రాతోపాటు కేంద్ర ఆర్థిక మాజీ మంత్రి పీ చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం కూడా ఈడీ ఎదుట హాజరయ్యారు. ఐఎన్‌ఎక్స్ మీడియాకు సంబంధించి కార్తీ కూడా హవాలా కేసును ఎదుర్కొంటున్నారు. కార్తి వచ్చిన అరగంట తరువాత వాద్రా వచ్చారు. దీంతో ఢిల్లీ జామ్‌నగర్ ప్రాంతంలోని ఈడీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మీడియా సిబ్బందిని లోపలికి అనుమతించలేదు. వారి కోసం బయటే ప్రత్యేకంగా బారికేడ్లు నిర్మించారు. రాజకీయంగా ప్రాముఖ్యతగల్గిన ఇద్దరు ప్రముఖులు విచారణకు హాజరు కావడంతో ఈడీ కార్యాలయం సందడిగా కనిపించింది.



- మాంసం వినియోగం విపరీతంగా పెరుగడంతో ప్రమాదం అంచున జంతుజాతులు
- కనుమరుగయ్యే దశలో 150 జాతులు
- విచ్చలవిడిగా జంతువధ
- అధ్యయనంలో వెల్లడి

రాకాసి తిండి!

వాషింగ్టన్, ఫిబ్రవరి 7: మనిషి మాంసాహార అలవాటు భారీ జంతువుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని తాజా అధ్యయనంలో వెల్లడైంది. మాంసం వినియోగం విపరీతంగా పెరుగడంతో కనీసం 150 జంతుజాతులు భూమిపై నుంచి కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 200 జీవజాతుల సంఖ్య ఆందోళకరస్థాయిలో తగ్గుతున్నదన్నది. అమెరికాలోని ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విలియం రిపిల్ అధ్యయనం చేసిన పరిశోధన ఫలితాలు 'కన్జర్వేషన్ లెటర్స్' అనే అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా 300 జంతు జాతుల్ని విలియం బృందం అధ్యయనం చేసింది. గత 100 ఏండ్ల కాలంలో మాంసం వినియోగం భారీగా పెరిగిందని విలియం చెప్పారు. దీని వల్ల 'మెగా పౌనా' (భారీ జంతువుల)లో 70% క్షీణించే దశలో ఉన్నాయని, 59 శాతం అంతరించిపోయే దశలో ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. 'ప్రపంచవ్యాప్తంగా మాంసం వినియోగం గణనీయంగా పెరిగింది. పెద్దసంఖ్యలో వెన్నెముక గల జంతువుల్ని వధిస్తున్నారు. భవిష్యత్‌లో వీటి ఉనికి ప్రశ్నార్థకం కావచ్చు. ఈ జాతుల్ని కాపాడాల్సిన ఆవశ్యకత పౌరులపై ఉంది. లేదంటే పర్యావరణ సమతుల్యతపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుంది. అనేక సమస్యలు తలెత్తవచ్చు' అని విలియం పేర్కొన్నారు. గత 500 ఏండ్లుగా వన్యప్రాణుల్ని వధించే ప్రక్రియ ఎక్కువైందని విలియం చెప్పారు. అత్యాధునిక పరికరాలు, వస్తువులతో వేట సులువుగా మారిందని, దీంతో జంతువుల వధ పెరిగిందని పేర్కొన్నారు. ఇటీవల మాంసం వినియోగం పెరుగడంతో భారీ జంతువుల్ని విచ్చలవిడిగా వధిస్తున్నారని తెలిపారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా 2 శాతం జంతుజాలం ఉనికి కనుమరుగయ్యే అవకాశం ఉందని విలియం హెచ్చరించారు. 'వెన్నెముక గల జంతువుల మాంసాన్ని మనుషులు అధికంగా వినియోగిస్తున్నారు. ఆసియా దేశాల్లో సంప్రదాయ వైద్యవిధానంలో జంతువుల శరీరభాగాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఫలితంగా వాటి జనాభా గణనీయంగా తగ్గుతున్నది' అని చెప్పారు. గత 250 ఏండ్లలో రెండు రకాల భారీ తాబేళ్లలో ఒకటి 2012లో అంతరించిందని విలియం గుర్తుచేశారు. అలాగే రెండు జింక జాతులు కూడా కనుమరుగయ్యాయని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా వేటగాళ్లు విజృంభిస్తున్నారని, ఉచ్చులు పెట్టి భారీ సంఖ్యలో జీవాలను హతమారుస్తున్నారని చెప్పారు. వందల ఏండ్లుగా జీవించి ఉన్న ఉభయచరాల్లో చైనాకు చెందిన సాలమండర్ కూడా అంతరించిపోయే దశలో ఉందని విలియం హెచ్చరించారు. మరో తొమ్మిది జాతులు పూర్తిగా కనుమరుగయ్యే దశలో ఉన్నాయని పేర్కొన్నారు. జనాభా విస్ఫోటనం, అభివృద్ధి పేరుతో భారీగా పర్యావరణ విధ్వంసం, పారిశ్రామికీకరణ వల్ల పెరిగిన కాలుష్యంతో జీవజాతులకు ముప్పు పెరిగిందని చెప్పారు.

లక్ష్మీనరసయ్యకు అరుణ్‌సాగర్ సాహితీ పురస్కారం

పదో తేదీన విజయవాడలో ప్రదానం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సీనియర్ జర్నలిస్టు, విలక్షణ కవి అరుణ్‌సాగర్ సాహితీపురస్కారం-2018కి ప్రముఖ కవి, విశ్లేషకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య ఎంపికయ్యారు. వచ్చే ఆదివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం పది గంటలకు నిర్వహించే అరుణ్‌సాగర్ మూడో వర్ధంతిసభలో అవార్డును లక్ష్మీనరసయ్యకు ప్రదానంచేస్తారు. అరుణ్‌సాగర్ ట్రస్టు తరపున టీవీ5 సౌజన్యంతో అవార్డును అందజేస్తున్నట్టు ట్రస్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

అన్నికోణాల్లో దర్యాప్తు చేస్తాం

హైదరాబాద్ సీపీ అంజనీకుమార్.. జూబ్లీహిల్స్ పీఎస్‌కు జయరాం కేసు

శిఖాచౌదరికి ఏపీ పోలీసులు క్లీన్‌చిట్ ఎలా ఇస్తారు: పద్మశ్రీ

హైదరాబాద్, సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: సంచలనం సృష్టించిన చిగురుపాటి జయరాం హత్యకేసు హైదరాబాద్‌కు బదిలీఅయింది. సంఘటన జరిగిన ప్రాంతం ఆధారంగా కృష్ణా జిల్లా ఎస్పీ కేసును హైదరాబాద్‌కు బదిలీచేశారని.. స్పెషల్ మెసెంజర్ ద్వారా అందిన కేసు ఫైల్‌ను స్వీకరించామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ గురువారం వెల్లడించారు. తమకు అందిన డాక్యుమెంట్లను పరిశీలించిన అనంతరం.. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో దీనిపై కేసు నమోదుచేస్తామని తెలిపారు. కేసు దర్యాప్తును బంజారాహిల్స్ ఏసీపీకి అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. ప్రవాసభారతీయుడు, పారిశ్రామికవేత్త జయరాం ఈ నెల 1 న ఏపీలోని కృష్ణాజిల్లా నందిగామలో హైవే పక్కన కారులో శవమై కన్పించాడు. హత్య జరిగింది హైదరాబాద్‌లోనని, ఏపీ పోలీసుల దర్యాప్తులో పారదర్శకత లేదని జయరాం భార్య పద్మశ్రీ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఏపీ డీజీపీ ఠాకూర్.. జయరాం హత్య జరిగిన ప్రాంతం హైదరాబాద్ కావడంతో కేసును బదిలీచేస్తున్నట్టు బుధవారం ప్రకటించారు. గురువారం కేసు వివరాలు హైదరాబాద్ పోలీసులకు అందా యి.

రాకేశ్‌రెడ్డి ఎవరో తెలియదు..

జయరాం హత్య కేసు నిందితుడు రాకేశ్‌రెడ్డి అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని పద్మశ్రీ తెలిపారు. ఆయన జయరాంకు రూ. నాలుగున్నర కోట్లు ఇచ్చాడనడంలో వాస్తవం లేదన్నా రు. తన భర్తకు ఇతర మహిళలతో సంబంధాలున్నాయనటం బాధ కలిగిస్తున్నదని చెప్పారు. తన భర్త ఎక్కడ ఉన్నా రోజూ కనీసం పదిసార్లయినా ఫోన్ చేసేవారని చెప్పారు. తెలంగాణ పోలీసులు న్యా యం చేస్తారన్న నమ్మకం ఉన్నదని పద్మశ్రీ మీడియాతో చెప్పారు. శిఖాచౌదరిని వదిలేసి రాకేశ్‌రెడ్డిపైనే కేసును రుద్దుతున్నారని అన్నారు.

శిఖాపాత్రపై అనుమానాలున్నాయి: జయరాం భార్య పద్మశ్రీ

తన భర్త చిగురుపాటి జయరాం హత్యవెనుక శిఖాచౌదరి ప్రమేయం ఉన్నదని ఆయన భార్య పద్మశ్రీ అనుమానం వ్యక్తంచేశారు. తమ ఆస్తులు లాక్కునేందుకే ప్రియుడితో కలిసి జయరాంను హత్యచేయిందని ఆరోపించారు. గురువారం పద్మశ్రీ మీడియాతో మాట్లాడుతూ శిఖాచౌదరి వ్యవహారంపై మొదట్నుంచీ అనుమానం ఉండేదని, ఆమెతో తన భర్తకు ప్రాణహాని ఉంటుందని ఐదేండ్ల క్రితం నుంచే భయపడ్డానని వెల్లడించారు. హత్యకు ప్లాన్‌చేసింది శిఖాయేనని, పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే అన్ని విషయాలు బయటపడతాయని తెలిపారు. జయరాం చనిపోయిన విషయం తెలిసిన వెంటనే నందిగామ వెళ్లకుండా దౌర్జన్యంగా తన ఇంట్లో చొరబడి కీలకపత్రాలు, విలువైన వస్తువులు తీసుకుపోయిందని ఆరోపించారు. దీనిపైనే తాను జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. శిఖాచౌదరికి ఏపీ పోలీసులు క్లీన్‌చిట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. శిఖాచౌదరిని విచారిస్తే అన్ని నిజాలు బయటకు వస్తాయన్నారు.

విశాఖ శారదా పీఠం ప్రాంగణంలో అష్టబంధన మహాకుంభాభిషేకం

స్వామిస్వరూపానందేంద్ర ఆధ్వర్యంలో 10 నుంచి 14 వరకు నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విశాఖపట్టణం శారదా పీఠాధిపతి స్వామిస్వరూపానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో విశాఖలోని పీఠం ప్రాంగణంలో ఈ నెల 10 నుంచి 14 వరకు అష్టబంధన మహాకుంభాభిషేకం చేపట్టనున్నట్టు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి షణ్ముఖయాగం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 14న జరిగే మహాకుంభాభిషేకం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు.

అర్చకులకు వేతనాలిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే

సీఎం కేసీఆర్ చిత్రపటానికి అర్చక సమాఖ్య పాలాభిషేకం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ధూప, దీప నైవేద్య పథకం ద్వారా తెలంగాణలోని అర్చకులకు వేతనాలిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. అర్చకులకు, ఉద్యోగులకు వేతనాలివ్వడంపై హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని 1,840 దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రెండునెలల జీతాలు ఆన్‌లైన్‌లో అందించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అర్చక ఉద్యోగులకు వేతనాలివ్వడంతోపాటు వంశపారంపర్య హక్కులను పునరుద్ధరించి అర్చకుల రిటైర్మెంట్ వయస్సును 65 ఏండ్లకు పెంచిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అర్చకులు, బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ విధమైన పథకాలు అమలు చేయడంలేదని కొనియాడారు. కార్యక్రమంలో ఏటూరి అంజనేయచారి, జిల్లా నవీన్, రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

విషమంగానే మధులిక ఆరోగ్యం

మరో 24 గంటలు గడిస్తేగానీ ఏమీ చెప్పలేం

మీడియాకు వెల్లడించిన యశోద దవాఖాన వైద్యులు

చాదర్‌ఘాట్: ఉన్మాది చేతిలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న మధులిక ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నది. కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో విచక్షణారహితంగా దాడిచేయడంతో మధులిక తల, చేతులు, భుజాలపై తీవ్ర గాయాలయ్యాయి. ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి యశోద దవాఖాన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మధులిక ఆరోగ్య పరిస్థితిపై యశోద దవాఖాన సీవోవో డాక్టర్ విజయ్‌కుమార్, న్యూరోసర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బోట్లా, డాక్టర్ వేణుగోపాల్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ చంద్రమౌళి, జనరల్ సర్జన్ రాంబాబు గురువారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడారు. బాధితురాలికి పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తున్నామని, మరో 24 గంటలు గడిస్తేగానీ పరిస్థితి ఏమీ చెప్పలేమన్నారు. మధులిక ఆరోగ్యం నిన్నటి కంటే కొంత మెరుగుపడినా ఇంకా విషమంగానే ఉన్నదని చెప్పారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని మరోసారి విశ్లేషించి సర్జరీలు చేపట్టడంపై నిర్ణయం తీసుకొంటామని తెలిపారు.

కఠినంగా శిక్షించాలి: బాధితురాలి తండ్రి రాములు

తన కూతురిపై కత్తితో దాడికి పాల్పడిన ఉన్మాది భరత్‌ను కఠినంగా శిక్షించాలని మధులిక తండ్రి రాములు పోలీసులకు విజ్ఞప్తిచేశారు. తల్లితండ్రులకు కడుపుకోత పెడుతున్న ఉన్మాదులను వదిలేయవద్దని, ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తమను ఆదుకోవాలని కోరారు.

దున్నా.. దున్నపోతు..!



తిట్టిపోసుకున్న జగన్, చంద్రబాబు

అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటలయుద్ధం ము దురుతున్నది. దున్న, దున్నపోతు అంటూ ప్ర తిపక్ష నేత జగన్, సీఎం చంద్రబాబు ఒకరినొకరు తిట్టిపోసుకున్నారు. కడపలో గురువారం నిర్వహించిన సమర శంఖారావంలో చంద్రబాబుపై జగన్ తీవ్ర వ్యాఖ్యలుచేశారు. '57 నెలలు కడుపుమాడ్చి.. చివరి మూడునెలలు అన్నం పెడతాననేవాడిని ఎలా నమ్మాలి. చం ద్రబాబును అన్న అనాలా? దున్నా అనాలా?' అని విమర్శించారు. చంద్రబాబు తాజా సినిమా 'ఆరో బడ్జె ట్' ఫ్లాప్ అయిందని విమర్శించారు. 'తల్లికి అ న్నం పెట్టనివాడు.. చిన్నమ్మకు బంగారుగాజులు చేయిస్తానన్నాడట' అని ఎద్దేవాచేశారు. కాగా, జగన్ వ్యాఖ్యలపై చంద్రబాబు కూడా చెలరేగిపోయారు. తనను దున్న అన్నవాడు దున్నపోతని జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. గురువారం మచిలీపట్నం పోర్టు శంకుస్థాపన సభలో మాట్లాడుతూ ప్రతిపక్షం అసెంబ్లీకి రాదని, పార్లమెంట్లో ఉండదన్నారు. ప్రాజెక్టులను అడ్డుకునేందుకు కోర్టులకు వెళ్తున్న ప్రతిపక్షం మనకు అవసరమా? అని ప్రశ్నించారు.

రెవెన్యూ డివిజన్లుగా కోరుట్ల, కొల్లాపూర్

మొదటిపేజీ తరువాయి...

వస్తాయి. ఇప్పటి వరకు ఈ మూడు మండలాలు మెట్‌పల్లి డివిజన్‌లో కొనసాగాయి. ఎన్నికల ప్రచారం సందర్భంగా కోరుట్ల డివిజన్ డిమాండ్‌ను గుర్తించిన ఎంపీ కవిత, స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం ఎన్నికల సభలో హామీ ఇచ్చి.. అధికారంలోకి రాగానే ఉత్తర్వులు జారీ చేయడం విశేషం.

73 గ్రామాలతో కొల్లాపూర్ డివిజన్

నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కొల్లాపూర్ కొత్త డివిజన్‌గా అవతరించనున్నది. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాల పరిధిలోని 73 గ్రామాలతో కొల్లాపూర్ కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొల్లాపూర్ టీఆర్‌ఎస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన సీఎం కేసీఆర్ ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి జూపల్లి కృషితో సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించటంతోపాటు డివిజన్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయటంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి...

మావోయిస్టుల మృతదేహాలతోపాటు 11 తుపాకులు, ఓ రివాల్వర్, భారీగా మందుగుండు సామగ్రి, నిత్యావసర సరుకులను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. జవాన్ల ధాటికి తాళలేక కొందరు మావోయిస్టులు అటవీప్రాంతంలోకి పరారయ్యారని, ఆ ప్రాంతంలో రక్తపు జాడల ఆధారంగా మరికొంతమంది నక్సలైట్లు తీవ్రంగా గాయపడినట్లు గుర్తించామని, ప్రస్తుతం మృతుల వివరాలను సేకరిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటన అనంతరం ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.

నగర కాలేజీల వైపే!

నాణ్యమైన విద్య కోసం విద్యార్థుల మొగ్గు

మూసివేత ఎన్వోసీకి 13 ఇంజినీరింగ్ కాలేజీల దరఖాస్తు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యాభ్యాసానికి నగరాల బాటపడుతున్నారు. నాణ్యమైన విద్యతోపాటు ఇతర సౌకర్యాల కోసం ప్రధానంగా పూర్వ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశం పొంది.. చదువు కుంటూనే.. మరోవైపు పార్టుటైం ఉద్యోగాలు చేస్తున్నారు. నగరంలో చదువుతున్నట్లయితే ఉద్యోగంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడం వంటి అనేక బహుళ ప్రయోజనాలు ఉంటాయని విద్యార్థులు చెప్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకే అధిక డిమాండ్ ఉంటున్నది. రాష్ట్రంలోని డిగ్రీ, పీజీ కాలేజీల్లోనూ ఈ పరిస్థితులే ఉన్నాయి. మూసివేతకు ఎన్వోసీ ఇవ్వాలని ఇటీవల 13 ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు జేఎన్టీయూహెచ్‌కు దరఖాస్తు చేసుకున్నాయి. ఫ్యాకల్టీ కూడా జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీల్లో పనిచేయడానికి ముందుకురాకపోవడంతో డిగ్రీ కాలేజీలకు కూడా ఆదరణ కరువైంది. అక్కడి ప్రైవేటు డిగ్రీ కాలేజీలు క్రమేణా మూతపడుతున్నాయి. నాలుగేండ్లలో రాష్ట్రంలోని ఆరు వర్సిటీల పరిధిలో దాదాపు 200 పైగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు మూతపడ్డాయని ఉన్నత విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు.

విద్యార్థుల ఆలోచనల్లో మార్పు రావాలి

వాస్తవానికి ఆన్‌లైన్, వర్చువల్ క్లాస్‌రూమ్ విధానం అందుబాటులోకి వచ్చిన తర్వాత నగరాలకు రావాల్సిన అవసరం లేదు. విద్యార్థుల ఆలోచన విధానంలో మార్పులు రావాలి.

ప్రొఫెసర్ ఎన్వీ రమణరావు, డైరెక్టర్, ఎన్ఐటీ వరంగల్

గ్రామాలకు ఫ్యాకల్టీ వెళ్లడం లేదు

జిల్లా కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కాలేజీల్లో పనిచేయడానికి టీచింగ్ సిబ్బంది ముందుకురావడం లేదు. ముఖ్యంగా టీచింగ్ సిబ్బంది తమ పిల్లల చదువులు, భార్య ఉద్యోగం, ఇతర కారణాల వల్ల నగరాలను వదిలి జిల్లా కాలేజీల వైపు రావడం లేదు. పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు, సాఫ్ట్‌వేర్ కేంద్రాలు లేకపోవడంతో సహజంగానే గ్రామీణ, పట్టణ కాలేజీలకు ఆదరణ తగ్గుతున్నది.

-ఏ వేణుగోపాల్‌రెడ్డి, జేఎన్టీయూహెచ్, వీసీ



కాగితం ఉత్పత్తి చేస్తున్న యంత్రం



పరిశ్రమలోని 7వ యంత్రంలో ఉత్పత్తి అయిన కాగితం

సిర్పూర్‌కు కాగితపు సిరి

మొదటిపేజీ తరువాయి...

పనిచేస్తున్నారు. వందలాది మంది పరోక్షంగా ఉపాధిని పొందేవారు. 2016 అక్టోబర్ 22న మిల్లును ఐడీబీఐ స్వాధీనం చేసుకున్నది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక మిల్లును తెరిపిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. మిల్లును టేకోవర్ చేసే కంపెనీలకు రాయితీలు ఇస్తామని 2016 సెప్టెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించింది. అప్పటి నుంచి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ప్రభుత్వ ప్రతినిధులు, అధికారులు వివిధ కంపెనీలతో సంప్రదింపులు జరిపారు. 2017 డిసెంబర్‌లో వివిధ కంపెనీలు పలుమార్లు ఎస్పీఎంను సందర్శించాయి. వీటిలో జేకే కంపెనీ ఎస్పీఎంను తీసుకునేందుకు ముందుకొచ్చింది. ఎస్పీఎంకు కల్పించాల్సిన రాయితీలపై 2018 మార్చి 4న మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకున్నది. పదేండ్లపాటు రాయితీలు కల్పిస్తూ మార్చి 18న ప్రభుత్వం జీవో-18ను విడుదలచేసింది. ఆగస్టు 2న అప్పటి మంత్రి కే తారకరామారావు ఎస్పీఎం పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. యాజమాన్యం ముమ్మరంగా మరమ్మతు పనులు చేపట్టింది. ఇచ్చిన మాట ప్రకారం ఆరు నెలల్లోనే పేపర్ ఉత్పత్తిని ప్రారంభించింది. వేలాది మంది కార్మికుల కుటుంబాలకు ఉపాధి దక్కింది.

అంతా కొత్తగా ఉంది: రాజు, కార్మికుడు, ఎస్పీఎం

నేను రెండు నెలలుగా మిల్లులోని అటవీ విభాగంలో పనిచేస్తున్నా. ముడిసరకు కోసం ప్లాంట్‌లో నాటిన మొక్కలను పర్యవేక్షిస్తుంటా. మళ్లీ మిల్లులో అడుగుపెడుతామని అనుకోలేదు. ఈ రోజు పండుగలా అనిపిస్తున్నది. మా బతుకుల్లో వెలుగులు నింపిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం. కార్మికులందరం కష్టపడి పనిచేసి మిల్లుకు గతవైభవం తెస్తాం.

ఢిల్లీలో భారీ వడగండ్ల వాన

తీవ్ర అవస్థలు పడిన ప్రజలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: వడగండ్లతో కూడిన భారీ వర్షం ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాలను అతలాకుతలం చేసింది. గురువారం ఢిల్లీలో సాయంత్రం వరకు 3.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. భారీ వర్షం కురవడంతో విమానాల రాకపోకలపైనా ప్రభావం పడింది. వర్షం వల్ల వాతావరణంలోనూ మార్పులు వచ్చాయి. కనిష్ఠ ఉష్ణోగ్రత 15 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 19.1 డిగ్రీలుగా నమోదయ్యాయి. మరోవైపు వడగండ్ల ఫొటోలను ఢిల్లీ, నోయిడా వాసులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యాయి.

అప్రూవర్‌గా మారుతా

- ఐఎన్‌ఎక్స్ కేసులో కోర్టుకు ఇంద్రాణీ ముఖర్జీ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో అప్రూవర్‌గా మారేందుకు అనుమతించాలంటూ మాజీ మీడియా దిగ్గజం ఇంద్రాణీ ముఖర్జీ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. తన కుమార్తె షీనాబోరా హత్యకేసులో ఇంద్రాణీ ఇప్పటికే బైకుల్లా జైలులో శిక్షను అనుభవిస్తున్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి సునీల్‌రత్న ఆమెతో మాట్లాడారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఇంద్రాణీ చెప్పారు. తన తరుపున వాదించేందుకు న్యాయవాదిని నియమించాలని ఆమె అభ్యర్థించగా, న్యాయమూర్తి సరేనన్నారు. ఈ కేసు విచారణ 14న జరుగనున్నది.



కోర్టు ఆదేశాలతో ఆటలాడారు..

మిమ్మల్ని దేవుడే కాపాడాలి

- బీహార్ షెల్టర్‌హోం కేసు దర్యాప్తులో సీబీఐ మాజీ అధిపతి నాగేశ్వరరావుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: బీహార్‌లోని ప్రభుత్వ షెల్టర్ హోమ్స్‌లో బాలికలపై జరిగిన లైంగిక దాడుల కేసు దర్యాప్తులో సీబీఐ ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల సుప్రీంకోర్టు గురువారం ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ కేసు విషయంలో సీబీఐ మాజీ తాత్కాలిక డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని మండిపడిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆయనను ఆదేశించింది. ఎంతో సున్నితమైన ఈ కేసును పర్యవేక్షిస్తున్న సీబీఐ అధికారి ఏకే శర్మను నాగేశ్వరరావు బదిలీ చేసిన విషయం తెలిసిందే. సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మకు, స్పెషల్ డైరెక్టర్ రాకేశ్ అస్థానాకు మధ్య వివాదం చెలరేగిన నేపథ్యంలో ఏకే శర్మను నాగేశ్వరరావు బదిలీ చేశారు. బాలికలపై లైంగిక దాడుల కేసు విచారణ ఏకే శర్మ సారథ్యంలోనే జరుగాలని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసినప్పటికీ నాగేశ్వరరావు ఆయనను బదిలీ చేశారు. శర్మను బదిలీ చేయరాదన్న తమ ఆదేశాలను సంబంధిత అధికారులకు తెలియజేశారా? లేదా? అని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం నాగేశ్వరరావును ప్రశ్నించింది. ఈ వ్యవహారంలో నాగేశ్వరరావుతోపాటు ప్రాసిక్యూషన్ ఇంచార్జి భాసురన్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని, సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆటలాడుకున్నారని చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ.. 'ఇక మిమ్మల్ని దేవుడే కాపాడాలి' అని వ్యాఖ్యానించారు. ఈ కేసు విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ సంధించిన ప్రశ్నలకు బీహార్ ప్రభుత్వం తరఫు న్యాయవాది నుంచి సంతృప్తికరమైన సమాధానాలు లభించకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.


నాగేశ్వరరావు

మంచు గడ్డల కింద పది మంది పోలీసులు

జమ్ముకశ్మీర్‌లో ఘటన

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని కుల్గాం జిల్లా శ్రీనగర్-జమ్ము జాతీయ రహదారి జవహర్ టన్నెల్‌కు సమీపంలో విరిగి పడ్డ మంచు చరియల కింద 10 మంది పోలీసులు చిక్కుకున్నారు. గురువారం జవహర్ టన్నెల్ వైపు అకస్మికంగా మంచుగడ్డలు విరిగి పడ్డాయని పోలీసులు తెలిపారు. ఇక్కడికి సమీపంలోని పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న వారిలో 10 మంది మంచు గడ్డల కింద చిక్కుకున్నారని మరో పది మంది సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే పోలీసు, ఇతర శాఖల సహాయ బృందాలు రంగంలోకి దిగి సహాయ చర్యలు చేపట్టాయి. గత 24 గంటల్లో కుల్గాం జిల్లా పరిధిలో భారీగా హిమపాతం కురిసింది.

- నాతో 10 నిమిషాలు చర్చించే దమ్ములేదు
- ఆయన ముఖంలో భయం కనిపిస్తున్నది
- దేశాన్ని రిమోట్ కంట్రోల్‌తో నడుపడానికి ఆరెస్సెస్ ప్రయత్నం
- రాహుల్ ధ్వజం



ప్రధాని మోదీ పిరికివాడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రధాని మోదీ పిరికివాడని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. కనీసం 10 నిమిషాలు తనతో చర్చించే దమ్ము మోదీకి లేదని పేర్కొన్నారు. దేశంలో స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ సంస్థలను తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. న్యాయ వ్యవస్థ నుంచి ఎలక్షన్ కమిషన్ వరకు అన్ని వ్యవస్థల్లో తన వ్యక్తులను నియమించడానికి ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఇలాంటి వ్యక్తులు తాము అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో ఉంటే వెంటనే వారిని తొలిగిస్తామని చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన పార్టీ మైనారిటీ సెల్ కన్వెన్షన్‌లో పాల్గొన్న రాహుల్‌గాంధీ మాట్లాడుతూ 'నాగ్‌పూర్ (ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం నాగ్‌పూర్‌లో ఉంటుంది) నుంచి దేశాన్ని, దేశంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను రిమోట్ కంట్రోల్ ద్వారా నియంత్రించడానికి ఆరెస్సెస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ప్రధాని మోదీ ముఖం అయితే ఆరెస్సెస్ అధిపతి మోహన్ భగవత్ రిమోట్ కంట్రోల్' అని విమర్శించారు. ప్రధాని మోదీ పిరికివాడని, తనతో చర్చకు రావాలని ఎన్నిసార్లు సూచించినా తప్పించుకొని తిరుగుతున్నాడని, ఇప్పటికైనా రాఫెల్, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థపై చర్చకు రావాలని మోదీకి సవాల్ విసిరారు. 'గత ఐదేండ్ల నుంచి పలు విషయాలపై ప్రధాని మోదీతో నేను పోరాడుతున్నాను. కాబట్టి నాకు తెలుసు ఆయన పిరికివాడన్న విషయం. ఆయన ముఖంలో భయం స్పష్టంగా కనిపిస్తున్నది' అని రాహుల్ పేర్కొన్నారు. ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి పాలన సాగించడం సాధ్యంకాదని ఇప్పుడిప్పుడే ప్రధాని తెలుసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మోదీ చరిష్మా అంతమైపోయిందన్నారు. ప్రధాని మోదీ తరుచుగా దేశ భద్రత గురించి మాట్లాడుతుంటారని, డోక్లాంకు చైనా తన బలగాలను పంపిస్తే ఆయన మాత్రం చైనాకు వెళ్లి చేతులు కట్టుకొని చర్చలు జరిపారని విమర్శించారు. 'దేశంలోని స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు ఏ పార్టీకి చెందినవి కావు. అవి దేశానికి చెందినవి. కాబట్టి వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నది. కానీ బీజేపీ వాళ్లు తాము దేశం కంటే పెద్దవాళ్లమని భావిస్తున్నారు. మూడు నెలల తర్వాత వాళ్లకు అర్థమవుతుంది.. తమ కంటే దేశమే పెద్దదని' అని రాహుల్ తెలిపారు.

అది 'మహా కల్తీ' కూటమి

దేశ ప్రజాస్వామ్యం దానిని తిరస్కరిస్తుంది

ఎమర్జెన్సీ విధించిన వారే నన్ను రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేశాడంటున్నారు

వారిది 'సత్తా భోగ్'.. నాది 'సేవాభావ్'

ఆర్టికల్ 356ను ఉపయోగించి 50 ప్రభుత్వాలను రద్దు చేశారు

కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగిన ప్రధాని మోదీ

మళ్లీ అధికారానికి వస్తాం.. అవినీతి ఆటకట్టిస్తామని ధీమా





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: పార్లమెంట్ సాక్షిగా ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపక్షపార్టీలపై విరుచుకుపడ్డారు. దేశంలో ఎమర్జెన్సీ విధించినవారు, న్యాయవ్యవస్థను బెదిరించిన వారు, సైన్యాన్ని అవమానించిన వారు నేడు తనను రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నానంటూ విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాఫెల్ ఒప్పందాన్ని తప్పు పడుతున్న కాంగ్రెస్ నేతలకు భారత నౌకా దళం మరింత శక్తిమంతం కావడం ఇష్టం లేదన్నారు. 'ఏ కంపెనీలకు ఆ కాంట్రాక్టును కట్టబెట్టాలని ఇంత సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారు' అంటూ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్షాల మహా కూటమిని ఎద్దేవా చేస్తూ 'ప్రజలు 'మహాకల్తీ'ని కోరుకోవడం లేదు. ఆరోగ్యవంతమైన మన ప్రజాస్వామ్యం దానిని తిరస్కరిస్తుంది' అని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో జరిగిన చర్చకు ప్రధాని గురువారం సమాధానమిచ్చారు. దాదాపు 100 నిమిషాలు మాట్లాడిన ప్రధాని తన ప్రభుత్వ విజయాలను ప్రస్తావిస్తూ ప్రతిపక్షాలపై విమర్శల దాడి చేశారు. తన 55 నెలల పాలనను కాంగ్రెస్ 55 ఏండ్ల పాలనతో పోల్చారు. 'వారిది సత్తా భోగ్ (అధికార సంబురం), నాది సేవా భావ్ (సేవాభావం)' అన్నారు. ఓ పేద కుటుంబం నుంచి వచ్చి వారి రాచరికాన్ని సవాలు చేసినందుకే తనపై కక్షగట్టారని చెప్పారు. 'కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ విధించింది. ఆర్మీ చీఫ్‌ను గూండా అని అవమానించింది. ఎన్నికల కమిషన్‌పై, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై సందేహాలు వ్యక్తం చేసింది. మరోవైపు రాజ్యాంగ సంస్థలను మోదీ ధ్వంసం చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నది' అంటూ ప్రధాని విరుచుకుపడ్డారు. 'న్యాయ వ్యవస్థను కాంగ్రెస్ నేతలు బెదిరిస్తారు. ప్రణాళికా సంఘాన్ని జోకర్ల గుంపు అని వ్యాఖ్యానిస్తారు.. మళ్లీ రాజ్యాంగ సంస్థలను మోదీ ధ్వంసం చేస్తున్నారని చెప్తారు' అంటూ మండిపడ్డారు. 'కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేస్తూ ఎన్నోసార్లు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసింది. స్వయంగా ఇందిరాగాంధీ 50సార్లు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేశారు' అని మోదీ చెప్పారు. కోల్‌కతాలో ఇటీవల మమతా బెనర్జీ ఆధ్వర్యంలో జరిగిన ప్రతిపక్షాల సభపై కూడా మోదీ విమర్శలు సంధించారు. 'కోల్‌కతాలో సమావేశమైన వారితో కూడిన మహా కల్తీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకోవడం లేదు. ప్రభుత్వం భారత ప్రజల కోసం పనిచేయాలి. ప్రజల ఆకాంక్షల పట్ల ఆసక్తి కలిగి ఉండాలి. అవినీతికి తావుండరాదు. మేము దేశం లోపల ఉన్నా బయటకు వెళ్లినా, పార్లమెంట్ లోపల ఉన్నా, వెలుపల ఉన్నా నిజమే మాట్లాడుతాం. కానీ నిజాన్ని వినే సహనం మీలో నశించింది' అంటూ ఆయన నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ సైన్యాన్ని బలహీనపరచిందని, అందుకే లక్షిత దాడులపై సందేహాలు వ్యక్తం చేసిందని ఆరోపించారు. అవినీతిని తాము చాలావరకు అరికట్టామని ప్రధాని చెప్పారు. దేశాన్ని లూటీ చేసినవారు తనను చూసి భయపడుతూనే ఉంటారని అన్నారు. దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వాలు అవినీతిలో కూరుకుపోయి, అవినీతిపరులకు అండగా నిలిచాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో తమ ప్రభుత్వమే మళ్లీ అధికారానికి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేసిన మోదీ అవినీతిపరుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. అగస్టా వెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కేసులో విదేశాల నుంచి నిందితులను పట్టుకొస్తుండటంతో ప్రతిపక్షంలోని కొందరిలో వణుకు పుడుతున్నదని అన్నారు.

ఏ కంపెనీ కోసం సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారు

రాఫెల్ ఒప్పందం విషయంలో తనపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేస్తున్న ఆరోపణలను ప్రధాని తిప్పికొట్టారు. 'కాంగ్రెస్ పార్టీకి మన భద్రతా వ్యవస్థ పటిష్ఠంగా ఉండటం ఇష్టం లేదు. ఏ కంపెనీకి ఆ కాంట్రాక్టులు కట్టబెట్టాలని ఇంత సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారు? సాయుధ దళాలను మీరు నిరాయుధులుగా చేశారు. లక్షిత దాడులు చేయలేని స్థితికి సైన్యాన్ని నెట్టేశారు. ఈ పాపానికి దేశం మిమ్మల్ని క్షమించదు. ముడుపులు లేకుండా రక్షణ ఒప్పందం జరిగినందుకు వారు ఆశ్చర్యపడుతున్నారు' అని విమర్శించారు.

బీసీ.. ఏడీలకు కొత్త నిర్వచనం

బీసీ (క్రీస్తు పూర్వం), ఏడీ (క్రీస్తు శకం)కు ప్రధాని మోదీ కొత్త నిర్వచనం చెప్పారు. 'బీసీ అంటే బిఫోర్ కాంగ్రెస్ (కాంగ్రెస్‌కు పూర్వం), ఏడీ అంటే ఆఫ్టర్ డైనాస్టీ (కాంగ్రెస్ వంశ పాలన తరువాత)'అని అన్నారు.

కోట్ల సంఖ్యలో ఉద్యోగాలొచ్చాయి

గత నాలుగున్నరేండ్లలో కోట్ల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు వచ్చాయని ప్రధాని చెప్పారు. ఇటు సంఘటిత, అటు అసంఘటిత రంగంలో ఎంతోమంది ఉపాధి పొందారని తెలిపారు. ఇందుకు భవిష్య నిధి, జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్) ఆదాయం పన్ను చెల్లింపులు, వాహనాల అమ్మకాల గణాంకాలను ఉదహరించారు. 2018 నవంబర్ నాటికి 1.8 కోట్ల మంది ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్)లో మొదటిసారిగా చేరారని చెప్పారు. ఎన్‌పీఎస్‌లో కొత్తగా 55 లక్షల మంది ఉద్యోగులు చేరారన్నారు. గత నాలుగేండ్లలో 6.35 లక్షల మంది కొత్తగా ఆదాయం పన్ను చెల్లించారని చెప్పారు. 'కొత్తగా ఉద్యోగాలొచ్చాయనడానికి ఇవన్నీ నిదర్శనం కాదా?' అని ప్రధాని ప్రశ్నించారు. ఇక అసంఘటిత రంగం గురించి వివరిస్తూ, 'భారీ ట్రక్కులు/వాణిజ్య వాహనాలు 36 లక్షలు, 1.5 కోట్ల ప్రయాణికుల వాహనాలు, 27 లక్షల ఆటోలు అమ్ముడు పోయాయి. ఈ వాహనాల ద్వారా ఉపాధి లభించలేదా?' అంటూ ధ్వజమెత్తారు. హోటల్ పరిశ్రమ ద్వారా 1.25 కోట్లు, పర్యాటక రంగం ద్వారా 1.5 కోట్లు ఉద్యోగాలు వచ్చాయన్నారు.



ఎన్నికలపై ఆసక్తి లేదు

సుప్రీంకోర్టు మాజీ జడ్జి కురియన్ జోసెఫ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి రాజకీయల్లోకి ప్రవేశిస్తారన్న వార్తలకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ తెరదించారు. ప్రస్తుతానికి తన సొంత రాష్ట్రం కేరళ నుంచి ఎన్నికల్లో పోటీ చేసేందుకు తనకు ఆసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. ఓ వార్తా సంస్థకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇస్తూ, కేరళలో సీపీఎం నేతృత్వంలోని ఎల్డీఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ కూటములు తనకు టికెట్ ఇస్తానని ముందుకు వచ్చాయని తెలిపారు. అయితే తాను ఎన్నికల బరిలోకి దిగడం లేదని వారికి తేల్చి చెప్పినట్టు పేర్కొన్నారు. ఆ రెండు కూటములు తనకు పోటీ చేసేందుకు నాలుగు స్థానాలను కూడా సూచించాయని, కానీ తనకు ఆసక్తి లేదని స్పష్టం చేశానని జస్టిస్ జోసెఫ్ తెలిపారు.

మహాకూటమి ప్రభుత్వం

చక్కగా పనిచేయగలదు

- నేను ప్రధానిగా ఉన్న కాలమే దీనికి నిదర్శనం
- లోక్‌సభలో తీవ్ర భావోద్వేగంతో చివరి ప్రసంగం చేసిన దేవెగౌడ



న్యూఢిల్లీ: పలు పార్టీలు మహాకూటమిగా ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే సమస్యలు వస్తాయని, ప్రభుత్వం సరిగా పనిచేయదని బీజేపీ చేస్తున్న వాదనలో అర్థం లేదని మాజీ ప్రధాని, జేడీఎస్ నేత దేవెగౌడ చెప్పారు. పార్టీల మధ్య అవగాహన ఉంటే చక్కటి పాలనను అందించవచ్చని, ఇందుకు తాను ప్రధానిగా పనిచేసిన కాలమే నిదర్శనమని తెలిపారు. మాజీ ప్రధాని వాజపేయీ కూడా సంకీర్ణ ప్రభుత్వాన్నే నడిపారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. గురువారం ఆయన లోక్‌సభలో భావోద్వేగంతో మాట్లాడుతూ 'నేను 57 ఏండ్లపాటు ప్రజా జీవితంలో ఉన్నాను. 1996-97 మధ్యకాలంలో 10 నెలలపాటు ప్రధానిగా పనిచేశాను. నేను కావాలని ఆ సీటును కోరుకోలేదు. అప్పటి ప్రధాని వీపీ సింగ్, అప్పటి పశ్చిమబెంగాల్ సీఎం జ్యోతి బసు ప్రధాని సీటును వద్దనుకున్నారు. దీంతో నా పేరు తెరమీదకు రావడంతో ప్రధానిగా బాధ్యతలు చేపట్టాను. ఈ 10 నెలల కాలంలో దేశ ప్రజలకు మంచి పాలనను అందించాను. అప్పట్లో సాయం చేయడానికి ప్రపంచబ్యాంకు నిరాకరించడంతో దేశంలోని నల్లధనాన్ని ప్రభుత్వ పథకాలకు మళ్లించాలని నిర్ణయించాను. ఇందుకోసం స్వచ్ఛందంగా నల్లధనాన్ని బహిర్గతం చేయడం పథకాన్ని ప్రతిపాదించాను' అని ఆనాటి రోజులను ప్రస్తావించారు. పార్లమెంట్‌లో ఇదే తన చివరి ప్రసంగమని పేర్కొన్నారు.

రాజ్యాంగ సంస్థలపై దాడి

- రాజ్యాంగానికి భిన్నంగా పాలన
- ప్రత్యర్థులను వేధించేందుకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ నేత ఖర్గే నిప్పులు
- హైవేల నిర్మాణ ప్రగతిపై గడ్కరీకి సోనియా ప్రశంస



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: మోదీ ప్రభుత్వంపై లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున ఖర్గే నిప్పులు చెరిగారు. రాజ్యాంగ సంస్థలను బలహీనపరుస్తూ, ప్రత్యర్థులను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై గురువారం జరిగిన చర్చలో ఖర్గే మాట్లాడుతూ మోదీ సర్కార్ రాజ్యాంగానికి అనుగుణంగా పని చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం తన పనితీరుపై ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు గణాంకాలను కృత్రిమంగా పెంచి చూపుతున్నదన్నారు. ప్రధాని మోదీ అహంకారంతో వ్యవహరిస్తున్నారని, కీలక విధానాలపై క్యాబినెట్ సహచరులనూ సంప్రదించడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ పట్ల గల ద్వేషంతో గతంలో ఆ పార్టీ ప్రభుత్వాలు చేసిన మంచి పనులూ చూడలేకపోతున్నారన్నారు. ఇప్పటివరకు వ్యవసాయానికి ఏమీ చేయకపోగా, ఎన్నికల దృష్టితో ప్రస్తుతం వాగ్దానాలు చేస్తున్నారని ఆరోపించారు. 'మీరు తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చారు. ఇప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అబద్ధాలు చెప్పడం ఆపడం లేదు. మోదీ పేరుతో గెలిచినా బీజేపీ సభ్యులు ఆయనకు బానిసలుగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. 2017-18లో నిరుద్యోగిత రేటు 6.1శాతం అని ఎన్ఎస్ఎస్ఓ సర్వేలో తేలిందని మీడియాలో వార్తలొచ్చాయి. ఆ సర్వేను విడుదల చేయకుండా అడ్డుకున్నందుకు ఇద్దరు ఎన్ఎస్సీ సభ్యులు రాజీనామా చేశారు. నోట్ల రద్దును అరవింద్ సుబ్రమణ్యంతో పాటు పలువురు ఆర్థికవేత్తలు తప్పుబట్టారు' అని ఖర్గే గుర్తుచేశారు. రాఫెల్ యుద్ధ విమాన ఒప్పందంపై విచారణకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని వేయాలని డిమాండ్ చేశారు.

మిత్రపక్షాల పట్ల బీజేపీ సవతి ప్రేమ

మిత్రపక్షాల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతున్నదని ఎన్డీయే భాగస్వామి శివసేన ఆక్షేపించింది.

2022 నాటికి 65 వేల కి.మీ పొడవున జాతీయ రహదారులు: గడ్కరీ

2022 నాటికి దేశవ్యాప్తంగా 65 వేల కి.మీ. పొడవున జాతీయరహదారుల నిర్మాణం పూర్తవుతుందని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తూ 'భారత్ మాల పరియోజన పథకం' తొలిదశలో 10 వేల కి.మీ పొడవునా 2017-18 నుంచి 2021-22 వరకు చేపట్టే జాతీయ రహదారుల నిర్మాణానికి రూ.5.35 లక్షల కోట్లు అవసరమని చెప్పారు. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ మాట్లాడుతూ దేశంలో మౌలిక వసతుల కల్పనలో మంత్రి నితిన్ గడ్కరీ మంచి కృషి చేశారని ప్రశంసించారు. మరోవైపు వరుసగా నాలుగో రోజు గురువారం కూడా రాజ్యసభ ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే శుక్రవారానికి వాయిదా పడింది.

స్టింగ్ ఆపరేషన్ వివరాలు వెల్లడించండి

- నిర్బంధంలో ఉన్న భారతీయ విద్యార్థులకు న్యాయసహాయం అందించండి
- నిష్పాక్షిక విచారణ జరిగేలా చూడండి
- విద్యార్థుల పట్ల మానవతాదృక్పథంతో వ్యవహరించండి
- భారతీయ అమెరికన్, కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి సహా పలువురు చట్టసభ సభ్యుల డిమాండ్

వాషింగ్టన్, ఫిబ్రవరి 7: నకిలీ యూనివర్సిటీ కేసులో అమెరికా హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్) చేపట్టిన స్టింగ్ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాలని పలువురు అమెరికా చట్టసభ సభ్యులు డిమాండ్ చేశారు. అరెస్టైన భారతీయ విద్యార్థులు తమ రాయబార కార్యాలయాల్ని సంప్రదించే అవకాశం కల్పించాలని, వారికి న్యాయ సహాయం అందించేందుకు అటార్నీలను నియమించాలని కోరారు. ఈ మేరకు భారతీయ అమెరికన్, కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి, అమెరికా చట్టసభ సభ్యులు థామస్ సౌజి, రాబ్ ఉడాల్, బ్రెండా లారెన్స్.. హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్‌ఎస్), యూఎస్ ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)లకు గురువారం లేఖ రాశారు. నిర్బంధంలో ఉన్న భారత విద్యార్థుల పట్ల నిష్పక్షపాతంగా, మానవతాదృక్పథంతో వ్యవహరించాలని కోరారు. భారత విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న వార్తల నేపథ్యంలో అధికార యంత్రాంగం వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. వీసా గడువు ముగిసినా అమెరికాలోనే తిష్టవేసిన విదేశీ విద్యార్థులను పట్టుకునేందుకు ఫార్మింగ్టన్ యూనివర్సిటీ పేరుతో నకిలీ వర్సిటీని అమెరికా అధికారులు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఉచ్చులో మొత్తం 600 మంది విద్యార్థులు చిక్కుకున్నారు. వీరిలో 130 మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో 129 మంది భారతీయ విద్యార్థులు కాగా, ఒకరు పాలస్తీనాకు చెందినవారు. ప్రస్తుతం వీరంతా నిర్బంధంలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిర్బంధంలో ఉన్న విద్యార్థుల హక్కులకు భంగం కలుగకుండా చూడాలని, అమెరికా చట్టాల ప్రకారం వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని చట్టసభ సభ్యులు సదరు లేఖలో కోరారు. 'నిర్బంధంలో ఉన్న భారతీయ విద్యార్థులపై అమెరికా అధికార యంత్రాంగం అనుసరిస్తున్న తీరు పట్ల భారతీయ-అమెరికన్ సమాజం, భారత కాన్సులేట్ కార్యాలయం తీవ్ర ఆందోళనతో ఉంది. విద్యార్థులకు న్యాయపరంగా దక్కాల్సిన అన్ని హక్కులు కల్పిస్తున్నారా? లేదా? వారి హక్కులకు ఎలాంటి పరిస్థితిలోనూ భంగం వాటిల్లరాదు. బాధిత విద్యార్థుల తరుపున వాదించేందుకు అటార్నీని నియమించాలి. అలాగే బాండ్ ద్వారా విడుదలయ్యే అవకాశం ఉన్న వారిని వెంటనే విడుదల చేయాలి. విద్యార్థుల నిర్బంధం, కేసు విచారణకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు భారత దౌత్య కార్యాలయం, భారత కాన్సులేట్‌లకు అందించాలి' అని లేఖలో వారు డిమాండ్ చేశారు. హోంల్యాండ్ సెక్యూరిటీ చేపట్టిన స్టింగ్ ఆపరేషన్ పట్ల ఆందోళన వ్యక్తంచేశారు. స్టింగ్ ఆపరేషన్ వివరాల్ని బయటపెట్టాలని కోరారు. నకిలీ వర్సిటీ పేరుతో విదేశీ విద్యార్థుల వద్ద డబ్బులు వసూలు చేసి అక్రమ వీసాలు ఇప్పించారనే ఆరోపణలతో ఇప్పటికే 8 మంది విద్యార్థులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మరోవైపు నిర్బంధంలో ఉన్న భారతీయులను విడిపించేందుకు, న్యాయ సహాయం అందించేందుకు ఇప్పటికే చర్యలు ప్రారంభించామని భారత విదేశాంగశాఖ ఒక ప్రకటనలో తెలిపింది.


రాజా కృష్ణమూర్తి

12 నుంచి విచారణ

భారతీయ విద్యార్థులకు వారం రోజుల్లో విముక్తి!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ : 'పే టూ స్టే' కుంభకోణంలో అమెరికా అధికారుల దర్యాప్తును ఎదుర్కొంటున్న విద్యార్థుల విషయంలో తదుపరి ప్రక్రియ ప్రారంభమైంది. విద్యార్థులకు సమయం కేటాయించి తీర్పు ఇచ్చేందుకు జడ్జీలు టైమ్ కేటాయించారు. ఇందులో భాగంగా ఆయా డిటెన్షన్ కేంద్రాల్లోని విద్యార్థులకు ఈనెల 12 నుంచి సమయం ఇచ్చినట్లు తెలుస్తున్నది. 12 నుంచి అట్లాంటాలోని డిటెన్షన్ సెంటర్లలోని విద్యార్థుల తరఫున వారి అటార్నీలు వాదనలు వినిపించే అవకాశం కల్పించినట్లు సమాచారం. 12న దాదాపు 20 మందికి, 13న మరికొందరికి అవకాశం కల్పించారని ఈ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న టీఆర్ఎస్ ఎన్నారై నేతలు నవీన్ జలగం, నర్సింహారావు నాగుల వంచ తెలిపారు. రాబోయే వారంలో విద్యార్థులందరికీ విముక్తి కలిగే అవకాశం ఉందని తెలుస్తున్నది.


వ్యూహరచన సమావేశంలో పాల్గొన్న ప్రియాంక గాంధీ, జ్యోతిరాదిత్య సింధియా తదితరులు

తొలి వ్యూహ రచన భేటీలో ప్రియాంక

ఆదివారం పీసీసీ, సీఎల్పీ నేతల సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ప్రియాంక గాంధీ తొలిసారి గురువారం జరిగిన పార్టీ వ్యూహ రచన సమావేశంలో పాల్గొన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఇన్‌చార్జిల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం చర్చించారు. ఈ సమావేశానికి రాహుల్ సోదరి ప్రియాంక గాంధీ కూడా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ యూపీ ఈస్ట్ ఇన్‌చార్జిగా ప్రియాంక గాంధీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఈ సమావేశం జరుగడం గమనార్హం. ఈ సమావేశం కోసం ఆమె నేరుగా ఏఐసీసీ కార్యాలయానికి చేరుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, బూత్ స్థాయిలో సంస్థాగత నిర్మాణంపై ఈ సమావేశంలో చర్చించారని సమాచారం. యూపీ వెస్ట్ ఇన్‌చార్జి జ్యోతిరాదిత్య సింధియా పక్క సీటులోనే ప్రియాంకగాంధీ ఆసీనురాలయ్యారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కార్యాలయానికి సమీపంలోనే ప్రియాంక గాంధీ కార్యాలయం ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో రాహుల్ ఆదివారం సమావేశం కానున్నట్లు కాంగ్రెస్ నాయకుడొకరు తెలిపారు.



త్రిపుల్ తలాక్ చట్టంతో మహిళలకు ఏ విధమైన న్యాయం జరుగదు. దాని ఆసరాతో ముస్లిం పురుషులను నేరస్తులుగా జైళ్లలో పెడుతున్నారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే త్రిపుల్ తలాక్ చట్టాన్ని వెనక్కి తీసుకుంటాం.


సుస్మితా దేవ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

కాంగ్రెస్ సంతుష్టి ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్నది. అధికారంలోకి వస్తే త్రిపుల్ తలాక్‌ను వెనక్కి తీసుకుంటామనటం ఓట్ల కోసమే. దీని కోసం రాహుల్ తన అనుంగు అనుచరులతో మాట్లాడిస్తున్నారు.

సంబిత్ పాత్ర, బీజేపీ అధికార ప్రతినిధి




చరిత్రలో నేడు




1672

లండన్ రాయల్ సొసైటీ ముందు తన కాంతి ప్రసార సిద్ధాంతాన్ని ప్రకటించిన ఐజాక్ న్యూటన్.

1933



మొత్తం లోహంతో తయారుచేసిన తొలి విమానం బోయింగ్-247.



1936

భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జవహర్‌లాల్ నెహ్రూ ఎన్నిక.

అధికారం ఎవరిదైనా అణిచివేత విధానాల్లో తేడా ఉండదని యోగీ ఆదిత్యనాథ్, కమల్‌నాథ్ ఆచరణలో రుజువు చేస్తున్నారు. సాధారణ నేరాలపై కూడా నల్ల చట్టాలు ప్రయోగిస్తున్నారు. గో రక్షణ పేర జాతీయ భద్రతాచట్టాన్ని ప్రయోగిస్తూ చట్ట దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. మధ్యప్రదేశ్, యూపీలలో గో రక్షణ పేరిట ఆవును హత్య చేశారన్న అభియోగంపై నాసా చట్టాన్ని ప్రయోగించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రజలపై నల్ల చట్టాలను ప్రయోగించటంలో ఒకేతీరుగా ప్రవర్తించటం గమనార్హం.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

పాకిస్థాన్ విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషీ కశ్మీర్ వేర్పాటువాద నేత గిలానీకి ఫోన్ చేశాడన్న వార్త తర్వాత కూడా పాక్ విషయంలో భారత్ విధానంలో స్పష్టత కొరవడింది. గతంలోనూ ఇదేవిధంగా కశ్మీర్ వేర్పాటువాద నేతలతో పాక్ అధికారులు, నేతలు ఫోన్ సంభాషణలు జరిపినప్పుడు తీవ్ర పరిణామాలుంటాయని భారత్ హెచ్చరించింది. అయినా పాక్ తీరు మారలేదు. పదేపదే పాక్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నా భారత్ తీసుకుంటున్న చర్యల్లో విధాన స్పష్టత లోపించిన స్థితి కనిపిస్తున్నది.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

క్షిపణి పోటీ

ప్రపంచ దేశాలు మళ్లా ప్రచ్ఛన్నయుద్ధం నాటి అనిశ్చిత పరిస్థితుల్లోకి అడుగుపెడుతున్న తరుణంలో అమెరికా మధ్యతరహా అణ్వస్త్ర (ఐఎన్ఎఫ్) నిర్మూలన ఒప్పందం నుంచి వైదొలుగడం ఆందోళన కలిగిస్తున్నది. అమెరికా ప్రకటనకు దీటుగా రష్యా కూడా ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించడమే కాకుండా మరింత ఆధునిక క్షిపణులను రూపొందిస్తున్నట్టు వెల్లడించింది. ఒప్పంద నిబంధనల ప్రకారం- లాంఛనంగా వైదొలుగడానికి మరో ఆరు నెలలు పడుతుంది. కానీ రెండుదేశాల వైఖరిని గమనిస్తే, ఒప్పందం నిలిచే సూచనలు కనిపించడంలేదు. ఈ ఒప్పందంలో భాగస్వాములైన అమెరికా, రష్యా దేశాలు కొంతకాలంగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్టు పరస్పరం విమర్శించుకుంటున్నాయి. 1987 డిసెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు రీగన్, సోవియెట్ అధినేత గోర్బచేవ్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం మిగతా నిరాయుధీకరణ ఒప్పందాలకు దిక్సూచి వంటిది. దీనివల్ల యూరప్ దేశాల రాజధానులపై ఎక్కుపెట్టిన అణు క్షిపణులను సోవియెట్ యూనియన్ తొలిగించింది. అమెరికా కూడా తన క్షిపణులను ధ్వంసం చేసింది. కానీ వ్యూహాత్మకంగా ఈ క్షిపణులను ధ్వంసం చేసినప్పటికీ, మరింత ఆధునిక క్షిపణి వ్యవస్థల కోసం ఇరుపక్షాలు పరిశోధనలు సాగిస్తున్నాయి. ఇప్పుడు అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను పరీక్షించి మోహరించడానికి ఏర్పాట్లు చేసుకున్నాయి. అయితే తాజా ఆయుధ పోటీ యూరప్ కన్నా ఆసియా- పసిఫిక్ ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటుందని రక్షణ నిపుణులు అంటున్నారు.

ఐఎన్ఎఫ్ ఒప్పందం అమెరికా, రష్యా మధ్య కుదిరింది కనుక కొత్తగా ఎదుగుతున్న చైనాకు వర్తించదు. అందువల్ల తాము ఒప్పందం నుంచి వైదొలుగుతున్నామని కూడా అమెరికా అంటున్నది. కానీ చైనాతో చర్చలు జరిపి, ఆ దేశాన్ని ఒప్పందంలోకి తేవడానికి ప్రయత్నించాలే తప్ప, ఉన్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవడం పరిష్కారం కాదు. ఈ ఒప్పందం నుంచి అమెరికా వైదొలుగడం పట్ల ఆందోళన వెలిబుచ్చిన చైనా, ఇప్పటికైనా చర్చలు జరిపి పరిష్కారం సాధిద్దామనే అభిప్రాయాన్ని వ్యక్తంచేసింది. దీన్నిబట్టి చైనాతో కనీసం చర్చలు జరిపే పరిస్థితి ఉన్నదని తెలిసిపోతున్నది. చైనా క్షిపణుల మోహరింపునకు పాల్పడుతున్నది నిజమే. ముఖ్యంగా తైవాన్ ప్రాంతంలో అమెరికా దాడులకు దిగితే తట్టుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నది. ఈ వివాదం ఈశాన్య ఆసియా ప్రాంతానికే పరిమితమైనట్టు కనిపిస్తున్నప్పటికీ, అమెరికా- చైనా ఘర్షణ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతమంతా విస్తరించి ఉన్నది. హిందు మహాసముద్ర ప్రాంతం కూడా ఇందుకు అతీతం కాదు. ఇక్కడే భారత్ అప్రమత్తం కావలసి ఉన్నది. దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలోని ఉద్రిక్తతలు మొత్తం హిందూ మహాసముద్ర ప్రాంతాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. భారత్ ఇటీవలికాలంలో అమెరికా ప్రోద్బలంతో దక్షిణ చైనా సముద్ర ప్రాంతంలో ప్రవేశిస్తున్నది. ఈ నేపథ్యంలో చైనాతో క్షిపణిరంగంలో పోటీపడాలని చూస్తున్న అమెరికా వైఖరిని గమనంలోకి తీసుకోవాలె. భవిష్యత్తులో అమెరికా- చైనా ఉద్రిక్తతలు ఏ మోతాదులో, ఏయే రూపాలలో ఉంటాయో, మన పాత్ర ఏమిటో విశ్లేషించుకోవాలె.


> **అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ఇరాన్ అణు కార్యక్రమాన్ని నియంత్రించే ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. ఇరాన్ ఒప్పందం పట్ల యూరోపియన్ దేశాలు ప్రదర్శించిన సామరస్యాన్ని అమెరికా చూపలేకపోయింది. ట్రంప్ ఆసియా- పసిఫిక్ ఒప్పందం నుంచి కూడా ఇదేరీతిలో వైదొలిగారు. నాటోలో భాగస్వాములైన యూరప్ దేశాలు నిధులు ఇవ్వడంలేదంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ బృందంలోని సభ్యులు కూడా ఒకరికి మించి మరొకరున్నారు.**

'బుల్లెట్ మనుషులను చంపదు, ట్రిగర్‌ను నొక్కే వేలు చంపుతుంది' అనేది ఒక జేమ్స్‌బాండ్ సినిమాలోని వ్యాఖ్య. ఆయుధాలనే కన్నా మనిషిలోని అసహనం, యుద్ధోన్మాదం ప్రపంచానికి ప్రమాదకరం. ఒక క్షిపణి ఒప్పందం నుంచి వైదొలుగడమే కాదు, అంతర్జాతీయ ఒప్పందాలు, కూటములు, మొత్తంగా సమష్టితత్వం పట్ల అమెరికా ప్రదర్శిస్తున్న అసహనం, దుందుడుకు వైఖరి భయాందోళనలను కలిగిస్తున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ఇరాన్ అణు కార్యక్రమాన్ని నియంత్రించే ఒప్పందం నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటించారు. ఇరాన్ ఒప్పందం పట్ల యూరోపియన్ దేశాలు ప్రదర్శించిన సామరస్యాన్ని అమెరికా చూపలేకపోయింది. ట్రంప్ ఆసియా- పసిఫిక్ ఒప్పందం నుంచి కూడా ఇదేరీతిలో వైదొలిగారు. నాటోలో భాగస్వాములైన యూరప్ దేశాలు నిధులు ఇవ్వడంలేదంటూ అసహనం వ్యక్తంచేస్తున్నారు. ట్రంప్ బృందంలోని సభ్యులు కూడా ఒకరికి మించి మరొకరున్నారు. ట్రంప్ ఆలోచనా ధోరణికి ఆయన జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ మాటలు అద్దం పడుతుంటాయి. బోల్టన్‌కు ఆయుధ నియంత్రణ, అంతర్జాతీయ కూటములు, బహుళ పక్ష ఒప్పందాలు మొదలైనవేవీ నచ్చదు. చివరికి ఐక్యరాజ్యసమితి అంటే కూడా చిర్రెత్తుకొస్తుంది. ఇవన్నీ ఘనత వహించిన అమెరికా ప్రాబల్యాన్ని కట్టడి చేస్తున్నాయనేది ట్రంప్ బృందం బాధ. సరిహద్దులో గోడలు కట్టుకోవాలనే ఇటువంటి ఏకాకి మనస్తత్వం వల్ల అంతిమంగా అమెరికాకూ నష్టమే. అమెరికా ప్రజలు ఈ ప్రమాదాన్ని గ్రహించి కట్టడి చేయాలె.

సందర్భం

మనిషిలో 'వెలుగు'

గాంధీ మహాత్ముని జయంతి 'అంతర్జాతీయ అహింసా దినోత్సవ'మైంది. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి 'ఉపాధ్యాయ దినోత్సవ'మైంది. వివేకానంద జయంతి 'జాతీయ యువజనదినోత్సవ'మైంది. దీని అంతరార్థం వీరిని వీరి ఆశయాలను మనం స్ఫూర్తిగా చేపట్టాలని. మహాత్ములందరూ తమ జీవితంలోని ప్రతి క్షణాన్ని ఆధ్యాత్మికోన్నతికి, సమాజ శ్రేయస్సుకు వినియోగించారు. అందుకే వారి జీవితం మనకు ప్రేరణగా నిలిచింది. అటువంటి మహనీయుల నెందరినో స్ఫూర్తిగా తీసుకొని నిరంతరం 'జన సేవయే జనార్దన సేవ' అంటూ తెలుగు ప్రజల్లో ముఖ్యంగా తెలంగాణ ప్రజల్లో 'ప్రజల మనిషి'గా కొనియాడబడుతున్న వారు డాక్టర్ రమణాచారి గారు.



ఆయనొక ఐఏయస్ అధికారిగానో, 'కుడా' అడ్మినిస్ట్రేటర్‌గానో, 'నంది' నాటక దినోత్సవ రూపశిల్పిగానో, టీటీడీ కార్యనిర్వహణాధికారిగానో ఒక్కొక్కరికి ఒక్కోవిధంగా రమణగారు సుపరిచితులు. నిష్పక్షపాతంగా, నిష్కర్షగా నచ్చని విషయాన్ని కరాఖండిగా చెప్పే మేరు గంభీరునిగా కన్పించే ఆయన అంతరంగం సున్నితమైనది, సునిశితమైనది. చిన్నతనంలో తాను ఏవైతే ఇబ్బందులు అనుభవించారో, అవి ఇప్పటితరాల వారు పడకూడదని తాపత్రయపడుతారు. ఆయన సిద్దిపేట కళాశాలలో చదివేరోజుల్లోనే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ చైతన్యాన్ని చాటారు. రమణగారు నిరంతర అధ్యయనశీలి. ఏదోఒకటి ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందుకుసాగాలనేది ఆయన తత్వం. ఈ తత్వమే ఆయనను 55వ ఏటా తానింకా నేర్చుకోవాల్సింది ఉందంటూ 'పద్య కవిత్వం వస్తువైవిధ్యం'పై పీహెచ్‌డీ చేసి 2009 ఫిబ్రవరిలో డాక్టరేట్ పట్టా పొందేలా చేసింది.

రమణగారి ఆలోచనలు రూపకల్పనల వెనుక సమాజశ్రేయస్సు సత్సంకల్పం ఉన్నది. అందరికీ అందుబాటులో అతి సామాన్యంగా, నిరాడంబరంగా జీవించే ఆయన జీవనశైలి ఎందరికో స్ఫూర్తిదాయకం. ఆయనొక మనిషిగా, మనీషిగా, సారస్వతాభిలాషిగా, సాంస్కృతిక మూర్తిగా, అందరిచేత కొనియాడబడటానికి కారణం ఇదే. ఇటువంటివారు ఈ కాలానికి ఇంకా ఎందరో అవసరం. ఆయన సాహిత్య, ప్రజాసంక్షేమ, సేవాతత్పరత కార్యక్రమాలు మరెంతోకాలం కొనసాగాలని తెలంగాణ సమాజం కోరుకుంటున్నది.

– డాక్టర్ సావిత్రి సాయి

(నేడు కేవీ రమణాచారి జన్మదినం..)

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విద్య



ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

ఉన్నత విద్యలో సంస్కరణలు

ప్రతి సబ్జెక్టులోని పాఠ్యాంశాలు ప్రతి రెండేండ్లకు పరిశీలించి అవసరమైనవి అప్‌గ్రేడ్ చేయాలి. త్వరగా మారుతున్న కాలం, పెరుగుతున్న అవసరాలు, పెంపొందుతున్న సాంకేతికతకు అనుగుణంగా పాఠ్యాంశాలను సంస్కరించాలి. లేకపోతే వారు చదివి నేర్చుకున్న అంశాలకు, బయట ఉద్యోగరంగంలో కావలసిన సమాచారానికి ఏ సంబంధం లేక వారి జ్ఞానం ఉపయోగపడదు.

స్వాతంత్ర్యానంతరం ఉన్నత విద్యా సంస్థలు స్థాపించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాష్ర్టాల విద్యార్థులకు అనువుగా ఉండటానికి ఇంగ్లీషు మాధ్యమంలో ఉన్నత విద్యారంగ కోర్సులు అందిస్తున్నాయి. ముఖ్యంగా ప్రతిష్ఠాకరమైన ఐఐటీ, ఐఐఎం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వంటి సంస్థలు, విశ్వవిద్యాలయాలు తమ కోర్సులను ఇంగ్లీషు మాధ్యమంలో మాత్రమే అందిస్తాయి. దేశమంతా ఉన్నత విద్యారంగ కోర్సులు అందుబాటులో ఉన్నా దాదాపు 80 శాతం విద్యార్థులకు అవి గగనకుసుమాలే! ఈ సమస్య తీర్చాలంటే ప్రాథమిక దశ నుంచి పటిష్ఠమైన భాషా బోధనా పద్ధతులు అవలంబించాలి.

ఉన్నత విద్యారంగంలోని కోర్సులు రెండు రకాలు: జనరల్ డిగ్రీలు. ఇదివరకు ఈ కోర్సులు చేసేవారి సంఖ్య ఎక్కువగా ఉండేది. అయితే సాంకేతికత పెరుగుదల వల్ల ఇంజినీరింగ్, టెక్నాలజీ కోర్సులకు ఆదరణ పెరిగింది. అందువల్ల జనరల్ డిగ్రీ కోర్సులకు ఆదరణ తగ్గింది. ప్రొఫెషనల్ కోర్సుల ఖర్చు భరించలేనివారు, అందులో ప్రవేశం దొరుకని వారు మాత్రం ఈ జనరల్ డిగ్రీ కోర్సుల్లో చేరుతున్నారు. అయితే వీరికి డిగ్రీ పూర్తయిన వెంటనే ఉపాధి, ఉద్యోగాలు అత్యవసరం కాబట్టి ఈ కోర్సులను బలోపేతం చేయాలి. ఆర్థికంగా బలహీనంగా ఉన్నవారు, ఇంజినీరింగ్ వంటి కోర్సుల్లో ప్రవేశం దొరుకనివారు, తర్వాత ఎం బీఏ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేయాలనుకునేవారూ జనరల్ డిగ్రీ కోర్సుల్లో చేరుతారు. అంటే చేరినప్పుడు వారికి ఈ కోర్సే చేయాలన్న ఉత్సాహం తక్కువగా ఉంటుంది. వీరి మానసిక స్థితిలో ఇంకో కోణం కూడా పరిశీలించదగ్గది. విద్యార్థులంతా 10వ తరగతి పూర్తిచేసి ఇంటర్ లో చేరేటప్పటికీ వారి వయస్సు 15,16 ఏండ్లుంటుంది. జూనియర్ కాలేజీలో చేరేటప్పటికి మానసిక పరిణతి లేకపోయినా తాము పెద్దవారిమైపోయామనీ, తామేం చేసినా విమర్శించకూడదనీ, తమ ఆలోచనలే సరైనవన్న భావన ఉంటుంది. పైగా డిగ్రీలో చేరేటప్పుడు న్యూనతాభావాలు ఉన్నవారు మానసికంగా ఇలా అస్థిరంగా ఉండి, తిరుగుబాటు ధోరణిలో ప్రవర్తిస్తారు. వీరి వ్యక్తిగత, మానసిక, సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుంటేనే డిగ్రీలో వారికి విద్యాపరంగా న్యాయం చేయగలుగుతుంది వ్యవస్థ. అందుకే ఈ కోర్సులతో పాటు ఇంకా కొన్ని ముఖ్యమైన అంశాల మీద ఉన్నత విద్యారంగం దృష్టిపెట్టాలి.

వివిధ కోర్సుల ఉద్దేశం, ఆవశ్యకత: డిగ్రీలో చేరే విద్యార్థులు తమ ఇంటర్మీడియెట్‌లో తీసుకున్న గ్రూపునకు సంబంధించిన కోర్సుల్లో చేరుతారే కానీ వారికి ఆ డిగ్రీలో ఉన్న సబ్జెక్టు ఆవశ్యకత గానీ, మానవులకు ఆ అంశాల అవసరం గురించి కానీ ఏ రకమైన అవగాహన ఉండదు. అవి వారిలో కలిగించటానికి కొంత సమయం వెచ్చించి వారు చదువబోయే సబ్జెక్టు చాలా గొప్పదన్న భావన కలిగిస్తే కానీ విద్యార్థులకు ఆయా అంశాల్లో ఉత్సాహం కలుగదు. పాశ్చాత్య దేశాల్లోని విశ్వవిద్యాలయాలన్నింటిలో డిగ్రీ కోర్సు కంటే ముందు ప్రిపరేషన్ కోర్సు ఉంటుంది. ఈ రకమైన కోర్సులు మన విశ్వవిద్యాలయాల్లో లేవు కాబట్టి, కనీసం మొదటితరం వారమంతా విద్యార్థులకు వారివారి ఐచ్ఛికాంశాల (ఆప్షనల్ సబ్జెక్టు) గురించిన సమాచారం, వాటి ఆవశ్యకత వివరించాలి. వీలైతే ఒక చిన్న పుస్తకంలో వీటిని పొందుపరిచి వారికివ్వాలి. ఆయా రంగాల్లో నిష్ణాతులతో కొన్ని అతిథి ప్రసంగాలు (గెస్ట్ లెక్చర్స్) కూడా ఇప్పిస్తే చాలా మంచిది.

బోధనా పద్ధతులు: విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యలో లెక్చర్ పద్ధతి తక్కువగా ఉంటుంది. ఆయారంగాల్లో నిష్ణాతులను పిలిచి మాట్లాడించినప్పుడు మాత్రమే ఇటువంటి పద్ధతి ఉంటుంది. ఎందుకంటే ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన వారు, రంగంలోకి ప్రవేశిస్తున్నవారికి చెప్పవలసిన విషయాలు చాలా ఉంటాయి. కానీ రోజువారీ బోధనా పద్ధతి ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య తార్కికమైన వాదనలతో జరుగాలి. క్రమశిక్షణ పాటిస్తూ విద్యార్థులంతా తరగతిలో జరుగుతున్న యాక్టివిటీల్లో పాల్గొనాలి. ఉపాధ్యాయులు వారిని రకరకాల ప్రాక్టికల్ యాక్టివిటీలతో ఉత్సాహపరుచాలి. దీనికి వారికి ప్రత్యేక శిక్షణతో పాటు వారి వారి రంగాల్లో విదేశీ విద్యాలయాల్లో ఉపాధ్యాయుల లెక్చర్ల వీడియోలు చూపించాలి. ప్రపంచంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలైన హార్వర్డ్, యేల్, స్టాన్‌ఫర్డ్, మిచిగన్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ వంటి విద్యాలయాల్లో బోధనా పద్ధతులు ఎలా ఉంటాయో వారికి అవగాహన కలిగించాలి. విద్యారంగం ఎన్ని వసతులు, హంగులు కల్పించినా, ఏ కోర్సయినా విజయవంతమవ్వాలంటే క్లాసులో ఏ జరుగుతున్నదన్నది మాత్రమే ముఖ్యం. దానికి ఉపాధ్యాయుల నిబద్ధత, విద్యార్థుల ఉత్సుకత మాత్రమే దోహదం చేస్తాయి.

ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలు పెరుగాలంటే నెలకోసారి విద్యాసంస్థల్లోని అందరు లెక్చరర్లకు ఒక విద్వత్పరిషత్ (ఎకడమిక్) సమావేశం ఏర్పాటుచేసి ఒక 5 మంది వారివారి రంగాల్లో జరుగుతున్న మార్పులు, అభివృద్ధి పరిశోధన గురించి మిగితావారికి లెక్చర్ల రూపంలో తెలియపరుచాలి. దానివల్ల వారందరూ వారి రంగాల్లో నిష్ణాతులవ్వడం, బోధనా నిపుణతలు పెంచుకోవడం జరుగుతుంది. ఇది చాలా సహాయపడుతుంది.

> ఉన్నత విద్యను అభ్యసించిన యువత ఉద్యోగార్హతలు లేకుండా ఉన్నారంటే, 14 ఏండ్లు నేర్చుకున్న ఇంగ్లీషు భాషలో కూడా నైపుణ్యాలు లేవంటే ఎవరిది తప్పు. ఫిజిక్స్‌లో 98 శాతం, లెక్కల్లో 100 శాతం తెచ్చుకోగలిగిన విద్యార్థులు ఇంగ్లీషులో ఫెయిల్ అవుతున్నారంటే లోటు వారిలో ఉందా? విద్యావ్యవస్థలో ఉందా? రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యారంగంలోని సమస్యలను పరిష్కరిస్తే తప్ప ఈ దేశంలో మానవ వనరులు పెరుగవు.

కోర్సుల్లోని పాఠ్యాంశాలు: ప్రతి సబ్జెక్టులోని పాఠ్యాంశాలు ప్రతి రెండేండ్లకు పరిశీలించి అవసరమైనవి అప్‌గ్రేడ్ చేయాలి. త్వరగా మారుతున్న కాలం, పెరుగుతున్న అవసరాలు, పెంపొందుతున్న సాంకేతికతకు అనుగుణంగా పాఠ్యాంశాలను సంస్కరించాలి. లేకపోతే వారు చదివి నేర్చుకున్న అంశాలకు, బయట ఉద్యోగ రంగంలో కావలసిన సమాచారానికి ఏ సంబంధం లేక వారి జ్ఞానం ఉపయోగపడదు. ఉద్యోగం సంపాదించటం కూడా ఎంతో కష్టమవుతుంది ఈ పట్టభద్రులకు.

పరీక్షా విధానం: మన దేశంలో ఇంకా పరీక్షా విధానం సంతరించుకున్న నైపుణ్యాలు పరీక్షించకుండా కేవలం జ్ఞాపకశక్తిని పరీక్షించేటట్టుగా ఉంది. అంతకంటే పుస్తకాల్లోని కాన్సెప్టు, టర్మ్‌లు, టర్మినాలజీని వివరించమనీ, విశ్లేషించమనీ పరీక్ష, పరిశీలన, విశ్లేషణ, విమర్శనా నైపుణాలు పరీక్షించేటట్టు పరీక్షా పత్రాన్ని రూపొందించాలి. ఆ విశ్లేషణలో వారి భావనాత్మకత, సృజనాత్మకతా వెలికి రావాలి. ఈ రకంగా బోధనా, పరీక్షా విధానాలంటే విద్యార్థులకు స్వయంగా ఆలోచించడం, రాయడం అలవాటవుతుంది. సృజనాత్మకత పెరుగుతుంది.

మారిన కాలానికి అనుగుణంగా కోర్సులు: విశ్వవిద్యాలయాలన్నీ ప్రతి కోర్సు ఏ రకంగా విద్యార్థులకు ఉపయోగిస్తాయా అన్న విషయమే కాకుండా, మారిన కాలానికి, పెరుగుతున్న అవసరాలకు సమాజానికి ఉపయోగకరంగా విద్యార్థులు తయారయ్యేటట్టు కోర్సులను మార్పు చేయాల్సి ఉన్నది. కొత్త కోర్సులకు రూపకల్పన చేయాల్సి ఉన్నది.

ఉదాహరణకు బీఏలో డిగ్రీ అవగానే ఉపాధ్యాయ వృత్తి తీసుకునే వారికి బీఏ సబ్జెక్టులో ఇంగ్లీషు భాష కూడా ఉండవచ్చు కదా! బీఏలో అన్ని కాలేజీల్లో ఇంగ్లీషు లిటరేచర్ ఉంటుంది కానీ లాంగ్వేజీ ఉండదు. అలాగే ఉపాధ్యాయ శిక్షణ ఇచ్చే బీఎడ్ కోర్సు కూడా. అసలు వస్తు, విషయ సంబంధమైన సామాన్య, విజ్ఞానశాస్త్రాలు, నైపుణ్యాలు సంతరించుకోవలసిన భాష కలిపి ఒక డిగ్రీలో ఎందుకు పెట్టాలి? రెండురకాల సబ్జెక్టులకు భాషా బోధనా పద్ధతులు వేర్వేరుగానే కాదు, వ్యతిరేకంగా కూడా ఉంటాయి. ఇన్నేండ్ల నుంచి విద్యార్థులకు భాషా నైపుణ్యాలు పట్టుబడకపోవటానికి కారణం ఇంగ్లీషును కూడా సైన్స్ లాగా, సోషల్ స్టడీస్ లాగా బోధించటమే! ఇంగ్లీషు భాష విషయంలో లాగానే మిగితా కోర్సులు కూఆడ ఉండే అవకాశం పుష్కలంగా ఉన్నది. ఇన్ని యూనివర్సిటీల్లో శిల్పశాస్త్రం మీద ఒక్క కోర్సు కూడా లేదు!

ఇక ఈ పట్టాలు పుచ్చుకునేవారిని మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దాలంటే మార్గాలు చాలా ఉన్నాయి. చివరి సెమిస్టర్‌లో వారివారి సబ్జెక్టులు, ఇష్టాలకు తగినట్టుగా 6నెలల ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయవచ్చు. ఆ విద్యార్థులు ఆఫీసుల్లో, బ్యాంకుల్లో, పరిశ్రమల్లో, విద్యాలయాల్లో ఏ సంస్థలోనైనా పనిచేస్తే వారికి కొంత అనుభవం, ఉద్యోగం సంపాదించుకునే నైపుణ్యాలు కలుగుతాయి. ఇంకా చేయగలిగిన వారికి డిగ్రీ తర్వాత ఏడాది పాటు ఉండే డిప్లొమా కోర్సులు ఆయా యూనివర్సిటీలు అందించవచ్చు.ఆఫీసు అసిస్టెంట్, బ్యాంక్ ఉద్యోగం, రైటింగ్, ప్రూఫ్ రీడింగ్, మీడియా ఉద్యోగాలు మొదలైన వాటిలో ఈ డిప్లొమాలు అందిస్తే విద్యార్థులకు చాలా ఉపయోగం. పాశ్చాత్య దేశాల్లో విశ్వవిద్యాలయాల్లో అందించే కోర్సుల పట్టిక చూస్తే మన దేశం విద్యారంగంలో ఎంత వెనుకబడి ఉన్నదో తెలుస్తుంది. ఉన్నత విద్యను అభ్యసించిన యువత ఉద్యోగార్హతలు లేకుండా ఉన్నారంటే, 14 ఏండ్లు నేర్చుకున్న ఇంగ్లీషు భాషలో కూడా నైపుణ్యాలు లేవంటే ఎవరిది తప్పు. ఫిజిక్స్‌లో 98 శాతం, లెక్కల్లో 100 శాతం తెచ్చుకోగలిగిన విద్యార్థులు ఇంగ్లీషులో ఫెయిల్ అవుతున్నారంటే లోటు వారిలో ఉందా? విద్యావ్యవస్థలో ఉందా? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలోని సమస్యలను పరిష్కరిస్తే తప్ప ఈ దేశంలో మానవ వనరులు పెరుగవు. యాభై లక్షల జనాభా ఉన్న దేశాల నుంచి నోబెల్ బహుమతి పొందేవారు ఉంటారు గానీ 125 కోట్ల జనాభా ఉన్న భారతదేశం మానవ వనరులను పెంపొందించుకోకుండా ఉంటే ఇంకొన్ని శతాబ్దాలు వెనుకబడే ఉంటుంది.

రైతులకు రెట్టింపు ఆదాయమార్గం

విశ్లేషణ



డాక్టర్ రామకృష్ణ బండారు

మన దేశం ఎన్నో రంగాల్లో ముందుకుపోతుంటే, వ్యవసాయ రంగం మాత్రం రోజురోజుకు కుదేలవుతున్నది. వ్యవసాయం మీద ఆధారపడిన రైతుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నది. ఈ దుస్థితికి ఎన్నో కారణాలున్నప్పటికీ, రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో నష్టాల పాలవుతున్నాడన్నది మాత్రం జగమెరిగిన సత్యం. అర్థం కాని సప్లయి, డిమాండ్ చక్రం కింద గిట్టుబాటు ధరలేక అన్నదాత నలిగిపోతున్నాడు. ఏయే పంటలకు డిమాండ్ ఉన్నది, ఏయే పంటలకు మార్కెట్లో అవకాశాలున్నాయో తెలువక, వేసిన పంటలనే తిరిగివేసి నష్టపోతున్నాడు. రైతులు ఈ సమస్యను అధిగమించాలంటే వినియోగదారుల మార్కెట్‌పై అవగాహన పెరుగాలి. వినియోగదారుల అభిరుచుల్లో, అలవాట్లలో మార్పులు తెలియాలి. మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా పంటలు వేసుకునే పరిస్థితికి రైతు ఎదుగాలి. అప్పుడే రైతుల కష్టానికి ఫలితం దక్కుతుంది.

ఇక అసలు విషయానికొస్తే, 'పాత ఒక రోత, కొత్త ఒక వింత' అన్న సామెత మాదిరిగా గత దశాబ్దల కాలంగా పట్టణాల్లో నివసించేవారి ఆహారపుటలవాట్లలో విపరీతమైన మార్పులు చోటుచేసుకున్నాయి. సంప్రదాయ ఆహార పదార్థాలకు విరుద్ధంగా పిజ్జాలు, బర్గర్లు, చైనీస్ ఫుడ్, ఫ్రైడ్ రైస్ ఇలా.. రకరకాల పాశ్చాత్య ఆహార పదార్థాలకు అలవాటైన ప్రజలు ఇప్పుడు తిరిగి సంప్రదాయ ఆహార వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా, పాశ్చాత్య ఆహారపుటలవాట్లకు రుచి మరిగిన పట్టణ యువత, మధ్య వయసు వారు, ఇప్పుడు కొర్రలు, అరికలు, ఊదలు, జొన్నలు వంటి చిరు ఆహారధాన్యాల వంటకాలపై ఆసక్తి చూపుతున్నారు. ఆరు నెలల కిందట బహిరంగ మార్కెట్లో కిలో రూ.30 నుంచి రూ.50 ఉన్న ఈ చిరుధాన్యాలు ఇప్పుడు సుమారు రూ.100 నుంచి రూ.150 మేర పలుకుతున్నాయి. ఇప్పుడు ఈ చిరుధాన్యాలకు పట్టణాల్లో ఏ మేర డిమాండ్ పెరుగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. పాశ్చాత్య ఆహారపు పదార్థాల ద్వారా వివిధ అనారోగ్య సమస్యలు, ముఖ్యంగా బీపీ, షుగర్, గుండెపోటు వంటి రోగాలకు కారణమైన ఊబకాయం బారి నపడుతున్న పట్టణవాసులు ఇలాంటి జబ్బుల నుంచి బయటపడేందుకు చిరుధాన్యాల ఆహారం వైపు మొగ్గు చూపెడుతున్నారు. అలాగే, వాతావరణం, సాగు పద్ధతుల్లో వచ్చిన మార్పులు, ప్రజల జీవనశైలి, ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. రసాయనాలతో పండిన పంటలు సైతం ఆయుక్షీణం చేస్తున్నాయి. అందుకే ఇప్పుడు ప్రజలు తిరిగి సంప్రదాయ ఆహారమైన చిరుధాన్యాల ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. మారిన ఈ పరిస్థితులను రైతులు అందిపుచ్చుకోవాలి. కొర్రలు, అరికలు, ఊదలు వంటి డిమాండ్ ఉన్న చిరుధా న్యాల పంటలకు మొగ్గుచూపాలి. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి వనరులతో పండే చిరుధాన్యాల పంటలకు ఆదరణ పెరుగుతున్నది. వరి, గోధుమ, ఇతర ఆహార పదార్థాల వాడకం తగ్గుతుంది. రైతులు మార్కెట్ పరిస్థితులు, వాస్తవాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకొని మార్కెట్ ఫలాల ను అందిపుచ్చుకోవాలి.

తెలంగాణ రాష్ట్రం చిరుధాన్యాల పంటలకు అనుకూలమైన ప్రాంతంగా నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి పంటల సాగు కేవలం తొంభై రోజుల్లో చేతికి వస్తుంది. ఒక ఎకరానికి సుమారుగా 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశమున్నది. క్వింటాలుకు సుమారు రూ.4 వేల ధర పలుకుతుంది. ఆ లెక్కన రూ.60 వేల వరకు ప్రస్తుత పరిస్థితుల్లో వచ్చే అవకాశం ఉన్నది. ఇక పెట్టుబడి ఖర్చులు కూడా చాలా తక్కువ. ముఖ్యంగా రసాయనాలు, పురుగు మందుల వంటి ఖర్చు ఉండదు. నిపుణుల ప్రకారం సుమారుగా రూ.6 వేలు మాత్రమే ఒక ఎకరానికి ఖర్చయ్యే అవకాశం ఉంటుంది. తక్కువ పెట్టుబడి, నీటి వనరులతో పండే ఈ పంట సాగు సిరులు కురిపించి రైతును రాజు చేస్తుందనటంలో సందేహం లేదు. ముఖ్యంగా ఈ పంట సాగు ద్వారా రైతులు నష్టపోయే అవకాశమే లేదు. పశువుల మేత ద్వారా కూడా ఆదాయం సమకూర్చుకునే అవకాశం ఉన్నది. అన్నింటికంటే ముఖ్యమైనది డిమాండ్. ప్రస్తుత పరిస్థితుల్లో వినియోగదారుల నుంచి ఈ చిరు ఆహార పదార్థాలకు విపరీతమైన డిమాండ్ ఉన్నది. తెలంగాణలోనే కాకుండా, తమిళనాడు, కర్ణాటక, ఏపీ రాష్ట్రాల్లో కూడా కొర్రలు, అరికలు, ఊదలు వంటి చిరుధాన్యాలకు మంచి మార్కె ట్ ఉన్నది. భవిష్యత్తులో వరి, గోధుమలకు ప్రత్యామ్నాయం గా చిరుధాన్యాల వాడకం పెరిగే అవకాశం లేక పోలేదు.

కేసీఆర్ ప్రభుత్వం 'రైతుల ఆదాయ వృద్ధే' ధ్యేయంగా ముందుకుపోతున్నది. కాబట్టి చిరుధాన్యాల పంటల సాగుపై కూడా రైతుల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా 'రైతు సమన్వయ సమితులు' ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాలకు మార్కెట్‌లో ఉన్న అవకాశాలను వివరించాలి. చిరుధాన్యాల సాగు ఎలా చేసుకోవాలి, సాగుచేసిన పంటను ఎలా మార్కెటింగ్ చేసుకోవాలన్న అంశాలపై రైతుల్లో సందేహాలను తీర్చాలి. ఇప్పటికే ఈ తరహా పంటలు పండిస్తున్న రైతులు దళారీల దోపిడీకి గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. ఎందుకంటే, కొర్రలు, అరికలు, ఊదలు వంటి డిమాండ్ ఉన్న చిరు ఆహార ధాన్యాలను మధ్యవర్తులు కేవలం రూ.30 నుంచి రూ.40కే రైతుల నుంచి కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్లో వినియోగదారులకు సుమారు రూ.100 నుంచి రూ.150 వరకు అమ్ముతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వమే, రైతుల భాగస్వామ్యంతో ఈ చిరుధాన్యాల శుద్ధి పరిశ్రమలు ఏర్పాటుచేయాలి. తద్వారా రైతే ఆ మేర మార్కెట్ ధరను లబ్ధి పొందే అవకాశం ఉన్నది. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి వనరులతో పండే చిరుధాన్యాల పంటలకు ప్రస్తుతం ఉన్న మార్కెట్ అవకాశాలను గనుక తెలంగాణ రైతులు అందిపుచ్చుకోగలిగితే రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉన్నది.

> కేసీఆర్ ప్రభుత్వం 'రైతుల ఆదాయ వృద్ధే' ధ్యేయంగా ముందుకుపోతున్నది. కాబట్టి చిరుధాన్యాల పంటల సాగుపై కూడా రైతుల్లో అవగాహన కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా 'రైతు సమన్వయ సమితులు' ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాలకు మార్కెట్‌లో ఉన్న అవకాశాలను వివరించాలి. చిరుధాన్యాల సాగు ఎలా చేసుకోవాలి, సాగుచేసిన పంటను ఎలా మార్కెటింగ్ చేసుకోవాలన్న అంశాలపై రైతుల్లో సందేహాలను తీర్చాలి. ఇప్పటికే ఈ తరహా పంటలు పండిస్తున్న రైతులు దళారీల దోపిడీకి గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

సిరిసిల్లలో నేడు కేటీఆర్ పర్యటన

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రారంభించనున్న మ్యూజికల్ ఫౌంటెయిన్

సిరిసిల్ల, నమస్తేతెలంగాణ: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించనున్నారు. సిరిసిల్ల పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, పూర్తయిన పనులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు మునిసిపల్ అధికారులు కేటీఆర్ పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారు. పర్యటన వివరాలు ఇలా.. హైదరాబాద్ నుంచి ఉదయం 11 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు సిరిసిల్లకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12.30గంటలకు అక్షయపాత్ర (రూ.5 భోజనం) పథకాన్ని, ఒంటిగంటకు నెహ్రూనగర్‌లో వైకుంఠధామం, మధ్యాహ్నం 1.15 గంటలకు ఇందిరాపార్క్, 1.30 గంటలకు ఏకలవ్య కమ్యూనిటీ హాల్, 1.45 గంటలకు శాంతినగర్ ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పట్టణ శివారులో గుంపేపావలి దర్గాను సందర్శిస్తారు. 3గంటలకు సిరిసిల్లలో మార్కండేయ శోభాయాత్రలో పాల్గొంటారు. సాయంత్రం 6.30 గంటలకు తడి, పొడిచెత్త సేకరణ బ్యాటరీ వాహనాలు, సాయంత్రం 7 గంటలకు బతుకమ్మ ఘాట్ వద్ద మ్యూజికల్ ఫౌంటెయిన్ ప్రారంభిస్తారు. 7.30 గంటలకు బతుకమ్మ ఘాట్ వద్ద స్త్రీనిధి ట్యాబ్స్ పంపిణీ చేయనున్నారు.

క్రాంతి ఖండాంతర ఖ్యాతి



డ్రిల్ మెషిన్‌తో విన్యాసం చేస్తున్న క్రాంతి

అంతర్జాతీయ టాలెంట్‌షోకు సూర్యాపేట వాసి

రేపు అమెరికన్ గట్స్ టాలెంట్ షోలో ప్రదర్శన

సూర్యాపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: వేగంగా తిరుగుతున్న రెక్కల ఫ్యాన్‌ను నాలుకతో ఆపడం, సలసలా కాగుతున్న వేడినూనెలో మిర్చీలు వేసి చేతులతో బయటకు తీయడం, చేతివేలితో కొబ్బరి బోండాలకు రంధ్రం చేయడం, ముక్కుకు హుక్ తగిలించుకొని బస్సును లాగడం, గొంతుతో ఒకేసారి 32 కత్తులను కుక్కడం, డ్రిల్ మెషిన్‌ను ముక్కుద్వారా గొంతులోకి దింపడం వంటి సుమారు వంద రకాల గగుర్పొడిచే విన్యాసాలతో ఎన్నో ప్రశంసలు అందుకున్న సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన ఫణికర్ క్రాంతి మరో అద్భుత గౌరవం దక్కించుకున్నాడు. లాస్‌ఏంజెల్స్‌లో శనివారం జరిగే అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందిన అమెరికన్ గట్స్ టాలెంట్ షోలో ప్రదర్శన ఇచ్చే అవకాశం లభించింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు గ్రామానికి చెందిన సత్తయ్య, మల్లమ్మ దంపతుల కొడుకు క్రాంతి. కూలీపనిచేసి జీవించేందుకు వీరు దశాబ్దం కిందటే సూర్యాపేటకు వచ్చారు. చిన్న వయసునుంచే విన్యాసాలపై ఆసక్తి ఉన్న క్రాంతి.. ఇప్పటివరకు 500 షోలలో పాల్గొని విలక్షణంగా వంద ప్రత్యేక విద్యలను ప్రదర్శించాడు. డిగ్రీ వరకు చదువుకున్న క్రాంతి విన్యాసాల ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నాడు. సోనీ, కలర్స్, జీటీవీ, బీబీసీతోపాటు జాతీయ చానళ్లలో ప్రసారమయ్యే రియాలిటీ షోలలో విన్యాసాలు చేశాడు. దుబాయ్, మలేషియాలోనూ ప్రదర్శనలు ఇచ్చి ఎన్నో అవార్డులు అందుకున్నాడు. 26 కత్తులను గొంతులో పెట్టుకొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదు చేయగా, అమెరికాలో అంతకు అదనంగా కత్తులను గొంతులో పెట్టుకొని ప్రదర్శన ఇచ్చేందుకు గురువారం రాత్రి క్రాంతి బయలుదేరాడు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మె ల్యే జగదీశ్ రెడ్డి అమెరికాలోని తెలుగువారితో మాట్లాడి క్రాంతికి వసతి కల్పించడంతోపాటు ఆర్థికంగా చేయూతను అందించారు. ఎమ్మెల్యే సహకారంతో మరింత ఉత్సాహంగా ప్రదర్శనల్లో పాల్గొని సత్తాచాటుతానని క్రాంతి తెలిపాడు.



అమెరికాకు వెళ్లే ముందు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి తన సర్టిఫికెట్లు, పత్రాలు చూపుతున్న క్రాంతి



కేటీఆర్ అందించిన రూ.51 వేలను రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో పెండ్లికూతురు మౌనికకు అందిస్తున్న ఎంపీపీ శ్రీలత, నాయకులు

మనసున్న మారాజు కేటీఆర్

తల్లిదండ్రుల్లేని యువతి పెండ్లికి ఆర్థికసాయం

పెండ్లి పందిరిలోనే రూ.51 వేలు అందజేసిన ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల రూరల్: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మరోసారి ఔదార్యాన్ని చాటుకున్నారు. అనాథ ఆడబిడ్డ పెండ్లికి రూ.51 వేలు ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. పేదింట కాంతులు నింపి మనసున్న మారాజుగా అభినందనలు అందుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లికి చెందిన యువతి శివరాత్రి మౌనిక పిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయింది. అప్పటినుంచి ఆమె ఆలనాపాలనను నాన్నమ్మ రాజవ్వ చూస్తున్నది. ఇటీవల మౌనికకు పెండ్లి నిశ్చయమైంది. ఈ నెల 4న సిరిసిల్ల పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఉన్న కేటీఆర్‌ను రాజవ్వ కలిసి మౌనిక పెండ్లి పత్రికను అందజేసింది. 'అమ్మానాన్నలు లేరు సారు.. నేనే పెండ్లి చేస్తున్నా' అంటూ పరిస్థితిని వివరించగా.. కేటీఆర్ చలించిపోయారు. పెండ్లికి రాలేకపోయినా, ఖర్చులకు సాయం అందిస్తానని ధైర్యం చెప్పి పంపించారు. గురువారం ఇంటి వద్ద మౌనిక పెండ్లి జరుగగా.. కేటీఆర్ పంపించిన రూ.51 వేలను ఎంపీపీ జూపల్లి శ్రీలత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకారపు రవీందర్ తదితరులు పెండ్లి పందిరిలో యువతికి అందజేశారు. 'కేటీఆర్ సార్ సల్లంగా ఉండాలి. సార్‌కు రుణపడి ఉంటాం' అంటూ మౌనిక, రాజవ్వ ఆనందబాష్పాలురాల్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేటీఆర్ పీఏ ధన్‌రాజ్, జూపల్లి శ్రీనాథరావు, పుర్మాణి రాంలింగారెడ్డి, మాజీ సర్పంచ్ గుగ్గిల్ల అంజయ్య, బొల్లి రామ్మోహన్, పడిగెల రాజు, రామన్నపల్లె సర్పంచ్ రంగయ్య, వెంకటరాములు, సిలువేరి నర్సయ్య, చిరంజీవి తదితరులు ఉన్నారు.

సాగుకు నాబార్డ్ సాయం

2019-20లో రూ.1.01 లక్షల కోట్ల రుణాలివ్వాలని ఆదేశం

వ్యవసాయ యాంత్రీకరణ, ఫుడ్ ప్రాసెసింగ్‌కు ప్రాధాన్యం

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నాబార్డ్ కేటాయింపులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయం, యాంత్రీకరణకు 2019-20 వార్షిక రుణ ప్రణాళికలో నాబార్డ్ అధిక ప్రాధాన్యం కల్పించింది. ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ యాంత్రీకరణ తదితర అంశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించింది. ఇదే విషయాన్ని బ్యాంకర్లకు ఇటీవల విడుదలచేసిన రాష్ట్ర రుణ ప్రణాళిక విధానపత్రంలో సూచించింది. ఇందుకోసం సమగ్ర నివేదిక తయారు చేసింది. 2019-20లో రూ.1.01 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు తెలిపింది. అందులో 70 శాతం అంటే రూ. 70,965 కోట్ల వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ సహా అనుబంధ రంగాలకే చెందాలని నిర్దేశించింది. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా సాగు ఖర్చు తగ్గించడం, కూలీల కొరతను అధిగమించడం సాధ్యమవుతుందని పేర్కొన్నది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల యంత్రాల కొనుగోలుకు రూ.2,833 కోట్లు కేటాయించాలని సూచించింది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమపై దృష్టిపెట్టడం ద్వారా వ్యవసాయ పంట ఉత్పత్తుల్లో వృథాను అరికట్టడం, విలువ ఆధారిత అదనపు ఉత్పత్తులను తయారుచేసి అధిక లాభాలను ఆర్జించడానికి వీలవుతుందని తెలిపింది. ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు, కాటన్ సీడ్ ఆయిల్, ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్లు తదితరాల ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నాబార్డ్ సూచించింది. జిల్లాలనుంచి సేకరించిన సమాచారం ఆధారంగా యూనిట్లు, రుణాలను ఖరారు చేసింది.

సగం రుణాలు పత్తి, వరి పంటకే..

నాబార్డు ప్రకటించిన విధానపత్రంలో వచ్చే ఏడాది రూ.49,785 కోట్లు పంట రుణాలకు కేటాయించాలని సూచించగా, అందులో దాదాపు సగం రూ.24 వేల కోట్లు పత్తి, వరి పంటలకే ఇవ్వాలని ఆదేశించింది. పత్తి రైతులకు రూ.12,456 కోట్లు, వరి రైతులకు రూ.11,635 కోట్లు రుణంగా ఇవ్వాలని బ్యాంకర్లకు ప్రతిపాదించింది. మక్కజొన్న రైతులకు రూ.4,250 కోట్లు, మిర్చి రైతులకు రూ.1000 కోట్లు కేటాయించింది. విత్తనోత్పత్తి చేసే రైతులకు రూ.142 కోట్లు రుణంగా ఇవ్వాలని నిర్ణయించింది.



ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.1,145 కోట్లు

2019-20లో 11,182 ఫుడ్‌ప్రాసెసింగ్ యూ నిట్ల ఏర్పాటుకు రూ.1,145 కోట్లు రుణంగా ఇవ్వాలని నాబార్డ్ సూచించింది. ప్రతిపాదిత అంశాల్లో 667 ఆగ్రో ప్రాసెసింగ్ యూనిట్లు, 899 డెయిరీ ప్రొడక్ట్ యూనిట్లు, 482 రైస్ మిల్లులు, 345 ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు రుణాలను ఇవ్వాలని పేర్కొంది. వీటితోపాటు కాటన్ సీడ్ ఆయిల్ యూనిట్లు 22, దాల్ మిల్లులు 74, ఫ్రూట్ ప్రాసెసింగ్ యూనిట్లు 180, మసాలా గ్రైండింగ్ యూనిట్లు 84, మాంసం ప్రాసెసింగ్ యూనిట్లు 14, వేప నూనెమిల్లులు మూడు ఉన్నాయి. వీటన్నింటి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభు త్వం తెలంగాణ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని ఏర్పాటుచేసింది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు అవసరమైన ధాన్యాలు, పప్పులు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు, పాలు, మాంసం, కోళ్లు, చేపలు వంటి వాటిని పంటకాలనీల ద్వారా నిర్దేశిత ప్రాంతాలనుంచి సేకరిస్తారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదని నాబార్డ్ తెలిపింది.

వ్యవసాయ యాంత్రీకరణకు రూ.2,833 కోట్లు

వ్యవసాయ యాంత్రీకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నాబార్డ్ నివేదిక తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల యంత్రాల కొనుగోలుకు రూ. 2,833 కోట్లు కేటాయించాలని సూచించింది. అందులో ట్రాక్టర్లు, పరికరాల కోసమే రూ.1,987 కోట్లు కేటాయించింది. వచ్చే ఏడాది అధికంగా ట్రాక్టర్ల రుణాలపైనే దృష్టిసారించింది. అందులో 2,585 సెకండ్ హ్యాండ్ లేదా మినీ ట్రాక్టర్లకు రూ. 79 కోట్లు రుణంగా ఇస్తున్నది. 25,356 ట్రాక్టర్లు, ఇతర పరికరాలకు రూ.1,906 కోట్లు రుణం ఇవ్వనున్నది. 180 ట్రాక్టర్ డ్రాన్ డైరెక్ట్ సీడింగ్ యూనిట్లకు రూ. 1.22 కోట్లు, 68 ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్లకు రూ.63 లక్షలు అందజేయనున్నది.

నేటినుంచి బాసరలో వసంత పంచమి ఉత్సవాలు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో శుక్రవారం ఉదయం నుంచి మూడ్రోజులపాటు వసంత పంచమి ఉత్సవాలు నిర్వహించనున్నారు. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి వేలమంది భక్తులు తరలివచ్చి చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపించనున్నారు.

కొత్తగూడెంలో స్వల్ప భూకంపం

కొత్తగూడెం క్రైం: స్వల్ప భూకంపంతో కొత్తగూడెం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. కొత్తగూడెంతోపాటు పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, చంద్రుగొండ ప్రాంతాల్లో గురువారం రాత్రి 11.23 గంటలకు స్వల్పంగా భూమి కంపించింది. ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో ఇండ్లల్లో ఉన్నవారంతా పరుగున వీధుల్లోకి వచ్చారు. అయితే ఏ ప్రాంతం నుంచి భూ కంపం ఏర్పడిందనే విషయం తెలియాల్సి ఉంది.

అక్రమ కలప పట్టివేత

బయ్యారం/బెజ్జూర్: మహబూబాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో గురువారం అక్రమ కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రామచంద్రపురం, రెండేర్లగడ్డ, నారాయణపురం గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించిన సిబ్బంది సుమారు రూ.2 లక్షల విలువ చేసే కలపను పట్టుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అనుమతి లేకుండా కోత యంత్రాలను వాడొద్దని, కలపను అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్వో సుధాకర్,రేంజర్ కర్నావత్ వెంకన్న హెచ్చరించారు. కాగా ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండలం కుశ్నపల్లిలో గురువారం అటవీ అధికారులు సోదాలు నిర్వహించి రూ. 15 వేల విలువైన కలప దుంగలను పట్టుకున్నారు.



కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



వివిధ పార్టీల కార్యకర్తలను టీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

టీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్ఎస్‌లోకి చేరికలు జోరందుకున్నాయి. ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గురువారం గులాబీ కండువాలు కప్పుకొన్నారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులతోపాటు సుమారు వందమంది యువకులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో, జనగామ జిల్లా నర్మెట మండలానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు వందమంది ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకొన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు 200మంది ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ డీఈ

వేములవాడ, నమస్తేతెలంగాణ: పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఏసీబీకి చిక్కాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో నిర్మించిన పంచాయతీ భవనానికి బిల్లుల చెల్లింపులో డీఈ నాగిరెడ్డి మహేందర్‌రెడ్డి రూ.60 వేలు లంచం డిమాండ్ చేశాడు. కాంట్రాక్టర్ కట్ట లచ్చయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. డీఎస్పీ కిరణ్‌కుమార్ నేతృత్వంలో అధికారులు గురువారం వేములవాడలోని పంచాయతీరాజ్ కార్యాలయంలో డీఈ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.



డీఈ మహేందర్‌రెడ్డి



సిద్దిపేటలో జయశంకర్ భవనాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

ఇబ్రహీంపూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సర్పంచ్‌లకు మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచన

సిద్దిపేట కలెక్టరేట్/నంగునూరు, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ సూచించిన విధంగా సమిష్టిగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు నూతన సర్పంచ్‌లకు పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండల సర్వసభ్య సమావేశంలో ఆయన నూతన సర్పంచులనుద్దేశించి ప్రసంగించారు. అంతకుముందు సిద్దిపేటలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించిన జయశంకర్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. గోల్కొండ షోరూమ్ పనులను రాష్ట్ర చేనేత జౌళిశాఖ సంచాలకులు శైలజరామయ్యార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిదన్నారు. సర్పంచ్‌లు ఇబ్రహీంపూర్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. సిద్దిపేటలో ప్లాస్టిక్‌ను నిషేధిద్దామని, ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగులు వాడాలని పిలుపునిచ్చారు.

6 కోట్లతో నాగోబా ఆలయ పునర్నిర్మాణం



ఆదిలాబాద్ జిల్లా కెస్లాపూర్ నాగోబా దర్బార్‌లో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్. చిత్రంలో కలెక్టర్ దివ్య, జెడ్పీ చైర్‌పర్సన్ శోభారాణి, ఎస్పీ వారియర్ తదితరులు

- గిరిజనుల పట్టాల సమస్య త్వరలో పరిష్కారం
- కెస్లాపూర్ దర్బార్‌లో ఎంపీ నగేశ్

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: రాష్ట్రంలో గిరిజన జాతరలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ఆదిలాబాద్ ఎంపీ జీ నగేశ్ తెలిపారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా నిర్వహించిన దర్బార్‌లో ఆయన మాట్లాడుతూ నాగోబా ఆలయ పునర్నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. గత ఏడాది రూ.4.8 కోట్లతో ఆలయ నిర్మాణంతోపాటు రోడ్లు, దర్బార్‌హాల్, ఇతర పనులను చేపట్టామన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న భూమి పట్టాల సమస్యను సీఎం కేసీఆర్ త్వరలో పరిష్కరిస్తారన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని జోడేఘాట్‌లో మ్యూజియం నిర్మించడంతోపాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను కల్పించినట్టు చెప్పారు. ప్రభుత్వ సహకారంతో మూడేండ్లుగా జంగుబాయి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గిరిజన గూడేల్లో 95 పెర్సపెన్ ఆలయాలను నిర్మిస్తున్నామని, ఒక్కో ఆలయానికి రూ.12 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మిగితా గ్రామాల్లో 200 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వీ శోభారాణి, కలెక్టర్ దివ్య, కాగజ్‌నగర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎస్పీ విష్ణు వారియర్, ఐటీడీఏ పీవో కృష్ణ ఆదిత్య, అసిస్టెంట్ కలెక్టర్ గోపి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ లక్కేరావు, గిరిజన పెద్దలు పాల్గొన్నారు.

పట్టుదలతో లక్ష్యాలు సాధించాలి



యువతరంగం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ నవీన్‌మిట్టల్

- కళాశాల విద్య కమిషనర్ నవీన్‌మిట్టల్
- వరంగల్‌లో ఘనంగా రాష్ట్రస్థాయి యువతరంగం పోటీలు

సిద్ధార్థనగర్(వరంగల్): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటూనే లక్ష్యాన్ని సాధించాలని రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. గురువారం వరంగల్ నగరం హన్మకొండలోని వడ్డేపల్లిలో ఉన్న ప్రభుత్వ పింగిళి డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో కళాశాల ప్రిన్సిపాల్ జీ ఇందిర అధ్యక్షతన రాష్ట్రస్థాయి యువతరంగం పోటీలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ.. వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులు నచ్చిన కోర్సులు ఎంచుకునేలా 'దోస్త్' ద్వారా రూపకల్పన చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర-ఉన్నత విద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్ దర్జన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో రూసా ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌందర్య జోసఫ్, రాష్ట్ర ఆర్గనైజర్ అనిశ్ రాణ్, రాష్ట్ర కోఆర్డినేటర్లు కోటేశ్వర్‌రావు, సోమయ్య, రాంభాస్కర్, కేడీసీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, కల్చరల్ కన్వీనర్ శిరీష, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రాజారెడ్డి పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు హరికృష్ణ

పేద విద్యార్థుల కోసమే గురుకులాలు

గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ములుగు: పేద విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయిలో ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు పనిచేస్తున్నాయని గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి ములుగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన అల్‌గోరిథమ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సినీ దర్శకుడు వేణు, డిప్యూటీ కార్యదర్శి వెంకటలక్ష్మి, నిర్మల, కల్పన తదితరులు పాల్గొన్నారు.

అద్దె గర్భానికి రూ.5 లక్షలు!

గర్భస్రావమైతే రూ.లక్షలోపే చెల్లింపు.. మహిళలను తెచ్చే బ్రోకర్లకు రూ.80 వేల కమీషన్

ఆర్థిక వెనుకబాటుతో ఆకర్షితులవుతున్న మహిళలు.. భూపాలపల్లి జిల్లా సరిహద్దు గ్రామాల్లో దందా

జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ: నిరుపేద మహిళల ఆర్థిక పరిస్థితులే ఆసరాగా అద్దె గర్భాల దందా యథేచ్ఛగా సాగుతున్నది. అద్దె గర్భాలకు రూ.5లక్షల ఖరీదు కడుతున్నారు. భూపాలపల్లి జిల్లా సరిహద్దు గ్రామాల్లో మూడేండ్లుగా ఈ దందా నిరాటంకంగా సాగుతున్నది. మంగపేట మండలం అకినేపల్లి మల్లారం గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఇద్దరు వ్యక్తులు దీన్ని వ్యాపారంగా మలుచుకున్నట్టు సమాచారం. మహిళను అప్పగించే బ్రోకర్లకు రూ.80వేల వరకు ముట్టజెపుతున్నట్టు తెలిసింది. అద్దె గర్భం దాల్చిన మహిళ ప్రసవమయ్యే దాకా పట్టణ ప్రాంతంలో ఆ దందా చేసే వ్యక్తుల పర్యవేక్షణలో ఉండాలి. ప్రసవం తర్వాత బిడ్డను అప్పగించేలా ఒప్పందం చేసుకుంటున్నట్టు సమాచారం. పుట్టిన బిడ్డను అప్పగించాకే సదరు మహిళకు రూ.5లక్షల వరకు చెల్లిస్తున్నట్టు గ్రామస్థుల ద్వారా తెలిసింది. దురదృష్టవశాత్తు అబార్షన్ జరిగినా, ప్రసవం తర్వాత పుట్టిన బిడ్డ చనిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటే కేవలం రూ. 50 వేల నుంచి రూ.లక్ష వరకే చెల్లిస్తున్నట్టు సమాచారం. మంగపేట మండలం అకినేపల్లిమల్లారం, బోరునర్సాపురం గ్రామాలతోపాటు కొత్తగూడెం జిల్లాలోని బయ్యారం, మణుగూరు, అశ్వాపురం తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 21మంది ఇప్పటివరకు అద్దె గర్భాలు దాల్చి పిల్లలను కన్నట్టు తెలుస్తున్నది. ఈ మహిళల్లో కొందరు ప్రస్తుతం కడుపు నొప్పి, ఇతర గైనిక్ సంబంధిత వ్యాధులబారిన పడి ఇబ్బందులు పడుతున్నట్టు బాధితుల బంధువులు చెప్తున్నారు. ఇటీవల అకినేపల్లిమల్లారం ఎస్టీకాలనీ నుంచి 38 ఏండ్ల మహిళ అద్దెగర్భం ఒప్పందం చేసుకొని, కుటుంబసభ్యులకు చెప్పకుండా పట్టణ ప్రాంతానికి వెళ్లినట్టు తెలిసింది. కనిపించకుండా పోయిన ఈ మహిళ కొడుకు అద్దె గర్భం దందా చేస్తున్న స్థానికుడిని గురువారం నిలదీశాడు. శుక్రవారంలోగా తన తల్లిని గ్రామానికి తీసుకురాకపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించినట్టు సమాచారం.



కొత్త సర్పంచ్.. కల్యాణ కానుక

ఆడ, మగ అనే తేడా లేకుండా పెండ్లి చేసుకున్న ప్రతి ఒక్కరికి రూ.25,551సాయం అందజేస్తూ పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారు వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలపరిధిలోని కొత్త కోల్కొంద సర్పంచ్ కరణం పార్వతమ్మ. గురువారం గ్రామానికి చెందిన సురేశ్, శ్రీశైలం వివాహాలు జరుగడంతో వారి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు. ఈ ప్రక్రియ ఐదేండ్ల వరకుకొనసాగుతుందని పార్వతమ్మ తెలిపారు. గ్రామానికి చెందిన బర్ల స్వరూప తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శంకర్, వార్డుసభ్యులు బ్రహ్మానందరెడ్డి, రాసయ్య, నర్సింహులు పాల్గొన్నారు. - మోమిన్‌పేట

భారత ప్రభుత్వం
రోడ్డు రవాణా మరియు హైవేల మంత్రిత్వ శాఖ
ప్రకటన
న్యూఢిల్లీ, 29, జనవరి 2019

S.O. 538 (E)- నేషనల్ హైవేస్ యాక్ట్, 1956 (48 ఆఫ్ 1956) (ఇకపై సదరు చట్టంగా రిఫర్ చేయబడును)లోని సెక్షన్ 3Aలో సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలు వినియోగించుకుంటూ, తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో కి.మీ. 69.8 నుండి కి.మీ.95.3(హుజూరాబాద్) వరకు భూమి విస్తరణలో, జాతీయ రహదారి నం. 563 యొక్క నిర్మాణం (వెడల్పు చేయుట/పేవ్డ్ షోల్డర్‌తో రెండు లేన్/ఫోర్ లేనింగ్ మొ(వి), నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు దిగువ షెడ్యూలులో సంక్షిప్తంగా వివరించిన భూమి ప్రజోపయోగార్థం అవసరమైనదని సంతృప్తి చెందిన మీదట కేంద్ర ప్రభుత్వం సదరు భూమి సేకరించాలనే దాని ఉద్దేశాన్ని ఇందుమూలంగా ప్రకటిస్తోంది.

సదరు భూమిలో ప్రయోజనం గల ఎవరైనా వ్యక్తి అధికారిక గెజిట్‌లో ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఇరవై -ఒక్క రోజులలోగా, సదరు చట్టంలోని సెక్షన్ 3Cలో సబ్-సెక్షన్ (1) క్రింద పై తెలిపిన ప్రయోజనం కొరకు సదరు భూమి వినియోగానికి అభ్యంతరాన్ని తెలియజేయవచ్చును.

అటువంటి ప్రతీ అభ్యంతరాన్ని సమర్థ ప్రాధికారి అనగా రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, హుజూరాబాద్ వారికి వ్రాతపూర్వకంగా, వాటి కారణాలను తెలుపుతూ తెలియజేయాలి. అభ్యంతరం తెలిపే వ్యక్తికి స్వయంగా గాని లేదా లీగల్ ప్రాక్టిషనర్ ద్వారా గానీ తెలియజేసే అవకాశాన్ని సమర్థ ప్రాధికారి ఇస్తారు. అటువంటి అన్ని అభ్యంతరాలను విచారించిన తరువాత మరియు ఏదేని తదుపరి విచారణ చేసిన తర్వాత, సమర్థ ప్రాధికారి అవసరమని భావించిన విధంగా, ఉత్తర్వు ద్వారా అభ్యంతరాలను అనుమతించవచ్చు లేదా అనుమతించకపోవచ్చు.

సదరు చట్టంలోని సెక్షన్ 3Cలో సబ్-సెక్షన్ (2) క్రింద సమర్థ ప్రాధికారి చేసిన ఏదేని ఉత్తర్వు తుదిగా ఉంటుంది.

ఈ ప్రకటన క్రింద సేకరించబడే భూమి ప్లాన్స్ మరియు భూమి ఇతర వివరాలు పైన తెలిపిన సమర్థ ప్రాధికారి కార్యాలయంలో లభిస్తాయి మరియు వాటిని ప్రయోజనం గల వ్యక్తి తనిఖీ చేసుకోవచ్చును.

షెడ్యూలు

తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో జాతీయ రహదారి నం.563 (హుజూరాబాద్) నుండి భూమి విస్తరణలో జాతీయ రహదారి 563 పరిధిలోకి వచ్చే కట్టడాలు లేదా కట్టడాలు లేకుండా సేకరించబడే భూమి సంక్షిప్త వివరణ.

రాష్ట్రం: తెలంగాణ జిల్లా: కరీంనగర్

క్ర. సం.	సర్వే/ప్లాట్ నంబరు	భూమి రకం	భూమి స్వభావం	విస్తీర్ణం (స్థానిక యూనిట్‌లో)	విస్తీర్ణం (హెక్టార్లలో)
తాలూకా: హుజూరాబాద్					
గ్రామం: బోర్నపల్లి					
1	82	ప్రభుత్వ	మెట్ట	10,045.0000000 (చ.మీటర్లు)	1.0045000
2	86	ప్రైవేట్	మెట్ట	1,440.0000000(చ.మీటర్లు)	0.1440000
3	87	ప్రైవేట్	మెట్ట	26,880.0000000(చ.మీటర్లు)	2.6880000
4	88	ప్రైవేట్	మెట్ట	7,285.0000000(చ.మీటర్లు)	0.7285000
5	89	ప్రైవేట్	మెట్ట	17,340.0000000(చ.మీటర్లు)	1.7340000
6	90	ప్రైవేట్	మెట్ట	8,940.0000000(చ.మీటర్లు)	0.8940000
7	91	ప్రైవేట్	మెట్ట	120.0000000(చ.మీటర్లు)	0.0120000
8	94	ప్రైవేట్	మెట్ట	150.0000000(చ.మీటర్లు)	0.0150000
9	95	ప్రైవేట్	మెట్ట	11,160.0000000 (చ.మీటర్లు)	1.1160000
గ్రామం: హుజూరాబాద్					
1	296	ప్రైవేట్	మెట్ట	1,440.0000000 (చ.మీటర్లు)	0.1440000
2	308	ప్రైవేట్	మెట్ట	2,580.0000000 (చ.మీటర్లు)	0.2580000
3	1000	ప్రైవేట్	మాగాణి	1,810.0000000 (చ.మీటర్లు)	0.1810000
4	1005	ప్రైవేట్	మాగాణి	600.0000000 (చ.మీటర్లు)	0.0600000
5	1006	ప్రైవేట్	మాగాణి	3,915.0000000 (చ.మీటర్లు)	0.3915000
6	1007	ప్రైవేట్	మాగాణి	2,040.0000000 (చ.మీటర్లు)	0.2040000
7	1189	ప్రైవేట్	మెట్ట	3,780.0000000 (చ.మీటర్లు)	0.3780000
8	1190	ప్రైవేట్	మెట్ట	14,575.0000000 (చ.మీటర్లు)	1.4575000
9	1191	ప్రైవేట్	మెట్ట	7,830.0000000 (చ.మీటర్లు)	0.7830000
10	1194	ప్రైవేట్	మెట్ట	14,245.0000000 (చ.మీటర్లు)	1.4245000
11	1195	ప్రైవేట్	మెట్ట	10,680.0000000 (చ.మీటర్లు)	1.0680000
12	1196	ప్రైవేట్	మెట్ట	9,910.0000000 (చ.మీటర్లు)	0.9910000
13	1198	ప్రైవేట్	మాగాణి	180.0000000 (చ.మీటర్లు)	0.0180000
14	1199	ప్రైవేట్	మాగాణి	15,020.0000000 (చ.మీటర్లు)	1.5020000
15	1200	ప్రైవేట్	మెట్ట	8,935.0000000 (చ.మీటర్లు)	0.8935000
16	1244	ప్రైవేట్	మెట్ట	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
17	1245	ప్రైవేట్	మెట్ట	11,550.0000000 (చ.మీటర్లు)	1.1550000
18	1246	ప్రైవేట్	మెట్ట	7,850.0000000 (చ.మీటర్లు)	0.7850000
19	1247	ప్రైవేట్	మెట్ట	10,000.0000000 (చ.మీటర్లు)	1.0000000
20	1248	ప్రైవేట్	మాగాణి	2,415.0000000 (చ.మీటర్లు)	0.2415000
21	1258	ప్రైవేట్	మాగాణి	5,615.0000000 (చ.మీటర్లు)	0.5615000
22	1317	ప్రైవేట్	మెట్ట	3,025.0000000 (చ.మీటర్లు)	0.3025000
23	1318	ప్రైవేట్	మెట్ట	5,425.0000000 (చ.మీటర్లు)	0.5425000
24	1319	ప్రైవేట్	మెట్ట	430.0000000 (చ.మీటర్లు)	0.0430000
25	1455	ప్రైవేట్	మెట్ట	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
26	1456	ప్రైవేట్	మెట్ట	6,005.0000000 (చ.మీటర్లు)	0.6005000
27	1459	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
28	1472	ప్రైవేట్	మాగాణి	2,310.0000000 (చ.మీటర్లు)	0.2310000
29	1473	ప్రైవేట్	మాగాణి	3,360.0000000 (చ.మీటర్లు)	0.3360000
30	1474	ప్రైవేట్	మాగాణి	5,310.0000000 (చ.మీటర్లు)	0.5310000
31	1475	ప్రైవేట్	మాగాణి	300.0000000 (చ.మీటర్లు)	0.0300000
32	1477	ప్రైవేట్	మాగాణి	5,430.0000000 (చ.మీటర్లు)	0.5430000
33	1570	ప్రైవేట్	మాగాణి	16,055.0000000 (చ.మీటర్లు)	1.6055000
34	1575	ప్రైవేట్	మాగాణి	13,850.0000000 (చ.మీటర్లు)	1.3850000
35	1584	ప్రైవేట్	మాగాణి	3,070.0000000 (చ.మీటర్లు)	0.3070000
36	1590	ప్రైవేట్	మెట్ట	250.0000000 (చ.మీటర్లు)	0.0250000
37	1591	ప్రైవేట్	మెట్ట	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
38	1592	ప్రైవేట్	మెట్ట	12,480.0000000 (చ.మీటర్లు)	1.2480000
39	1593	ప్రైవేట్	మెట్ట	21,960.0000000 (చ.మీటర్లు)	2.1960000
40	1594	ప్రైవేట్	మెట్ట	25,930.0000000 (చ.మీటర్లు)	2.5930000
41	1595	ప్రైవేట్	మెట్ట	10,175.0000000 (చ.మీటర్లు)	1.0175000
42	1596	ప్రైవేట్	మెట్ట	12,540.0000000 (చ.మీటర్లు)	1.2540000
43	1599	ప్రైవేట్	మెట్ట	2,365.0000000 (చ.మీటర్లు)	0.2365000
44	237	ప్రైవేట్	మెట్ట	6,195.0000000 (చ.మీటర్లు)	0.6195000
45	238	ప్రైవేట్	మెట్ట	1,350.0000000 (చ.మీటర్లు)	0.1350000
46	239	ప్రైవేట్	మెట్ట	10,615.0000000 (చ.మీటర్లు)	1.0615000
47	245	ప్రైవేట్	మెట్ట	5,070.0000000 (చ.మీటర్లు)	0.5070000
48	246	ప్రైవేట్	మెట్ట	45,765.0000000 (చ.మీటర్లు)	4.5765000
49	247	ప్రైవేట్	మెట్ట	5,820.0000000 (చ.మీటర్లు)	0.5820000
50	248	ప్రైవేట్	మెట్ట	8,370.0000000 (చ.మీటర్లు)	0.8370000
51	256	ప్రైవేట్	మెట్ట	8,160.0000000 (చ.మీటర్లు)	0.8160000
52	257	ప్రైవేట్	మెట్ట	29,130.0000000 (చ.మీటర్లు)	2.9130000
53	258	ప్రైవేట్	మెట్ట	18,080.0000000 (చ.మీటర్లు)	1.8080000
54	259	ప్రైవేట్	మెట్ట	12,180.0000000 (చ.మీటర్లు)	1.2180000
55	260	ప్రభుత్వ	మెట్ట	23,960.0000000 (చ.మీటర్లు)	2.3960000
56	261	ప్రైవేట్	మెట్ట	7,890.0000000 (చ.మీటర్లు)	0.7890000
57	262	ప్రభుత్వ	మెట్ట	2,070.0000000 (చ.మీటర్లు)	0.2070000
58	266/1	ప్రభుత్వ (అసైన్డ్)	మెట్ట	3,000.0000000 (చ.మీటర్లు)	0.3000000
59	267	ప్రైవేట్	మెట్ట	7,830.0000000 (చ.మీటర్లు)	0.7830000
60	268	ప్రైవేట్	మెట్ట	7,020.0000000 (చ.మీటర్లు)	0.7020000
61	269	ప్రైవేట్	మెట్ట	12,155.0000000 (చ.మీటర్లు)	1.2155000
62	270	ప్రభుత్వ	మెట్ట	9,300.0000000 (చ.మీటర్లు)	0.9300000
63	272	ప్రైవేట్	మెట్ట	6,420.0000000 (చ.మీటర్లు)	0.6420000
64	273	ప్రైవేట్	మెట్ట	2,235.0000000 (చ.మీటర్లు)	0.2235000
65	297	ప్రభుత్వ	మెట్ట	10,020.0000000 (చ.మీటర్లు)	1.0020000
66	298	ప్రైవేట్	మెట్ట	18,260.0000000 (చ.మీటర్లు)	1.8260000
67	300	ప్రైవేట్	మెట్ట	5,600.0000000 (చ.మీటర్లు)	0.5600000
68	306	ప్రైవేట్	మెట్ట	2,035.0000000 (చ.మీటర్లు)	0.2035000
69	307	ప్రైవేట్	మెట్ట	3,455.0000000 (చ.మీటర్లు)	0.3455000
70	309	ప్రైవేట్	మెట్ట	8,845.0000000 (చ.మీటర్లు)	0.8845000
71	319	ప్రైవేట్	మెట్ట	375.0000000 (చ.మీటర్లు)	0.0375000
72	320	ప్రైవేట్	మెట్ట	2,710.0000000 (చ.మీటర్లు)	0.2710000
73	322	ప్రైవేట్	మెట్ట	14,640.0000000 (చ.మీటర్లు)	1.4640000
74	323	ప్రైవేట్	మెట్ట	2,740.0000000 (చ.మీటర్లు)	0.2740000
75	324	ప్రైవేట్	మెట్ట	9,140.0000000 (చ.మీటర్లు)	0.9140000
76	325	ప్రభుత్వ	మెట్ట	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
77	494	ప్రైవేట్	మెట్ట	655.0000000 (చ.మీటర్లు)	0.0655000
78	497	ప్రైవేట్	మెట్ట	15,700.0000000 (చ.మీటర్లు)	1.5700000
79	500	ప్రైవేట్	మెట్ట	610.0000000 (చ.మీటర్లు)	0.0610000
80	503	ప్రభుత్వ (శిఖం)	మెట్ట	11,630.0000000 (చ.మీటర్లు)	1.1630000
81	506	ప్రైవేట్	మెట్ట	2,065.0000000 (చ.మీటర్లు)	0.2065000
82	507	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
83	508	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
84	509	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
85	510	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
86	511	ప్రైవేట్	మాగాణి	3,505.0000000 (చ.మీటర్లు)	0.3505000
87	512	ప్రైవేట్	మాగాణి	7,380.0000000 (చ.మీటర్లు)	0.7380000
88	513	ప్రైవేట్	మాగాణి	2,390.0000000 (చ.మీటర్లు)	0.2390000
89	514	ప్రభుత్వ (శిఖం)	మాగాణి	9,490.0000000 (చ.మీటర్లు)	0.9490000
90	529	ప్రైవేట్	మెట్ట	3,720.0000000 (చ.మీటర్లు)	0.3720000
91	579	ప్రైవేట్	మాగాణి	900.0000000 (చ.మీటర్లు)	0.0900000
92	580	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
93	581	ప్రైవేట్	మాగాణి	2,880.0000000 (చ.మీటర్లు)	0.2880000
94	582	ప్రైవేట్	మాగాణి	445.0000000 (చ.మీటర్లు)	0.0445000
95	583	ప్రైవేట్	మాగాణి	18,210.0000000 (చ.మీటర్లు)	1.8210000
96	584	ప్రైవేట్	మెట్ట	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
97	708	ప్రభుత్వ	మెట్ట	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
98	763	ప్రైవేట్	మాగాణి	300.0000000 (చ.మీటర్లు)	0.0300000
99	765	ప్రైవేట్	మాగాణి	2,535.0000000 (చ.మీటర్లు)	0.2535000
100	766	ప్రైవేట్	మాగాణి	1,065.0000000 (చ.మీటర్లు)	0.1065000
101	768	ప్రైవేట్	మాగాణి	2,455.0000000 (చ.మీటర్లు)	0.2455000
102	773	ప్రైవేట్	మాగాణి	240.0000000 (చ.మీటర్లు)	0.0240000
103	774	ప్రైవేట్	మాగాణి	7,140.0000000 (చ.మీటర్లు)	0.7140000
104	775	ప్రైవేట్	మాగాణి	420.0000000 (చ.మీటర్లు)	0.0420000
105	776	ప్రైవేట్	మాగాణి	240.0000000 (చ.మీటర్లు)	0.0240000
106	804	ప్రైవేట్	మాగాణి	1,170.0000000 (చ.మీటర్లు)	0.1170000
107	805	ప్రైవేట్	మాగాణి	920.0000000 (చ.మీటర్లు)	0.0920000
108	806	ప్రైవేట్	మాగాణి	2,050.0000000 (చ.మీటర్లు)	0.2050000
109	995	ప్రైవేట్	మాగాణి	1,465.0000000 (చ.మీటర్లు)	0.1465000
110	997	ప్రైవేట్	మాగాణి	1,450.0000000 (చ.మీటర్లు)	0.1450000
111	998	ప్రైవేట్	మాగాణి	1,210.0000000 (చ.మీటర్లు)	0.1210000
112	999	ప్రైవేట్	మాగాణి	840.0000000 (చ.మీటర్లు)	0.0840000
113	ఎ	ప్రైవేట్	మెట్ట	4,765.0000000 (చ.మీటర్లు)	0.4765000
114	బి	ప్రైవేట్	మెట్ట	7,835.0000000 (చ.మీటర్లు)	0.7835000
115	సి	ప్రైవేట్	మెట్ట	12,605.0000000 (చ.మీటర్లు)	1.2605000
116	నాలా	ప్రభుత్వ	మాగాణి	2,315.0000000 (చ.మీటర్లు)	0.2315000
117	రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	1,305.0000000 (చ.మీటర్లు)	0.1305000
118	రోడ్డు	ప్రైవేట్	మెట్ట	2,245.0000000 (చ.మీటర్లు)	0.2245000
119	రోడ్డు	ప్రైవేట్	మాగాణి	1,810.0000000 (చ.మీటర్లు)	0.1810000
120	రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	6,550.0000000 (చ.మీటర్లు)	0.6550000
121	రోడ్డు	ప్రభుత్వ	మెట్ట	60.0000000 (చ.మీటర్లు)	0.0060000
గ్రామం: కందుగుల					
1	608	ప్రైవేట్	మెట్ట	1,535.0000000 (చ.మీటర్లు)	0.1535000
2	611	ప్రైవేట్	మెట్ట	180.0000000 (చ.మీటర్లు)	0.0180000
3	612	ప్రైవేట్	మెట్ట	19,955.0000000 (చ.మీటర్లు)	1.9955000
4	613	ప్రైవేట్	మెట్ట	2,905.0000000 (చ.మీటర్లు)	0.2905000
5	634	ప్రైవేట్	మెట్ట	1,840.0000000 (చ.మీటర్లు)	0.1840000
6	635	ప్రైవేట్	మెట్ట	11,070.0000000 (చ.మీటర్లు)	1.1070000
7	636	ప్రైవేట్	మెట్ట	7,600.0000000 (చ.మీటర్లు)	0.7600000
8	637	ప్రైవేట్	మెట్ట	6,155.0000000 (చ.మీటర్లు)	0.6155000
9	638	ప్రైవేట్	మెట్ట	24,720.0000000 (చ.మీటర్లు)	2.4720000
గ్రామం: సింగపూర్					
1	308	ప్రైవేట్	మాగాణి	3,050.0000000 (చ.మీటర్లు)	0.3050000
2	309	ప్రైవేట్	మాగాణి	3,000.0000000 (చ.మీటర్లు)	0.3000000
3	311	ప్రైవేట్	మెట్ట	770.0000000 (చ.మీటర్లు)	0.0770000
4	313	ప్రభుత్వ(అసైన్డ్)	మాగాణి	1,380.0000000 (చ.మీటర్లు)	0.1380000
5	319	ప్రైవేట్	మాగాణి	3,000.0000000 (చ.మీటర్లు)	0.3000000
6	320	ప్రైవేట్	మాగాణి	7,080.0000000 (చ.మీటర్లు)	0.7080000
7	322	ప్రైవేట్	మాగాణి	735.0000000 (చ.మీటర్లు)	0.0735000
8	323	ప్రైవేట్	మాగాణి	225.0000000 (చ.మీటర్లు)	0.0225000
9	324	ప్రైవేట్	మాగాణి	3,115.0000000 (చ.మీటర్లు)	0.3115000
10	325	ప్రైవేట్	మాగాణి	1,980.0000000 (చ.మీటర్లు)	0.1980000
11	326	ప్రైవేట్	మాగాణి	3,025.0000000 (చ.మీటర్లు)	0.3025000
12	327	ప్రైవేట్	మాగాణి	400.0000000 (చ.మీటర్లు)	0.0400000
13	341	ప్రైవేట్	మాగాణి	975.0000000 (చ.మీటర్లు)	0.0975000
14	342	ప్రైవేట్	మాగాణి	4,180.0000000 (చ.మీటర్లు)	0.4180000
15	344	ప్రైవేట్	మాగాణి	6,175.0000000 (చ.మీటర్లు)	0.6175000
16	345	ప్రైవేట్	మాగాణి	1,890.0000000 (చ.మీటర్లు)	0.1890000
17	357	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
18	358	ప్రైవేట్	మాగాణి	2,400.0000000 (చ.మీటర్లు)	0.2400000
19	359	ప్రైవేట్	మాగాణి	2,120.0000000 (చ.మీటర్లు)	0.2120000
20	360	ప్రైవేట్	మాగాణి	1,980.0000000 (చ.మీటర్లు)	0.1980000
21	362	ప్రైవేట్	మాగాణి	120.0000000 (చ.మీటర్లు)	0.0120000
22	363	ప్రైవేట్	మాగాణి	5,605.0000000 (చ.మీటర్లు)	0.5605000
23	364	ప్రభుత్వ(అసైన్డ్)	మాగాణి	180.0000000 (చ.మీటర్లు)	0.0180000
24	365	ప్రైవేట్	మాగాణి	4,945.0000000 (చ.మీటర్లు)	0.4945000
25	366	ప్రైవేట్	మాగాణి	3,535.0000000 (చ.మీటర్లు)	0.3535000
26	367	ప్రైవేట్	మాగాణి	2,490.0000000 (చ.మీటర్లు)	0.2490000
27	368	ప్రైవేట్	మాగాణి	3,330.0000000 (చ.మీటర్లు)	0.3330000
28	369	ప్రైవేట్	మాగాణి	165.0000000 (చ.మీటర్లు)	0.0165000
29	377	ప్రైవేట్	మాగాణి	835.0000000 (చ.మీటర్లు)	0.0835000
30	379	ప్రైవేట్	మాగాణి	2,915.0000000 (చ.మీటర్లు)	0.2915000
31	380	ప్రైవేట్	మాగాణి	5,280.0000000 (చ.మీటర్లు)	0.5280000
32	384	ప్రైవేట్	మాగాణి	3,360.0000000 (చ.మీటర్లు)	0.3360000
33	385	ప్రైవేట్	మాగాణి	1,500.0000000 (చ.మీటర్లు)	0.1500000
34	386	ప్రైవేట్	మెట్ట	7,950.0000000 (చ.మీటర్లు)	0.7950000
35	388	ప్రైవేట్	మెట్ట	2,605.0000000 (చ.మీటర్లు)	0.2605000
36	400	ప్రైవేట్	మెట్ట	3,840.0000000 (చ.మీటర్లు)	0.3840000
37	411	ప్రైవేట్	మెట్ట	858.0000000 (చ.మీటర్లు)	0.0858000
38	412	ప్రభుత్వ	మెట్ట	25,145.0000000 (చ.మీటర్లు)	2.5145000
39	417	ప్రైవేట్	మెట్ట	15,420.0000000 (చ.మీటర్లు)	1.5420000
40	421	ప్రైవేట్	మెట్ట	5,150.0000000 (చ.మీటర్లు)	0.5150000
41	422	ప్రైవేట్	మెట్ట	2,030.0000000 (చ.మీటర్లు)	0.2030000
42	423	ప్రైవేట్	మెట్ట	30,615.0000000 (చ.మీటర్లు)	3.0615000
43	424	ప్రభుత్వ(అసైన్డ్)	మెట్ట	300.0000000 (చ.మీటర్లు)	0.0300000
44	75	ప్రైవేట్	మెట్ట	6,930.0000000 (చ.మీటర్లు)	0.6930000
45	77	ప్రభుత్వ(అసైన్డ్)	మెట్ట	4,730.0000000 (చ.మీటర్లు)	0.4730000
46	78	ప్రైవేట్	మెట్ట	13,490.0000000 (చ.మీటర్లు)	1.3490000
47	79	ప్రైవేట్	మెట్ట	240.0000000 (చ.మీటర్లు)	0.0240000
48	80	ప్రైవేట్	మెట్ట	960.0000000 (చ.మీటర్లు)	0.0960000
49	84	ప్రైవేట్	మెట్ట	2,220.0000000 (చ.మీటర్లు)	0.2220000
50	85	ప్రైవేట్	మెట్ట	2,880.0000000 (చ.మీటర్లు)	0.2880000
51	86	ప్రైవేట్	మెట్ట	8,370.0000000 (చ.మీటర్లు)	0.8370000
52	88	ప్రైవేట్	మెట్ట	10,340.0000000 (చ.మీటర్లు)	1.0340000
53	89	ప్రైవేట్	మెట్ట	5,050.0000000 (చ.మీటర్లు)	0.5050000
54	90	ప్రైవేట్	మెట్ట	1,245.0000000 (చ.మీటర్లు)	0.1245000
55	92	ప్రైవేట్	మెట్ట	2,250.0000000 (చ.మీటర్లు)	0.2250000
గ్రామం: తుమ్మనపల్లి					
1	237	ప్రైవేట్	మెట్ట	26,425.0000000 (చ.మీటర్లు)	2.6425000
తాలూకా: శంకరపట్నం					
గ్రామం: కొత్తగట్టు					
1	237	ప్రైవేట్	మెట్ట	1,170.0000000 (చ.మీటర్లు)	0.1170000
2	238	ప్రైవేట్	మెట్ట	10,335.0000000 (చ.మీటర్లు)	1.0335000
3	239	ప్రైవేట్	మెట్ట	4,140.0000000 (చ.మీటర్లు)	0.4140000
4	240	ప్రభుత్వ	మెట్ట	13,770.0000000 (చ.మీటర్లు)	1.3770000
5	241	ప్రభుత్వ	మెట్ట	2,100.0000000 (చ.మీటర్లు)	0.2100000
			మొత్తం:	1,190,823.0000	119.0823

[F.No.NHAI/PIU-WGL/2018/3A]
రాజేష్ గుప్తా, డిప్యూటీ సెక్రటరీ

కార్పొరేట్లకు లేని కండిషన్లు

రైతులకు ఎందుకు?

- దమ్మొంటే రైతుబంధులా అమలు చేయండి
- కిసాన్ సమ్మాన్ నిధి ఆమోదయోగ్యం కాదు
- టీఎస్‌టీఎస్ చైర్మన్ చిరుమిల్ల రాకేశ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ : కార్పొరేట్లకు లేనన్ని కండిషన్లు కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలులో రైతులకు పెడుతున్నారని తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీస్(టీఎస్‌టీఎస్) చైర్మన్ చిరుమిల్ల రాకేశ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు పథకాన్ని ఆదర్శంగా తీసుకొని కేంద్రం రైతుల కోసం తీసుకువచ్చిన ఈ పథకాన్ని స్వాగతిస్తున్నామని, అయితే రైతులను విభజించి చూడటం సరికాదని పేర్కొన్నారు. దమ్మొంటే తమ సీఎం కేసీఆర్ లాగా కేంద్రం రైతు పెట్టుబడి అమలుచేసి చూపాలని రాకేశ్ సవాల్ విసిరారు. చిన్న రైతు అయినా, పెద్ద రైతు అయినా రైతుల కోణంలో చూడాలే గానీ.. రాజకీయ కోణంలో ఆలోచించవద్దని అన్నారు. కేంద్రం పెట్టిన కండిషన్ల ప్రకారం, దేశవ్యాప్తంగా ఎంతమంది రైతులు లబ్ధిదారులు అవుతారో తేల్చే లెక్కలు వారి వద్ద ఉన్నాయా? అని ప్రశ్నించారు. ఈ పథకంలో రాష్ట్రాలను భాగస్వాములను చేయాలని, రాష్ట్రాలకే ఆ బాధ్యత అప్పగించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు & భవనాల శాఖ, నిజామాబాద్ సర్కిల్, నిజామాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. 31 & 32/2018-19, తేది: 01-02-2019 ప్రకారం నిజామాబాద్ టౌన్‌లో '1' భవనం పని మరియు కామారెడ్డి టౌన్‌లో '1' భవనం పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు టెండరు షెడ్యూళ్ళను ఇ-మార్కెట్‌ప్లేస్ అనగా **https://www.tender.telangana.gov.in**లో **08-02-2019న సా. 4.00గం.** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్లు స్వీకరణకు చివరి తేదీ: **23-02-2019న సా. 4.30 గం.వరకు.** తదుపరి వివరాల కొరకు **https://www.tender.telangana.gov.in** దర్శించండి.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, (R&B) సర్కిల్, నిజామాబాద్
DIPR RO No.2782-DP/CL/Advt/1/2018-19, Dt: 07/2/2019

తెలంగాణ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ, వరంగల్
టెండరు ప్రకటన, తేది: 04-02-2019

NIT నం. 170-172, 174-177, 179-180/SDF/18-19, **1వ పిలుపు,** తేది: 10-10-18 & 193, 199, 200, 201/SDF/18-19, **1వ పిలుపు,** తేది: 04-10-18, 203-208, 210-218, 220, 223, 228, 229/SDF/18-19/ **1వ పిలుపు,** తేది: 20-10-18, 234/SDF/18-19. మహబూబాబాద్, పాలకుర్తి, వర్ధన్నపేట్ నియోజకవర్గాలలో బిటి రోడ్ పనులు (33) చేపట్టుటకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 785.00 లక్షలు. **బిడ్ దాఖలు ప్రారంభ తేదీ:** 11-02-2019న రా.9.00 గం.లు, బిడ్ దాఖలు ముగింపు తేది: 18-02-2019, మ. 3 గం. ఫోన్ నెం. 0870-2578114, తదుపరి వివరాలకు: **https://tender.telangana.gov.in**

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ PR రీజియన్, వరంగల్
DIPR R.O.No.2776-DP/CL/Advt/1/2018-19, Dt:07-02-2019

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మునిసిపల్ ఇంజినీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 70/TUFIDC/Unit-II/MRGD/Outdoor stadium/2019 **తేది: 5-02-2019**
పని పేరు: TUFIDC నుండి సహాయం క్రింద మిర్యాలగూడ మునిసిపాలిటీలోని NSP క్యాంప్ గ్రౌండ్ వద్ద ఔట్‌డోర్ స్టేడియం మరియు వాకింగ్ ట్రాక్ నిర్మాణం-అంచనా కాంట్రాక్టు విలువ: రూ. 79,00,974/-, బిడ్ దాఖలు ముగింపు తేది, సమయం: 13-02-2019న సా. 4.30గం.వరకు. సెల్ నం. 9849905730. తదుపరి వివరాలను www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH) TUFIDC, యూనిట్-II (FAC)
DIPR RO No.2780-DP/CL/Advt/1/2018-19, Dt: 07/2/2019

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ కార్యాలయం, PIU, సూర్యాపేట

No. D3/12&13/2018-19 **సంక్షిప్త టెండరు ప్రకటన** **తేది: 4-02-2019**
పని పేరు: సూర్యాపేట మండలంలోని యెర్కారం నుండి రామారం వరకు రోడ్‌పై CD పని నిర్మాణం & నడిగూడెం గ్రామం, మండలంలో MRO కార్యాలయ భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం- మొత్తం అంచనా విలువ: రూ. 16,70,000/- దరఖాస్తు స్వీకరణకు ఆఖరి తేదీ: 11-2-2019న సా. 5.00గం.వరకు. టెండరు షెడ్యూళ్ళ జారీ: 13-2-2019న సా. 5.00గం.వరకు. టెండర్ల స్వీకరణ తేదీ: 14-2-2019న మ. 3.00గం.వరకు. టెండర్లు తెరుచు తేదీ: 14-2-2019న మ. 3.30గం.కు. తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.

సం/- జిల్లా PR ఇంజినీర్, PIU, సూర్యాపేట
DIPR RO No.2784-DP/CL/Advt/1/2018-19, Dt: 07/2/2019

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ, సత్తుపల్లి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

సత్తుపల్లి (మం) కిష్టారం (గ్రా & గ్రా.పం)లో ప్రైమరీ వెటరినరీ సెంటర్ కొరకు అభివృద్ధి పనులకు G.O.Ms No. 66, I &CAD (Reforms) శాఖ, తేదీ 20-04-2015 ప్రకారముగా గుర్తించబడిన నమోదిత కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ టెండర్లు కోరబడినవి. ECV: రూ. 2.50 లక్షలు. టెండరు నిబంధనలు, SBD మరియు షెడ్యూళ్ళు గురించిన పూర్తి వివరములు 10-02-2019 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.in/login.html. వద్ద లభించును. ఆన్‌లైన్‌లో టెండరు దాఖలుకు చివరి తేది: 18-02-2019.

సం/- కార్యనిర్వాహక ఇంజినీరు, PR డివిజన్, ఖమ్మం
DIPR RO No.2787-DP/CL/Advt/1/2018-19, Dt: 07/2/2019

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ, నల్గొండ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

T.No.02&03/2018-19/S5 **తేది: 5-02-2019**
2018-19 సంవత్సరంలో నల్గొండ డివిజన్ యొక్క మునుగోడు మరియు నల్గొండ రేంజిల ఎల్లపల్లి మరియు తక్కెళ్ళపల్లి, నాంపల్లి, గోనబోయినపల్లి బీట్ల వద్ద వివిధ ప్రదేశాలలో మరిగూడ మండలం మరియు నాంపల్లి-గుండ్లపల్లి మండలముల CA ప్రదేశాల చుట్టూ RCC పోల్స్‌తో చైన్ లింక్ మెష్ ఫెన్సింగ్ స్థాపన కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడినవి. మొత్తం ECV: రూ. 276.01 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ మరియు ముగింపు తేది: 09-02-2019 సా. 4.00గం. నుండి 15-02-2019 మ. 2.00గం. వరకు. టెండరు దాఖలుకు చివరి తేది: 15-02-2019 మ. 3.00గం. సాంకేతిక బిడ్లు తెరుచుట: 15-02-2019 మ. 3.30 గం.లు. ధర బిడ్ తెరుచుట: 15-02-2019, సా. 4.00గం. తదుపరి వివరములను **https://tender. telangana.gov.in** వద్ద పొందవచ్చును.

సం/- ఫారెస్ట్ డివిజినల్ ఆఫీసర్, నల్గొండ
DIPR RO No.2778-DP/CL/Advt/1/2018-19, Dt: 07/2/2019

OFFICE OF THE KAKATIYA URBAN DEVELOPMENT AUTHORITY, WARANGAL

Tender Notice No. D/1211/2018. Dt: 06-02-2019

e-PROC. SHORT TENDER(2nd Call) NOTIFICATION

Tender is invited for the following woks:-

1) Name of the Work	: (2) Works costing **Rs. 2190.00 Lakhs**
2) Bid Document Start Date & Time	: **08-02-2019 at 3.00 P.M.**
3) Bid Documents Submission Last Date & Time	: **21-02-2019 at 4.00 P.M.**

For full details can be viewed at **www.tender.telangana.gov.in** site
Sd/- **VICE-CHAIRMAN,** KUDA, WARANGAL.

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధిశాఖ
పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, సంగారెడ్డి
ఫోన్ : 08455-270180

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నెం. సర్కిల్ 55/2018-19 తేది : 14-09-2018 (SC కమ్యూనిటీకి రిజర్వు చేయబడినది) (రెండవ పిలుపు)

మైనర్ ఇరిగేషన్ - మిషన్ కాకతీయ - IV మెదక్ జిల్లా, మెదక్ డివిజన్ నందు 1(ఒక్క) పని కొరకు తేదీ : 08-02-2019 నుండి 14-02-2019 వరకు బిడ్లను ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ **https://tender.telangana.gov.in** వెబ్‌సైట్ ను 08-02-2019 నుండి చూడగలరు.

సం/- పర్యవేక్షక ఇంజనీరు
నీటిపారుదల సర్కిల్, సంగారెడ్డి

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్
(ప్రభుత్వ సంస్థ)
రిజిస్టర్డ్ ఆఫీస్ : కొత్తగూడెం కాలరీస్- 507 101

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, భారత ప్రభుత్వం యొక్క పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ వారి లేఖ J-13012/88/2008-IA. II(T), తేది: 08.01.2019 నిబంధన నం. 8(V) ప్రకారము సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారు ప్రతిపాదించిన తెలంగాణ, మంచిర్యాల జిల్లా, జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో 2×600 మెగా వాట్ల బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రానికి తేది: 08.01.2019 నాడు కేంద్ర పర్యావరణ మరియు అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, న్యూ ఢిల్లీ నుండి పర్యావరణ సవరణ ఆమోదము లభించినదని ప్రకటించడమైనది. ఈ సవరణ ఆమోద పత్రములోని నిబంధనలననుసరించి ప్రతిపాదిత ప్లాంట్ నుండి విద్యుత్ ఉత్పత్తి చేయుటకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు అనుమతి లభించినది.

ఈ పర్యావరణ సవరణ అనుమతి లేఖ ప్రతులు కేంద్ర పర్యావరణ అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వశాఖ వారి **http://envfor.nic.in** మరియు సింగరేణి కాలరీస్ వారి **http://scclmines.com/env** వెబ్‌సైట్‌లలో కూడా దీనిని పొందుపరచడమైనది.

కొత్తగూడెం,తేది: **07.02.2019** సం/- సంచాలకులు
PR/2018-19/STPP/CTL/111 (ఎలక్ట్రికల్ & మెకానికల్)

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల & ఆయకట్టు అభివృద్ధి శాఖ
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, కాళేశ్వరం ప్రాజెక్ట్ సర్కిల్ నం.1, రామగుండం, పెద్దపల్లి (జిల్లా)

నోటిఫికేషన్ నం. SE/KPC1/RGM/EOI/01 తేది: 06.02.2019

"కాళేశ్వరం ప్రాజెక్ట్-లింక్-I & లింక్-II చుట్టూ కొన్ని వసతులు అభివృద్ధి చేయుట కొరకు సవివరమైన ప్రాజెక్ట్ నివేదిక (DPR) సిద్ధంచేయుట కొరకు కన్సల్టెన్సీ సేవలు ఏర్పాటు" కొరకు ఏజెన్సీలను ఎంపిక చేయుట కొరకు అర్హత గల మరియు క్వాలిఫైడ్ దరఖాస్తుదారులు (సింగిల్ ఎంటిటీ లేదా ఒక JV/కన్సార్టియం) నుండి ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరబడుతోంది.

బిడ్డింగ్ విధానం: పని కొరకు EOI డాక్యుమెంట్ల పూర్తి సెట్‌ను APAO, పెద్దపల్లి పేరున తీసిన INR 5,000/-ల మొత్తం కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ (EOI డాక్యుమెంట్ల రుసుము నిమిత్తం) చెల్లింపుపై పని వేళలో H.No.4-6-423/1, మేడిపల్లి రోడ్డు, జ్యోతినగర్, రామగుండం, పెద్దపల్లి (జిల్లా)-505215 చిరునామా వద్ద **సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, కాళేశ్వరం ప్రాజెక్ట్ సర్కిల్ నం.1, రామగుండం పెద్దపల్లి (జిల్లా)** నుండి పొందవచ్చును.

వివరాలు వెబ్‌సైట్: **www.irrigationtelangana.gov.in** లో లభిస్తాయి.

దరఖాస్తుదారులు తమ "ఆసక్తి వ్యక్తీకరణ"ను రిజిస్టర్డ్ పోస్ట్/ స్పీడ్ పోస్ట్/ స్వయంగా **"Providing consultancy services for preparation of detailed project report (DPR) for developing certain facilities around Kaleshwaram Project - Link-I & Link-II"** అని తగు విధంగా వ్రాస్తూ సీల్డు కవరులో మూడు (03) హార్డ్ కాపీలు (1 ఒరిజినల్ + 2 ఫోటో కాపీలు)లో **22.02.2019న లేదా అలోగా 16.00 గం.ల వరకు** కోరబడిన విధంగా సంబంధిత వివరాలు మరియు మద్దతునిచ్చు డాక్యుమెంట్లతో సహా అథరైజ్డ్ సిగ్నేటరీచే తగు విధంగా ధృవీకరిస్తూ పై చిరునామాకు పంపించవలెను.

సంప్రదించు వివరాలు: **శ్రీ కె.సుధాకర్ రెడ్డి, సూపరింటెండింగ్ ఇంజనీర్, 9100902434,**
శ్రీ ఎస్.సత్యనారాయణ, డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజనీర్, 9100902435.
మెయిల్ **ID: se.kp.rgm@gmail.com**
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్,
కాళేశ్వరం ప్రాజెక్ట్ సర్కిల్ నం.1, రామగుండం, పెద్దపల్లి (జిల్లా)



పార్లమెంటు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకం

బీజేపీ శ్రేణులకు అమిత్‌షా దిశానిర్దేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాబోయే పార్లమెంటు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పనిచేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తంలో భాగంగా అన్నిరాష్ట్రాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో అమిత్‌షా గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ నెల 10న కేంద్ర మంత్రి రవి శంకర్‌ప్రసాద్ హైదరాబాద్ రానున్నారని, పార్టీ ఐటీ విభాగం వారికి మార్గదర్శనం చేస్తారని తెలిపారు. 13న కేంద్రమంత్రి స్మృతీఇరానీ, 14న జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ రాష్ట్రానికి వస్తారని తెలిపారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని తెలంగాణ నేతలు పనిచేయాలని అమిత్‌షా ఆదేశించారు.

హెచ్‌ఐఎస్‌తో భూగర్భ జలాల సమాచారం

- నీటిపారుదల ప్రాంతాల అభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భూగర్భ జలాల సమాచారాన్ని ప్రజలకు అందించేందుకు జలసంబంధ సమాచార వ్యవస్థ (హైడ్రలాజికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం)ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు నీటిపారుదల ప్రాంతాల అభివృద్ధి (ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్) శాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ తెలిపారు. తెలంగాణ నీటిపారుదల ప్రాంతాల అభివృద్ధి, భూగర్భజల శాఖల ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకు, కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ అధికారులతో గురువారం హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఐఎస్‌తో నదీపరివాహక ప్రాంతంలో నీటి వినియోగాన్ని కనుక్కోవచ్చని తెలిపారు. ప్రాంతాల వారీగా ప్రణాళికాబద్ధమైన నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో హైడ్రాలజీ అండ్ ఇన్వెస్టిగేషన్ చీఫ్‌ఇంజినీర్ జీ శంకర్‌నాయక్, భూగర్భజల శాఖ డైరెక్టర్ పండిత్ మధునూర్ పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వ పరిహారం

అమరావతి, నమస్తే తెలంగాణ: రూ.పదివేలలోపు డిపాజిట్లు ఉన్న అగ్రిగోల్డ్ బాధితులకు పరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు రూ.250 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రూ.పదివేలలోపు డిపాజిట్లున్న బాధితులు 3.5 లక్షలమంది ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పర్యవేక్షణలో జిల్లాస్థాయి కమిటీల ద్వారా పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

డాక్టర్‌పై నర్సు యాసిడ్ దాడి

- ప్రేమించి మోసం చేసినందుకు దుశ్చర్య
- స్వల్పగాయాలతో బయటడ్డ వైద్యుడు
- తిరుపతి కోర్టు ప్రాంగణంలో ఘటన

అమరావతి: ఏపీలోని తిరుపతి కోర్టు ప్రాంగణంలో ఓ డాక్టర్‌పై నర్సు యాసిడ్ దాడిచేసింది. అప్రమత్తంగా ఉన్న డాక్టర్ దాడి నుంచి తృటిలో తప్పించుకున్నారు. విడాకుల కేసు నిమిత్తం డాక్టర్ ఆదర్శరెడ్డి గురువారం తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. గతంలో ఆయన వద్ద నర్సుగా పనిచేసిన ఓ మహిళ బురఖాలో వచ్చి యాసిడ్‌తో దాడిచేసింది. దాడి నుంచి ఆదర్శరెడ్డి స్వల్పగాయాలతో తప్పించుకున్నారు. దాడి తర్వాత వెంట తెచ్చుకున్న పురుగులమందు తాగి నర్సు ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు ఆమెను దవాఖానకు తరలించారు. ప్రేమించి మోసంచేసినందుకే దాడిచేశానని నర్సు చెప్పినట్టు తెలిసింది. ప్రస్తుతం తిరుపతిలోని నారాయణాద్రి దవాఖానతో ఆమె నర్సుగా పనిచేస్తున్నది.

పదోన్నతుల సమస్య పరిష్కరించండి

- డీజీపీకి పోలీస్ అధికారుల సంఘం వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సివిల్, ఏఆర్ కన్వర్షన్ కారణంగా ఏర్పడిన సమస్యలతో ఆగిపోయిన పోలీస్ సిబ్బంది పదోన్నతుల ప్రక్రియ వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం కోరింది. డీజీపీని గురువారం ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చినట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై గోపిరెడ్డి తెలిపారు. సివిల్, ఏఆర్, టీఎస్‌ఎస్పీ విభాగాల సిబ్బందికి కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన జీవో 19, 26లకు వ్యతిరేకంగా కొందరు కోర్టు కు వెళ్లడంతో పదోన్నతుల ప్రక్రియ ఏడాదిగా ముందుకు సాగడంలేదని డీజీపీ దృష్టికి తెచ్చినట్టు చెప్పారు. ఈ రెండు కేసుల్లో తీర్పులు త్వరగావచ్చేలా చొరవతీసుకుని పదోన్నతుల సమస్య పరిష్కరించాలని కోరినట్టు తెలిపారు. డీజీపీ సానుకూలంగా స్పందించారని గోపిరెడ్డి పేర్కొన్నారు.

ఎన్నికల ఖర్చుకు జాతీయ నిధిని ఏర్పాటు చేయాలి

- కార్పొరేట్ సంస్థల నుంచి పార్టీల విరాళాల సేకరణను నిషేధించాలి
- మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో ఎన్నికల ఖర్చు నిమిత్తం జాతీయ నిధిని ఏర్పాటు చేయాలని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టీఎస్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. దేశంలోని రాజకీయ పార్టీలు కార్పొరేట్ సంస్థలనుంచి నేరుగా విరాళాలు తీసుకోకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. గురువారం పీటీఐ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల సభ్యుల నుంచి విరాళాలు సేకరించుకునే అవకాశాన్ని ఇచ్చి, మిగతా వారినుంచి విరాళాలు తీసుకోకుండా నిషేధం విధిస్తే బాగుంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలకువచ్చే విరాళాలను మళ్లించి ఎన్నికల నిధి కిందికి జమచేసి ఆయా కార్పొరేట్ సంస్థకు ఆదాయ పన్ను 100 శాతం మినహాయించాలని అభిప్రాయపడ్డారు. దీంతో ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గుతుందని, ఎన్నికల వ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తే పారదర్శకంగా ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్నారు. ఎన్నికల్లో డబ్బు ప్రభావం చూపే ఆనవాయితీకి అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. దీంతో నిజాయితీ గల ప్రజాప్రతినిధులు చట్టసభలకు ఎన్నికవుతారని ఆయన అభిప్రాయపడ్డారు.

ఎస్బీఐ లాకర్ నుంచి బంగారం మాయం

81 తులాల బంగారం కనిపించడంలేదంటూ పోలీసులకు ఫిర్యాదు

మెహిదీపట్నం: దొంగల భయంతో ప్రజలు తమ ఆభరణాలను బ్యాంకు లాకర్లలో దాచుకొంటే.. అక్కడ కూడా రక్షణ లేకుండాపోయింది. బ్యాంకు లాకర్‌లో భద్రపరిచిన నగలు మాయమైన సంఘటన గురువారం మెహిదీపట్నం మల్లేపల్లిలో వెలుగుచూసింది. హుమాయూన్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్‌కు చెందిన మోజంహుస్సేన్, నస్రత్‌అమీనా 2003 నుంచి అమెరికాలో ఉంటున్నారు. వీరికి విజయ్‌నగర్‌కాలనీలోని ఎస్బీఐ న్యూమల్లేపల్లి బ్రాంచ్‌లో జాయింట్ అకౌంట్ ఉన్నది. 2003లో వీరు 81 తులాల బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరిచారు. 2005 వరకు అకౌంట్‌పై లావాదేవీలు కొనసాగాయి. ఇటీవల బంధువుల పెండ్లికి హాజరయ్యేందుకు నగరానికి వచ్చిన మోజంహుస్సేన్ దంపతులు.. నాలుగురోజులక్రితం ఎస్బీఐకి వెళ్లి లాకర్ తెరవడానికి ప్రయత్నించగా సాధ్యపడలేదు. సాంకేతిక నిపుణుల సాయంతో హుమాయూన్‌నగర్ పోలీసుల సమక్షంలో బ్యాంక్ మేనేజర్ లాకర్‌ను తెరిచారు. లాకర్ ఖాళీగా దర్శనం ఇచ్చింది. ఆభరణాలు బ్యాంకు లాకర్ నుంచి మాయం అయ్యాయని వారు ఫిర్యాదుచేశారు.



గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసి గ్రామ పంచాయతీ ఎన్నికల నివేదికను అందజేస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నాగిరెడ్డి



గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దక్షిణమధ్య రైల్వే కొత్త జీఎం గజానన్ మాల్యా



ప్రముఖ పారిశ్రామిక వేత్త, మైహోమ్స్ సిమెంట్స్ అధినేత జూపల్లి జగపతిరావు కూతురు నిశ్చితార్థ వేడుక గురువారం హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో జరిగింది. మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్, పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం.



గురువారం హైదరాబాద్‌లోని కళాభవన్‌లో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతా అవార్డులు ప్రదానం చేసిన రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ కృష్ణ ప్రసాద్, జేటీసీలు పాండురంగనాయక్, రమేశ్ తదితరులు

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలి

రోడ్డు భద్రతా సదస్సులో రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ కృష్ణప్రసాద్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. ప్రతిఒక్కరూ భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని రాష్ట్ర రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ టీ కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కళాభవన్‌లో రవాణాశాఖ, ఆర్టీసీ సంయుక్తంగా నిర్వహించిన రోడ్డు భద్రతా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమవుతున్నదని అన్నారు. ప్రమాదాలు జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని, వాహనదారులు కూడా జాగ్రత్తలు పాటించాలని రవాణాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, టీఎస్‌ఆర్టీసీ ఎండీ సునీల్‌శర్మ అన్నారు. చిన్నచిన్న పొరపాట్లతో కుటుంబాలు ఛిద్రం అవుతాయని చెప్పారు. ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాల రేటను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సిటీ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ పేదల ప్రయాణానికి పేరొందిన సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. పాఠశాల నుంచి కాలేజీస్థాయి వరకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించినట్టు తెలిపారు. పోలీస్‌శాఖలో పనిచేసే డ్రైవర్లకు కూడా ఆర్టీసీలో శిక్షణ పొందేవిధంగా క్యాలెండర్ తయారుచేయాలని అధికారులకు సూచించారు. టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రెవెన్యూ, ఐటీ) పురుషోత్తం మాట్లాడుతూ మానసిక ప్రశాంతతతో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరుగవని తెలిపారు. సుదీర్ఘ ప్రమాద రహిత ఉత్తమ డ్రైవర్లకు తెన్నేటి కృష్ణప్రసాద్, సునీల్‌శర్మ నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో రవాణాశాఖ జేటీసీలు పాండురంగనాయక్, రమేశ్, సంస్థ ఈడీ ఎం రవీందర్ పాల్గొన్నారు.

సీఎం వ్యూహంతో విద్యుత్ వెలుగులు

దేశంలో తలసరి విద్యుత్ వినియోగం 1,122 యూనిట్లు.. తెలంగాణలో 1,727 యూనిట్లు

- ఎంత డిమాండ్ ఉన్నా తట్టుకోగలం
- సరఫరాలో నష్టాన్ని తగ్గిస్తున్నాం
- జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అధ్వాన్నస్థితిలో ఉన్న విద్యుత్‌రంగంలో సీఎం కేసీఆర్ తనదైన వ్యూహంతో పురోభివృద్ధి సాధించారని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు అన్నారు. సీఎం కేసీఆర్ ఆలోచనల వల్లనే వ్యవసాయరంగానికి 24 గంటల ఉచితవిద్యుత్ సాధ్యమైందన్నారు. రానున్న వానకాలం, యాసంగి పంటలకు ఎంత డిమాండ్ ఉన్నా విద్యుత్ సరఫరాచేస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీపీఆర్‌ఐ) ఆధ్వర్యంలో.. హైఓల్టేజ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. తాను ఇంజినీర్, బ్యూరోక్రాట్ కాకపోయినప్పటికీ తనపై నమ్మకంతో మాత్రమే ఈ బాధ్యత అప్పగించారని, దానిని పూర్తిస్థాయిలో నెరవేర్చానని పేర్కొన్నారు. సీపీఆర్‌ఐ పరీక్షలకే పరిమితం కాకుండా సేవలు విస్తరించాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఎంతటి విద్యుత్ డిమాండ్‌నైనా ఎదుర్కొనే సత్తా తెలంగాణకు ఉన్నదని స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా తలసరి విద్యుత్ వినియోగం 1,122 యూనిట్లు ఉంటే.. తెలంగాణలో 1,727యూనిట్లుగా ఉన్నదని వెల్లడించారు. త్వరలో భద్రాద్రి పవర్‌ప్లాంటును అందుబాటులోకి తెస్తామని, రాష్ట్రం ఏర్పడకముందు 71 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్‌ప్లాంట్లు ఉంటే ప్రస్తుతం 3,600 మెగావాట్ల సామర్థ్యం సాధించామన్నారు. తెలంగాణలో నాలుగున్నరేండ్ల కిందట 14వేల మెగావోల్ట్‌యాప్ (ఎంవీఏ) సామర్థ్యం ఉంటే ఇప్పుడు 27వేలకు పెరిగిందని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 765 కేవీ వార్ధా-నిజామాబాద్ కారిడార్ పనులు పూర్తయ్యాయని, సీఎం కేసీఆర్ దగ్గరుండి పనులను పరిశీలించడం వల్లే నిర్ణీత వ్యవధిలో పూర్తయిందన్నారు. ఈ సదస్సులో సీపీఆర్‌ఐ డైరెక్టర్ జనరల్ వీఎస్ నందకుమార్ మాట్లాడుతూ.. విద్యుత్ రంగం అభివృద్ధితోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని .. కొత్త విద్యుత్‌చట్టంతో పలు ప్రైవేటు సంస్థలు ఈ రంగంలోకి అడుగుపెట్టాయని వివరించారు. 2012లో జాతీయ గ్రిడ్ ఏర్పాటయ్యిందని, దేశవ్యాప్తంగా 400/800 కేవీలైన్లకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి, ధ్రువీకరస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఆర్‌ఐ ఏడీలు ఎన్ వాసుదేవ్, ప్రదీప్, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. సీఆర్‌పీఐ జాతీయ సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు.



గురువారం బేగంపేటలో హైఓల్టేజ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అంతర్జాతీయ సదస్సుసావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డీజీ నందకుమార్, ప్రదీప్ నిర్గాడి, వాసుదేవ్

విద్యుత్ దార్శనికుడు సీడీ ఆవిష్కరణ

తెలంగాణ విద్యుత్ సంస్థలకు నాయకత్వం వహిస్తున్న టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు విద్యుత్‌రంగంలోకి అడుగుపెట్టి యాభై వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా 'విద్యుత్ దార్శనికుడు' పేరుతో ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ సీడీని విద్యుత్‌సౌధలో ప్రభాకర్‌రావుతో ఆవిష్కరింపజేశారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య, ఉపాధ్యక్షుడు నాజర్ షరీఫ్, ఫైనాన్స్ సెక్రటరీ అనిల్, సంఘం సభ్యులు వీరస్వామి, పరమేశ్, ఆంజనేయులు, పాటల రచయిత మానుకోట సందీప్, ప్రసాద్ పాల్గొన్నారు.

శివరాంపల్లి పనులు 10లోపు పూర్తిచేయాలి

హైదరాబాద్ శివారులోని శివరాంపల్లిలో జరగుతున్న 220 కేవీ హెచ్‌టీఎల్‌ఎస్ (హై టెంపరేచర్ లోసాగ్) పనులను ఈ నెల పదోతేదీలోగా పూర్తిచేయాలని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు అధికారులకు సూచించారు. గురువారం విస్తరణ పనులను ఆకస్మికంగా తనిఖీచేశారు. నగరంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ తీర్చడానికి రూ.వందకోట్ల పెట్టుబడితో హెచ్‌టీఎస్‌ఎస్ పనులను టీఎస్‌ట్రాన్స్‌కో చేపట్టిందని.. 400కేవీ మామిడిపల్లి, 220కేవీ శివరాంపల్లి, 220కేవీ శాపూర్‌నగర్, 400కేవీ మల్కారం, 220కేవీ గచ్చిబౌలి, 400కేవీ శంకర్‌పల్లి ఇందులో ఉన్నాయన్నారు. ఈ తనిఖీల్లో ప్రభాకర్‌రావుతో పాటు టీఎస్‌ట్రాన్స్‌కో డైరెక్టర్లు టీ జగత్‌రెడ్డి, జే సూర్యప్రకాశ్, సీఈ వివేకానంద, ఎస్‌ఈ రామరాజు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు విద్యుత్ అందించాలి

బంజారాహిల్స్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌శాఖ ఉద్యోగులు, ఇంజనీర్లు సిద్ధంకావాలని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం ఎర్రమంజిల్‌లోని విద్యుత్‌సౌధలో 'తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్' డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన త ర్వాత రాష్ట్ర ముఖచిత్రం మారుతుందన్నా రు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజనీర్స్ అ సోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, వెల్ఫేర్‌సెక్రటరీ రవికుమార్, నాయకులు అనిల్, నరేశ్, వినయ్, ప్రణీతర, శ్రావ్య, లతావినోద్, వివేకానంద పాల్గొన్నారు.



గురువారం సచివాలయంలో 'ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ డిస్ప్యూట్స్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శైలేంద్రకుమార్ జోషి

కెన్యాలో టీఆర్‌ఎస్‌శాఖ ప్రారంభం

- విదేశాల్లో పార్టీ శాఖలు 37కు చేరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కెన్యా దేశంలో టీఆర్‌ఎస్‌శాఖను ప్రారంభించారు. గురువారం స్కైప్ ద్వారా ఎన్నారైశాఖ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ప్రారంభించి అడ్‌హాక్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెన్యాశాఖ ఏర్పాటుతో విదేశాల్లో టీఆర్‌ఎస్ పార్టీ శాఖలు 37కు చేరుకున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లోగా 40 శాఖలు, లోక్‌సభ ఎన్నికల్లోగా 50 శాఖల వరకు విస్తరిస్తామని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ఎన్నారై సలహాదారు, ఎంపీ కవితతో చర్చించి పూర్తిస్థాయి కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా కల్యాణ్‌కుమార్ కొత్త, రవీందర్‌రెడ్డి ముస్కుల, శివకుమార్ మిట్టపల్లి, నరేందర్‌రెడ్డి గంట్ల, స్వప్నారెడ్డి, రాజేశ్‌రెడ్డి చీమర్ల, ప్రశాంతిరెడ్డి, క్రాంతి పాలపాటి ఎన్నికయ్యారు.

డబ్బుల కోసమే మందకృష్ణ విశ్వరూప సభ

- బాబుతో జతకట్టి ఇప్పుడు తిట్టడమేమిటి?
- వర్గీకరణ బిల్లుపై 14న సదస్సు: డాక్టర్ పిడమర్తి రవి



సోమాజిగూడలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ నేత పిడమర్తి రవి. చిత్రంలో వివిధ దళిత సంఘాల నేతలు

ఖైరతాబాద్: ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నుంచి డబ్బులు వసూళ్లు చేసేందుకే మంద కృష్ణమాదిగ విశ్వరూప సభ పెడుతున్నారని డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబు ద్రోహం చేశారంటూ ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 19న విశ్వరూప సభ పెడుతున్నట్టు కృష్ణమాదిగ ప్రకటించడంపై రవి మండిపడ్డారు. నిన్నటివరకు బాబు సంకన పట్టుకొని తిరిగి, ఇప్పుడు ఆయనను తిట్టడం ఏం పద్ధతి అని నిలదీశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో పిడమర్తి మాట్లాడుతూ రెండునెలల క్రితం వరకు చంద్రబాబు, కూటమితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించిన మందకృష్ణ ఇప్పుడు బాబు ద్రోహం చేశారంటూ కొత్తస్వరం వినిపిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర చరిత్రలో అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, ఆయన చొరవతోనే కేంద్రంలో కూడా బిల్లు నెగ్గుతుందని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి బాసటగా వర్గీకరణ కోసం అన్ని సంఘాలను కలుపుకొని పోతామన్నారు. వర్గీకరణ బిల్లుపై ఈ నెల 14న సదస్సు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు, వివిధ దళిత సంఘాల నాయకులు యాతాకుల భాస్కర్, మైస ఉపేందర్, మాదిగ జేఏసీ హైదరాబాద్ ఇంచార్జి మంద సురేశ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో వర్గీకరణ బిల్లు అంశాన్ని మ్యానిఫెస్టోలో పొందుపరిచే వారికే మద్దతు పలుకుతామన్నారు.

31 జిల్లాలకు కాంగ్రెస్ అధ్యక్షులు

డీసీసీ అధ్యక్షులతో సరిపెట్టిన పీసీసీ

జిల్లా కమిటీల విషయం తేల్చని అధిష్ఠానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర కాంగ్రెస్ చాలాకాలం తర్వాత ఎట్టకేలకు జిల్లా పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం 31 జిల్లాలకు చెందిన అధ్యక్షుల పేర్లను పీసీసీ ఒక ప్రకటనలో విడుదల చేసింది. పట్టణ పార్టీ అధ్యక్షులను కూడా ప్రకటించింది. ఖమ్మం సిటీ అధ్యక్షుడిగా జావెద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దీపక్‌చౌదరి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా అంజన్‌కుమార్ యాదవ్‌లను నియమించింది. కమిటీల కూర్పుపై అధిష్ఠానం ఏవిషయం వెల్లడించకపోవడంతో పార్టీలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరే..

ఆదిలాబాద్- భార్గవ దేశ్‌పాండే, మంచిర్యాల- కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, నిర్మల్- రామారావుపటేల్ పవార్, కుమ్రంభీం ఆసిఫాబాద్- ఆత్రం సక్కు, కరీంనగర్- మృత్యుంజయం, జగిత్యాల- లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి- ఎర్ల కొంరయ్య, రాజన్న సిరిసిల్ల- సత్యనారాయణగౌడ్, నిజామాబాద్- మనాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్ సిటీ- కేష వేణు, కామారెడ్డి- కైలాస శ్రీనివాసరావు, వరంగల్ అర్బన్ అండ్ రూరల్- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ సిటీ- కేదరి శ్రీనివాసరావు, జయశంకర్ భూపాలపల్లి- గండ్ర జ్యోతి, జనగామ- జంగా రాఘవరెడి, సంగారెడ్డి- నిర్మల గౌడ్, మెదక్- తిరుపతిరెడ్డి, సిద్దిపేట- టీ నర్సారెడ్డి, వికారాబాద్- రోహిత్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి- కూన శ్రీశైలంగౌడ్, రంగారెడ్డి- చల్లా నర్సింహారెడ్డి, మహబూబ్‌నగర్- ఒబేదుల్లా కొత్వాల్, వనపర్తి- శంకర్‌ప్రసాద్, జోగుళాంబ గద్వాల- పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్- సీహెచ్ వంశీకృష్ణ, సూర్యాపేట- వెంకన్న యాదవ్, యాదాద్రి భువనగిరి- భిక్షమయ్యగౌడ్, మహబూబాబాద్- భరత్‌చంద్రారెడ్డి, నల్లగొండ- శంకర్‌నాయక్, భద్రాద్రి కొత్తగూడెం- వనమా వెంకటేశ్వరరావు, ఖమ్మం- పువ్వాడ దుర్గాప్రసాద్.

ఖనిజాలు ప్రగతికి ఆయువుపట్టు

- భూగర్భ విజ్ఞానశాస్త్రంపై అవగాహన పెరుగాలి
- జీఎస్‌ఐ శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతదేశ ప్రగతికి ఖనిజాలు ఆయువుపట్టని, భూగర్భ విజ్ఞాన శాస్త్రంపై మరింత అవగాహన పెరుగాల్సిన అవసరమున్నదని భూ విజ్ఞాన సర్వేక్షణ (జీఎస్‌ఐ) శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. జీఎస్‌ఐ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ గురించి గురువారం కవాడిగూడలోని పీఐబీలో మీడియాకు వివరించారు. తమ శిక్షణ సంస్థ ద్వారా శాస్త్రవేత్తలకు భూగర్భ విషయ పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని, పరిశోధనలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 32 వేలమంది లబ్ధిపొందినట్టు పేర్కొన్నారు. నాగపూర్, కోల్‌కతా, లక్నో, జైపూర్, షిల్లాంగ్ ప్రాంతాల్లో అనుబంధ శిక్షణ సంస్థలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 62 దేశాలకు చెందిన 433 మంది శిక్షణ పొందారన్నారు. 'భూసంవాద్' కార్యక్రమం ద్వారా 2500 మంది వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ టీవీకే రెడ్డి మాట్లాడుతూ మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఖనిజాలు ఊతమిస్తాయని అన్నారు. కార్యక్రమంలో జీఎస్‌ఐ డైరెక్టర్ డాక్టర్ తారక్‌నాథపాల్ పాల్గొన్నారు.

వారిలో చాలా ప్రతిభ ఉంది

గిల్, పృథ్వీ షాలపై సచిన్ ప్రశంస

ముంబై: యువ క్రికెటర్లు పృథ్వీ షా, శుభ్‌మన్ గిల్‌పై భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఇద్దరు యువ క్రికెటర్లు వయసు ఇంకా 19 ఏండ్లేనని వారిని ఆటను ఆస్వాదించనివ్వాలని గురువారం మీడియాతో మాట్లాడుతూ సచిన్ సూచించాడు. పృథ్వీ షా వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో రాణించి జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపికైనా గాయంతో షా వెనుదిరిగి వచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు న్యూజిలాండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌కు జట్టులోకి ఎంపికైన శుభ్‌మన్ గిల్ ఎంపికైనా ఆకట్టుకోలేకపోయాడు. 9,7 పరుగులతో ఆఖరి రెండు వన్డేల్లో గిల్ విఫలం కావడంతో అతనిపై విమర్శల వర్షం కురుస్తుండగా సచిన్ బాసటగా నిలిచాడు. 'పృథ్వీ షా ఆటతీరు గురించి గతంలోనే చెప్పాను. 8-9 ఏండ్ల వయసులో ప్రాక్టీస్‌లో ఆడుతున్న తీరు చూసి అతను భారత జట్టుకు ఆడుతాడని అనిపించింది. శుభ్‌మన్ గిల్ కూడా అండర్-19 ప్రపంచకప్‌లో షాతో సమానంగా ప్రతిభ చూపాడు. ఇద్దరిలోనూ అపార ప్రతిభ ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లోకి కొత్తగా అడుగుపెట్టిన వీరిద్దరినీ కొంతకాలం ఆటను ఆస్వాదించనివ్వాలి' అని సచిన్ అన్నాడు.





గెలిచి.. నిలుస్తారా!

నేడు కివీస్‌తో భారత మహిళల రెండో టీ20

మిథాలీరాజ్‌కు అవకాశం ▪ జోరుమీదున్న ఆతిథ్య జట్టు


మందన

ఆక్లాండ్: పురుషుల జట్టు తరహాలోనే పయనిస్తున్న భారత మహిళల క్రికెట్ టీమ్ కూడా న్యూజిలాండ్ గడ్డపై శుక్రవారం జరిగే రెండో టీ20 పోరుకు సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో బలమైన స్థితిలో ఉండి కూడా పేకమేడలా కూలిన బ్యాటింగ్ లైనప్‌ను పటిష్ఠం చేయడంపై మేనేజ్‌మెంట్ దృష్టిసారించింది. ఇందులో భాగంగా తొలి మ్యాచ్‌లో పక్కనబెట్టిన వన్డే కెప్టెన్, సీనియర్ మిథాలీ రాజ్‌ను జట్టులోకి తీసుకున్నది. దీంతో అనుభవంతో కివీస్‌ను దెబ్బకొట్టాలని ప్రణాళికలు వేస్తున్నది. మిథాలీ స్థానంలో అరంగేట్రం చేసిన ప్రియా పూనియా అనుకున్న స్థాయిలో ఆడకపోవడం నిరాశ కలిగిస్తున్నది. మందనతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించినా ఐదు బంతులకే పెవిలియన్‌కు చేరింది. మరో యువ బ్యాట్స్‌వుమెన్ హేమలత కూడా నాలుగో నంబర్‌కు సరిపోవడం లేదు. ఓపెనింగ్‌లో మందన మెరుస్తున్నా.. టాప్ ఆర్డర్‌లో మిగతా ముగ్గురు సరైన సహకారం ఇవ్వడం లేదు. అయితే ఇప్పుడు మిథాలీ రాకతో బ్యాటింగ్ లైనప్ కాస్త బలం పుంజుకున్నది. 2020 ప్రపంచకప్ సన్నాహాల్లో ఉన్న టీమ్ మేనేజ్‌మెంట్.. యువ బ్యాట్స్‌వుమెన్స్‌కు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని భావిస్తున్నది. కానీ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో అందరూ విఫలమవుతుండటంతో సీనియర్లపై దృష్టిపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో టీ20లో ఓడితే సిరీస్ గల్లంతయ్యే ప్రమాదం ఉండటంతో కచ్చితంగా గెలిచేందుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతున్నది.

మరోవైపు ఫైనల్ వన్డే, తొలి టీ20లో భారత్‌ను ఓడించిన కివీస్ మంచి జోరు మీద కనిపిస్తున్నది. తొలి మ్యాచ్‌లో మెరిసిన మందనపై ఎక్కువగా దృష్టిపెట్టింది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా ఆమెను కట్టడి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఆల్‌రౌండర్లతో పటిష్ఠంగా కనిపిస్తున్న కివీస్ ఈ మ్యాచ్‌తోనే సిరీస్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. పేసర్ లీ తహుహుతో భారత్‌కు ఎక్కువగా ప్రమాదం పొంచి ఉంది. బ్యాటింగ్‌లో సోఫీ డివైన్ మెరిస్తే టీమ్‌ఇండియాకు కష్టాలు తప్పవు.

చానూకు స్వర్ణం



న్యూఢిల్లీ: వెన్ను నొప్పి నుంచి కోలుకున్న భారత స్టార్ లిఫ్టర్ మీరాబాయ్ చానూ ఘనంగా పునరాగమనం చేసింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈగాట్ కప్‌లో స్వర్ణంతో మెరిసింది. గురువారం జరిగిన మహిళల 49 కేజీల విభాగంలో చానూ 192 (స్నాచ్ 82+ క్లీన్ అండ్ జర్క్ 110) కేజీల బరువు ఎత్తి తొలి స్థానంలో నిలిచింది. ఒలింపిక్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌గా భావించే ఈ టోర్నీలో సాధించే పాయింట్లు టోక్యో ఒలింపిక్స్‌కు పనికొస్తాయి. 'గాయం నుంచి కోలుకున్న తర్వాత ఇది నా తొలి టోర్నీ. నేను వంద శాతం ఫిట్‌గా ఉన్నా. కాకపోతే ఇది ఉత్తమ ఫలితం మాత్రం కాదు. నా వ్యక్తిగత బెస్ట్ కంటే నాలుగు కేజీలు తక్కువగా ఎత్తాను. ఇప్పటికైతే ఈ ప్రదర్శనపై సంతృప్తిగానే ఉన్నా. 194 కేజీల బరువును లేపి 2017లో వరల్డ్ చాంపియన్‌షిప్ గెలిచా' అని చానూ వెల్లడించింది. గతేడాదిలో దాదాపు తొమ్మిది నెలలు ఆటకు దూరంగా ఉన్న చానూ అత్యుత్తమ ఫిజియోథెరపీ సాయంతో నొప్పి నుంచి గట్టెక్కింది. ఈ ఈవెంట్‌లో జపాన్‌కు చెందిన హిరోమి (183 కేజీ) రజతం, పపువా న్యూగినియా లిఫ్టర్ డికా టోవా (179 కేజీ)కు కాంస్యం లభించాయి.

ఫెడ్ కప్‌లో భారత్ విజయం

అస్తానా(కజకిస్థాన్): సింగిల్స్‌తోపాటు డబుల్స్‌లోనూ అంకిత రైనా విజయం సాధించడంతో ఫెడ్ కప్‌లో భారత మహిళల జట్టు ఉత్కంఠ విజయం సాధించింది. బలహీనమైన థాయిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 2-1 తేడాతో గెలిచి ఊపిరిపీల్చుకుంది. తొలి సింగిల్స్‌లో కర్మన్‌కౌర్ తాండి 2-6,6-3,3-6 స్కోరుతో థాయిలాండ్ అమ్మాయి నుదిండా లువాన్‌గ్నమ్ చేతిలో అనూహ్యంగా ఓడింది. కర్మన్ కౌర్ ప్రపంచ మహిళల ర్యాంకింగ్స్‌లో 211వ స్థానంలో ఉండగా.. లువాన్‌గ్నమ్ 712వ స్థానంలో కొనసాగడం గమనార్హం. దీంతో భారత నంబర్‌వన్ ప్లేయర్ అంకితా రైనాను రెండో సింగిల్స్ బరిలోకి దింపింది. అనుకున్నట్లుగానే అంకితా రైనా 6-7 (3),6-2, 6-4 స్కోరుతో థాయిలాండ్ టెన్నిస్ ప్లేయర్ పీన్‌టార్న్ లిపుయెచ్‌ను ఓడించింది. కీలకమైన డబుల్స్‌లో అంకితా, కర్మన్‌కౌర్ చివరి వరకు పోరాడి 6-4,6-7(6), 7-5 స్కోరుతో థాయిలాండ్ డబుల్స్ జోడీని ఓడించారు. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం ఆతిథ్య జట్టు కజకిస్థాన్‌తో భారత మహిళల జట్టు తలపడనుంది.

గేల్ వచ్చాడు..



గ్రాస్ ఐలెట్: ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు విండీస్ డాషింగ్ హిట్టర్ క్రిస్ గేల్‌కు మళ్లీ పిలుపు అందింది. ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా అతన్ని మళ్లీ జట్టులోకి తీసుకున్నారు. గతేడాది జూలైలో బంగ్లాదేశ్‌పై చివరి వన్డే ఆడిన 39 ఏండ్ల గేల్.. భారత్, బంగ్లాదేశ్‌లో జరిగిన సిరీస్‌లకు దూరంగా ఉన్నాడు. మొత్తానికి చాలాకాలం తర్వాత గేల్‌ను తీసుకున్న విండీస్.. ఐదు వన్డేల సిరీస్‌కు 14 మందితో జట్టును ప్రకటించింది. ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మన్ నికోలస్ పూరన్‌కు అవకాశం ఇచ్చారు. ఈ నెల 25 నుంచి మార్చి 2 వరకు ఈ సిరీస్ జరుగనుంది. 'మా వరల్డ్‌కప్ సన్నాహాలు కొనసాగుతూనే ఉంటాయి. టాప్ ర్యాంక్ జట్టుతో మేం తలపడుతున్నాం. కాబట్టి బలమైన జట్టును బరిలోకి దించాలనుకుంటున్నాం. జట్టుగా మేం కుదురుకోవడానికి ఇదో మంచి అవకాశం' అని విండీస్ సెలెక్షన్ కమిటీ చైర్మన్ కోర్ట్నీ బ్రౌన్ తెలిపారు.

జట్టు: హోల్డర్ (కెప్టెన్), అలెన్, బిషూ, డారెన్ బ్రావో, గేల్, హెట్మెయర్, హోప్, లూయిస్, నర్స్, పాల్, పూరన్, పావెల్, రోచ్, థామస్.

లెక్క సరిచేస్తారా?

నేడు న్యూజిలాండ్‌తో భారత్ రెండో టీ20 ▪ గిల్, కౌల్‌కు అవకాశం దక్కేనా! ▪ సిరీస్‌పై దృష్టిపెట్టిన కివీస్


రోహిత్ శర్మ

2-7 టీ20ల్లో న్యూజిలాండ్, భారత్ ముఖాముఖి రికార్డు. ఏడు మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియా ఓడగా, ఇందులో కివీస్‌పై గడ్డపై మూడున్నాయి.

ఓ ఓటమి.. తర్వాత పుంజుకోవడం.. కొన్నిసార్లు తిరుగులేని ఆధిపత్యం.. మరికొన్నిసార్లు దారుణమైన ప్రదర్శన.. విదేశీ గడ్డపై దీనిని ఓ అలవాటుగా కొనసాగిస్తున్న భారత్ జట్టు.. పొట్టి ఫార్మాట్‌లో మరో రసవత్తర పోరుకు సిద్ధమైంది. సిరీస్‌లో నిలువాలంటే కచ్చితంగా గెలువాల్సిన స్థితిలో నేడు న్యూజిలాండ్‌తో రెండో టీ20 మ్యాచ్ ఆడనుంది. రిజర్వ్ బెంచ్‌కు అవకాశాలు.. బ్యాటింగ్ లైనప్‌లో ప్రయోగాలతో.. తొలి మ్యాచ్‌లో 8 మంది బ్యాట్స్‌మెన్‌తో బరిలోకి దిగి.. 80 పరుగుల తేడాతో ఓడిన టీమ్‌ఇండియా.. ఘనమైన ప్రదర్శనతో లెక్క సరిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

ఆక్లాండ్: ఫేవరెట్‌గా బరిలోకి దిగి ఊహించని పరాజయంతో డీలాపడిన భారత్ జట్టు... ఇప్పుడు రెండో టీ20 మ్యాచ్‌పై దృష్టిపెట్టింది. శుక్రవారం ఈడెన్ పార్క్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి లెక్క సరి చేయాలని భావిస్తున్నది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 0-1తో వెనుకబడ్డ టీమ్ ఇండియా.. ఈ మ్యాచ్‌లో కొత్త కుర్రాళ్లకు అవకాశం ఇస్తుందా? లేక సిరీస్ గెలుపే లక్ష్యంగా సీనియర్లతో బరిలోకి దిగుతుందా? అన్నది తేలాల్సి ఉంది. తొలి మ్యాచ్‌లో ఒకరిద్దరు కుర్రాళ్లకు అవకాశం ఇచ్చినా వాళ్లు దానిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఫలితంగా టీ20 చరిత్రలోనే పరుగుల పరంగా రోహిత్‌సేన అతిపెద్ద ఓటమిని మూటగట్టుకుంది. మరోవైపు జోరుమీదున్న ఆతిథ్య జట్టు ఈ మ్యాచ్‌తోనే సిరీస్‌ను సాధించి వన్డేల్లో ఎదురైన పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది.

కూర్పు ఎలా?

కీలకమైన మ్యాచ్ కావడంతో తుది జట్టులో మార్పులు చేయాలని టీమ్‌ఇండియా భావిస్తున్నా.. ఎవరెవరికి చోటు దక్కుతుందనేది తేలాల్సి ఉంది. తొలి టీ20లో ప్రధాన పేసర్ భువనేశ్వర్‌తో సహా అందరూ ఓవర్‌కు 12 పరుగులు ఇవ్వడంతో ఇప్పుడు బౌలింగ్‌పై మేనేజ్‌మెంట్ ఎక్కువగా దృష్టిపెట్టింది. ఖలీల్ అహ్మద్ విఫలంకావడంతో.. అందుబాటులో ఉన్న సిరాజ్, సిద్ధార్థ్ కౌల్‌లలో ఒకరికి అవకాశం ఇవ్వాలని యోచిస్తున్నది. మిడిల్ ఓవర్లలో చాహల్, క్రునాల్ చేసిన పోరాటం సరిపోలేదు. దీంతో మణికట్టు మాంత్రికుడు కుల్దీప్‌ను తుది జట్టులో సర్దుబాటు చేయాలని భావిస్తున్నారు. ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా రెండు విభాగాల్లో విఫలంకావడం ఆందోళన కలిగించే అంశం. టాప్ ఆర్డర్‌లో రోహిత్ విఫలమైతే ఆ ప్రభావం జట్టు మొత్తంపై పడుతున్నది. ధవన్ ఉన్నంతసేపు భారీ షాట్లు కొడుతున్నా.. పెద్ద స్కోర్లు చేయలేకపోతున్నాడు. ఈ ఇద్దరు ఇచ్చే శుభారంభంపైనే లక్ష్యాన్ని నిర్ణయించడం లేదా ఛేదించడం ఆధారపడి ఉంటుంది. ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌ను మూడోస్థానానికి ప్రమోట్ చేసినా అవకాశం వృథా చేసుకున్నాడు. కాబట్టి అతని స్థానంలో శుభ్‌మన్ గిల్‌ను తీసుకోవచ్చు. రిషబ్, కార్తీక్‌పై భారీగా అంచనాలున్నాయి. కనీసం ఈ మ్యాచ్‌లోనైనా విలువైన ఇన్నింగ్స్‌తో వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కించుకుంటారో లేదో చూడాలి. చివర్లో ధోనీ మెరుపులు మెరిపిస్తేనే ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా విజయాన్ని ఆశించొచ్చు. వీటన్నింటి కంటే ప్రధానమైనది ఫీల్డింగ్. కార్తీక్ క్యాచ్‌లు వదిలేయడంతోనే తొలి మ్యాచ్‌లో కివీస్ భారీ స్కోరుకు బాటలు వేసుకుంది.


ధోనీ కుల్దీప్

మార్పుల్లేవు..!

మరోవైపు న్యూజిలాండ్ గెలిచిన ఉత్సాహంతో ఉంది. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఈ మ్యాచ్‌కు సిద్ధమవుతున్నది కాబట్టి భారత్ అప్రమత్తంగా ఉండాల్సిందే. ముఖ్యంగా సీఫెర్ట్‌ను అడ్డుకోకుంటే భారీ స్కోరును సమర్పించుకోవాల్సిందే. మున్రో, విలియమ్సన్ కూడా చెలరేగితే టీమ్‌ఇండియాకు కష్టాలు తప్పవు. మిడిలార్డర్‌కు టేలర్ ఆయువుపట్టుగా మారాడు. లోయర్ ఆర్డర్ సహకారంతో మంచి భాగస్వామ్యాలు నెలకొల్పడం కలిసొచ్చే అంశం. ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్‌ను తీసుకుంటే గ్రాండ్‌హోమీ లేదా నీషమ్‌కు అవకాశం దక్కొచ్చు. లోయర్ ఆర్డర్‌లో సాంట్నర్, కుగ్గెలిన్ విలువైన పరుగులు జోడించడం అనుకూలాంశం. బౌలింగ్‌లో సౌతీ మరోసారి తన విలువను చాటుకున్నాడు. తొలి టీ20లో ఒకే ఓవర్‌లో మూడు వికెట్లు తీయడంతో భారత్ కోలుకోలేకపోయింది. సోధీ, ఫెర్గుసన్ వికెట్లు తీయకపోయినా.. పరుగులు నిరోధించడం కలిసొచ్చే అంశం. మెరుపు ఫీల్డింగ్, సూపర్ క్యాచ్‌లు కివీస్ ప్రదర్శనను మరో మెట్టుకు తీసుకెళ్తున్నాయి.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధవన్, గిల్ / శంకర్, రిషబ్, కార్తీక్, ధోనీ, హార్దిక్, క్రునాల్ / కుల్దీప్, భువనేశ్వర్, ఖలీల్ / సిరాజ్, చాహల్.

న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), సీఫెర్ట్, మున్రో, టేలర్, మిచెల్, నీషమ్ / గ్రాండ్‌హోమీ, సాంట్నర్, కుగ్గెలిన్, సౌతీ, సోధీ, ఫెర్గుసన్.

పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలం. గతేడాది ఆసీస్ 244 పరుగుల లక్ష్యాన్ని 7 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. మరో మ్యాచ్‌లో కివీస్ 144 పరుగులను 10 ఓవర్లలోనే రాబట్టింది. వర్షం ముప్పు లేదు.

రంజీ చాంప్ విదర్భ


ఆరు వికెట్లతో రాణించిన ఆదిత్య సర్వాటే ▪ ఫైనల్లో సౌరాష్ట్రపై ఉత్కంఠ విజయం ▪ మరోసారి రన్నరప్ స్థానంతో సౌరాష్ట్ర సరి



నాగ్‌పూర్: రంజీ చాంపియన్‌గా నిలువాలన్న సౌరాష్ట్ర కల మరోసారి చెదిరింది. గతంలో రెండుసార్లు (2012-13,2015-16)ఫైనల్ చేరినా ముంబై చేతిలో ఓడిపోయింది. మళ్లీ తాజాగా ఈ సీజన్‌లో అద్భుత ఆటతీరుతో ఫైనల్ చేరినా.. డిఫెండింగ్ చాంపియన్ విదర్భ చేతిలో పరాజయంతో రన్నరప్ స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేసిన సౌరాష్ట్ర జట్టు 127 పరుగులకే ఆలౌటై 78 పరుగుల తేడాతో ఓడింది. విదర్భ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆదిత్య సర్వాటె రెండో ఇన్నింగ్స్‌లో (6/59) చెలరేగి జట్టుకు ఘన విజయాన్నందించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టిన సర్వాటే మొత్తంగా 11 వికెట్లు తీసి కెరీర్‌లో తొలిసారిగా 10 వికెట్ల ఘనత సాధించాడు. అంతేకాదు రెండో ఇన్నింగ్స్‌లో 49 పరుగులు చేసి విదర్భ జట్టు స్కోరు 200 చేరడంలో అతనిదే కీలకపాత్ర. ఫైనల్లో పుజారా (1,0) రెండు ఇన్నింగ్స్‌ల్లో విఫలం కావడం, విదర్భ టెయిలెండర్లను పరుగులు చేయకుండా నిరోధించడంలో సౌరాష్ట్ర విఫలం కావడంతో గెలుపు దక్కలేదు. అన్ని రంగాల్లో అద్భుతంగా రాణించిన విదర్భ జట్టు వరుసగా రెండోఏడాది రంజీ చాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో తొలిసారి టైటిల్ గెలువడం అదృష్టం కాదని ఆటతీరుతోనే దేశవాళీ ట్రోఫీని దక్కించుకున్నామని నిరూపించింది. గురువారం చివరిరోజు విజయం కోసం విదర్భ జట్టు సెషన్ పాటు వేచిచూడాల్సి వచ్చింది. సౌరాష్ట్ర విజయానికి 148 పరుగులు అవసరం కాగా విదర్భ విజయానికి 5 వికెట్లు అవసరమైన దశలో ఇరుజట్లూ తీవ్ర ఒత్తిడితో బరిలోకి దిగాయి. 5 వికెట్ల నష్టానికి 58 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో సౌరాష్ట్ర జట్టు చివరిరోజు బ్యాటింగ్‌కు దిగింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ విశ్వరాజ్ (52), కమలేశ్ మక్వానా(14) ఇద్దరూ తొలి గంట విదర్భ బౌలర్లను నిలువరించారు. వీరి భాగస్వామ్యం విడిపోయిన అనంతరం సౌరాష్ట్ర వికెట్లు వెంటవెంటనే పడిపోయాయి. ఆరోవికెట్‌కు 33 వీరిద్దరూ కలిసి 33 పరుగులు జోడించారు. అనంతరం మన్కడ్ (2)ను వఖారె ఔట్ చేయగా.. సౌరాష్ట్ర కెప్టెన్ ఉనద్కత్, అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న విశ్వజిత్‌తోపాటు ధర్మేంద్ర సింగ్ జడేజాను సర్వాటే పెవిలియన్‌కు పంపాడు.భారత స్టార్ పేసర్ ఉమేశ్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఫైనల్ ఆసాంతం సర్వాటే అద్భుతంగా రాణించాడు. మూడోరోజుకే పిచ్‌పై పగుళ్లు వచ్చి బ్యాటింగ్ చేయడం కష్టంగా మారిన సమయంలో జట్టును ఆదుకున్నాడు. కోచ్ చంద్రకాంత్ పండిట్ సలహాను పాటించి రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఫాంలో ఉన్న చటేశ్వర్ పుజారను ఔట్ చేశాడు. ఆల్‌రౌండ్ ప్రతిభతో అదరగొట్టిన సర్వాటే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ఈ విజయంతో రంజీ చరిత్రలో టైటిల్ నిలబెట్టుకున్న ఆరోజట్టుగా విదర్భ జట్టు అరుదైన జాబితాలో చేరింది. గతంలో ముంబై, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఢిల్లీ మాత్రమే టైటిల్ నిలబెట్టుకోగా తాజాగా విదర్భ జట్టుకూడా ఈ జట్ల సరసన చోటు దక్కించుకుంది.

> కెరీర్‌లో మొత్తం పది రంజీ ఫైనల్స్ ఆడాను (ముంబై జట్టు తరపున ఎనిమిది). విదర్భ జట్టుకు ఆడి రెండు టైటిళ్లు అందుకుంటానని ఎప్పుడూ అనుకోలేదు.
> **-వసీం జాఫర్**

> గతేడాది మేం విజయం సాధించిన సమయంలో అంతా అదృష్టం అన్నారు. దీంతో టైటిల్ నిలబెట్టుకునేందుకు తీవ్రమైన ఒత్తిడిలో బరిలోకి దిగాం. ఎలాంటి గొప్పలకు పోకుండా మేం ఆటపైనే దృష్టి పెట్టడంతో టైటిల్ నిలబెట్టుకున్నాం
> **- చంద్రకాంత్ పండిట్, విదర్భ కోచ్**



స్టార్క్ ఔట్

భారత్ పర్యటనకు ఆసీస్ జట్టు ఎంపిక

మెల్‌బోర్న్: చాతీ కండర గాయంతో పేస్ బౌలర్ మిచెల్ స్టార్క్.. భారత్ పర్యటనకు దూరమయ్యాడు. ఈనెల 24 నుంచి మొదలయ్యే ఈ టూర్ కోసం 16 మందితో కూడిన జట్టును ఆసీస్ సెలెక్టర్లు గురువారం ప్రకటించారు. మూడు రోజుల కిందట శ్రీలంకతో జరిగిన రెండో టెస్ట్ సందర్భంగా స్టార్క్‌కు గాయమైంది. దీనివల్ల చాతీ కండరం, భుజం నొప్పితో బాధపడుతున్నారు. పేసర్ సిడెల్, స్టాన్‌లేక్, ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్‌కు జట్టులో చోటు దక్కలేదు. వెన్ను నొప్పితో ఇబ్బందిపడుతున్న పేసర్ జోష్ హాజిల్‌వుడ్ కూడా ఇంకా కోలుకోలేదు. కెప్టెన్‌గా ఫించ్‌ను కొనసాగించారు. ఇరుజట్ల మధ్య ఈ నెల 24 (విశాఖపట్నం), 27 (బెంగళూరు)న రెండు టీ20లు, మార్చి 2 (హైదరాబాద్), 5 (నాగ్‌పూర్), 8 (రాంచీ), 10 (మొహాలీ), 13 (ఢిల్లీ)లో ఐదు వన్డేలు జరుగుతాయి. మరోవైపు మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ మోచేతికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. దీంతో ఇతనితోపాటు వార్నర్ కూడా ప్రపంచకప్ జట్టు రేసులో ఉన్నారని కోచ్ లాంగర్ సంకేతాలిచ్చాడు.

జట్టు: ఫించ్ (కెప్టెన్), కమిన్స్, క్యారీ, బెహ్రెన్‌డార్ఫ్, కోల్టర్‌నీల్, హ్యాండ్స్‌కోంబ్, ఖవాజ, లైయన్, షాన్ మార్ష్, మ్యాక్స్‌వెల్, రిచర్డ్‌సన్, కేన్ రిచర్డ్‌సన్, షార్ట్, స్టోయినిస్, టర్నర్, జంపా.

సెన్సెక్స్	నిఫ్టీ
36,971	11,069
↓4	↑7

ముడి చమురు (బ్రెంట్) ↓ 61.00 డాలర్లు

బంగారం ధరలు

న్యూఢిల్లీ(రూ.లలో)

24 క్యారెట్లు	34,180
22 క్యారెట్లు	34,030
వెండి (కిలో)	41,500

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	68.70	75.20
యూరో	78.20	86.20
బహ్రెయిన్ దినార్	182.60	194.60
కువైట్ దినార్	226.60	239.60
సౌదీ రియాల్	18.10	19.90
యూఏఈ దిర్హామ్	18.50	20.10

చికెన్ ధరలు (రూ.లలో)

ఫారం ధర	72.00
రిటైల్ లైవ్	94.00
డ్రెస్డ్	136.00
స్కిన్‌లెస్	155.00

నెక్ (వంద గుడ్లకు) (రూ.లలో)

హైదరాబాద్	409-00
రంగారెడ్డి	409-00
మెదక్	409-00
కరీంనగర్	411-00
వరంగల్	411-00
రిటైల్ ప్రైస్	4-70



ముంబైలోని ఆర్బీఐ ప్రధాన కార్యాలయంలో గురువారం ద్రవ్యసమీక్షకు వచ్చిన ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ (మధ్యలో), డిప్యూటీ గవర్నర్లు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

వడ్డీరేట్లను తగ్గించిన ఆర్బీఐ ▪ ఏడాదిన్నర తర్వాత మళ్లీ కోతలు

పావు శాతం దిగొచ్చిన రెపో, రివర్స్ రెపో ▪ చౌకవనున్న ఆటో, గృహ రుణాలు

అందర్నీ ఆశ్చర్యపరుస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించింది. 18 నెలల తర్వాత మళ్లీ ఆర్బీఐ కోతలకు దిగడం.. అదికూడా కొత్త గవర్నర్ శక్తికాంత దాస్ రాక నేపథ్యంలో చోటుచేసుకోవడం ప్రాధాన్యంను సంతరించుకున్నది. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరుగనున్న వేళ ఏడాదిన్నర తర్వాత ఆర్బీఐ వైఖరిలో మార్పు రావడం గమనార్హం. ఆర్బీఐ గవర్నర్‌గా ఉర్జిత్ పటేల్ అనూహ్య రాజీనామాతో దాస్ చేతికి సెంట్రల్ బ్యాంక్ పగ్గాలను కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు అప్పగించిన విషయం తెలిసిందే.

ముంబై, ఫిబ్రవరి 7: ఎవరూ ఊహించనివిధంగా రెపో, రివర్స్ రెపో రేట్లను 25 బేసిస్ పాయింట్ల చొప్పున ఆర్బీఐ తగ్గించింది. మూడు రోజులపాటు ఇక్కడ జరిగిన ఈ ఆర్థిక సంవత్సరపు (2018-19) ఆరో, చివరి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష గురువారం ముగిసింది. ఇందులో రెపో రేటు (ఆర్బీఐ నుంచి వాణిజ్య బ్యాంకులు తీసుకునే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు)ను 6.50 శాతం నుంచి 6.25 శాతానికి, రివర్స్ రెపో రేటు (బ్యాంకుల నుంచి ఆర్బీఐ పొందే నగదుపై చెల్లించే వడ్డీరేటు)ను 6.25 శాతం నుంచి 6 శాతానికి దించుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఆటో, గృహ తదితర రుణాలు చౌక కానున్నాయి. సాధారణ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఆర్థిక వ్యవస్థను ద్రవ్యకొరత, వ్యాపార, పారిశ్రామిక రంగాలను నిధుల లేమి వేధిస్తుండటంతో తల పట్టుకున్న కేంద్రానికి ఏరికోరి తెచ్చుకున్న దాస్ ఈ ద్రవ్యసమీక్షతో కాస్త ఊరటనే కల్పించారు. ఇటీవలి మధ్యంతర బడ్జెట్‌లో చిన్న, సన్నకారు రైతులకు రూ.75,000 కోట్ల నగదు సాయాన్ని మోదీ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే. మధ్యతరగతికి ఆదాయం పన్ను (ఐటీ) రిబేటునూ అందించిన సంగతీ విదితమే. ఈ క్రమంలో ఆర్బీఐ వడ్డీరేట్ల కోత.. వ్యవస్థలో కొత్త ఉత్సాహాన్ని నింపగలదన్న అంచనాలు ప్రభుత్వ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. కాగా, ఆరుగురు సభ్యులున్న ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ)లో వడ్డీరేట్ల కోతకు 4:2 మద్దతు లభించింది. దాస్‌సహా నలుగురు సమర్థించగా, ఇద్దరు వ్యతిరేకించారు. రిటైల్, హోల్‌సేల్ ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టడం.. ఆర్బీఐకి వడ్డీరేట్ల కోతకున్న అవకాశాలను మెరుగుపరిచింది. ఇదిలావుంటే ఈ నెలాఖరులోగా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) కోసం ఓ నూతన మార్గదర్శకాలను విడుదల చేస్తామని ఆర్బీఐ చెప్పింది. అలాగే ఇప్పటికే ఉన్న రుణాలను తీర్చడం కోసం విదేశీ వాణిజ్య రుణాల (ఈసీబీ) ద్వారా ఆయా సంస్థలు నిధులను సమీకరించుకునేలా అవకాశాన్ని కల్పించాలని కూడా ఆర్బీఐ యోచిస్తున్నది.

వడ్డీరేట్లను ఇంకా తగ్గిస్తాం:దాస్

వడ్డీరేట్లను ఇంకా తగ్గిస్తామని ఆర్బీఐ గవర్నర్ దాస్ చెప్పారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడితే రాబోయే ద్రవ్యసమీక్షల్లో రెపో రేటు మరింత దిగివస్తుందన్న భరోసాను కల్పించారు. గతేడాది మే నెలలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా రిటైరై డిసెంబర్‌లో ఆర్బీఐ గవర్నర్ బాధ్యతల్లోకి వచ్చిన దాస్.. తాజా ద్రవ్యసమీక్షలో అనూహ్యంగా కీలక వడ్డీరేట్లను పావు శాతం తగ్గించి అన్ని వర్గాలను ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో అవకాశం ఉంటే కోతలకు కొదవే ఉండదంటూ ద్రవ్యసమీక్ష అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ సంకేతాలిచ్చారు. ఇకపోతే వ్యవస్థలో ద్రవ్యకొరతకు ఆస్కారం లేకుండా చేస్తామని, ఏ రంగానికి నిధుల లేమీ సమస్య రాకుండా చూస్తామని ఈ సందర్భంగా దాస్ హామీనిచ్చారు. ఎప్పటికప్పుడు నగదు లభ్యత, ద్రవ్య పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలిపారు. కాగా, మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)పై ఉక్కుపాదం మోపుతూ గతేడాది ఫిబ్రవరి 12న ఆర్బీఐ జారీ చేసిన నిబంధనల్లో ఎలాంటి మార్పూ ఉండదని దాస్ స్పష్టం చేశారు. రుణాల చెల్లింపుల్లో ఒక్కరోజు ఆలస్యమైనా ఎన్‌పీఏగా గుర్తించాలన్న ఈ నిబంధనలపై బ్యాంకర్లు పునరాలోచించాలని ఆర్బీఐకి విజ్ఞప్తి చేస్తున్న విషయం తెలిసిందే.

మధ్యంతర డివిడెండ్ ప్రభుత్వ హక్కు

ఆర్బీఐ నుంచి మధ్యంతర డివిడెండ్‌ను పొందడం ప్రభుత్వ హక్కు అని దాస్ స్పష్టం చేశారు. ప్రతికూల ఆర్థిక పరిస్థితుల మధ్య సమీపిస్తున్న ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న కేంద్రం.. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ సంస్థల నుంచి డివిడెండ్ల రూపంలో నిధులను ఆశిస్తుండగా, ఆర్బీఐ నుంచీ మధ్యంతర డివిడెండ్‌ను కోరుతున్నది. దీంతో ఆర్బీఐ చట్టం ప్రకారం మధ్యంతర డివిడెండ్‌ను ఆర్బీఐ వినియోగించుకోవచ్చని దాస్ తెలిపారు. కాగా, రూ.28,000 కోట్ల మధ్యంతర డివిడెండ్ రావచ్చని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19 జూలై-జూన్)గాను ఆర్బీఐ నుంచి కేంద్రం మధ్యంతర డివిడెండ్‌కు విజ్ఞప్తి చేస్తున్న విషయం తెలిసిందే. ఆర్బీఐ తర్వాతి బోర్డు సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. ఈ నెల 9న జరుగాల్సిన ఈ భేటీ.. 18కి వాయిదా పడిన సంగతి విదితమే.

ముఖ్యాంశాలు

- పావు శాతం తగ్గి 6.25 శాతానికి రెపో రేటు
- 6 శాతం వద్ద రివర్స్ రెపో
- 6.5 శాతంగా బ్యాంక్ రేటు
- 4 శాతంగా నగదు నిల్వల నిష్పత్తి యథాతథం
- 2019-20 ప్రథమార్ధంలో 3.2-3.4 శాతంగా ద్రవ్యోల్బణం
- వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు 7.4 శాతం
- తాకట్టు లేని వ్యవసాయ రుణాల పరిమితి రూ.లక్ష నుంచి 1.6 లక్షలకు పెంపు
- కార్పొరేట్ రుణ మార్కెట్‌లో పెట్టుబడులపై ఎఫ్‌పీఐలకున్న ఆంక్షలు తొలగింపు
- రూపాయి విలువ స్థిరత్వానికి అంతర్జాతీయ మార్కెట్‌లోని రూపీ మార్కెట్‌పై టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- ఏప్రిల్ 2-4 తేదీల్లో తదుపరి ద్రవ్యసమీక్ష

ద్రవ్యోల్బణ అంచనా కుదింపు



ఈ ఏడాది చివరి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 2.8 శాతంగా ఉంటుందని ఆర్బీఐ అంచనావేస్తున్నది. దేశ ఆర్థిక పరిస్థితులు ఆమోదయోగ్య స్థాయిలో ఉండటం, వాతావరణ పరిస్థితులు ఆశాజనకంగా ఉండటం వల్లనే ద్రవ్యోల్బణ అంచనాను తగ్గించడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను చివరి రిజర్వు పరపతి సమీక్షను గురువారం సెంట్రల్ బ్యాంక్ విడుదల చేసింది. ఏప్రిల్ నుంచి అమలులోకి రానున్న వచ్చే ఏడాది తొలి ఆరు నెలల్లో మాత్రం ద్రవ్యోల్బణం 3.2-3.4 శాతం మధ్యలో ఉంటుందని తెలిపింది. ఇదే ఏడాది మూడో త్రైమాసికంలో 3.9 శాతానికి ఎగబాకనున్నది. ఆహార ద్రవ్యోల్బణం మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయని, ముఖ్యంగా చిరుధాన్యాలు, సరఫరా వ్యవస్థ మెరుగుపడుతుండటంతో పలు ఆహార పదార్థాలు మరింత చౌకగా లభిస్తుండటం ఇందుకు ప్రధాన కారణమని విశ్లేషించింది. స్వల్పకాలంపాటు ఆహార ద్రవ్యోల్బణం తీవ్ర ఆటుపోటులకు గురికానున్నప్పటికీ దీర్ఘకాలికంగా మాత్రం పెద్దగా ప్రభావం చూపవని పేర్కొంది.

రైతన్నకు ఆర్బీఐ కానుక

తాకట్టు లేని వ్యవసాయ రుణాల పరిమితి రూ.1.60 లక్షలకు పెంపు



తాకట్టు లేని వ్యవసాయ రుణాల పరిమితిని రూ.1.60 లక్షలకు పెంచింది ఆర్బీఐ. ప్రస్తుతం లక్ష రూపాయల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రైతులు వ్యవసాయ రుణాలను పొందవచ్చు. అయితే దీన్ని మరో రూ.60,000 పెంచుతూ తాజా ద్రవ్యసమీక్షలో రిజర్వ్ బ్యాంక్ నిర్ణయం తీసుకున్నది. చిన్న, సన్నకారు రైతులకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా మారనున్నది. 2010 తర్వాత ఈ రుణాల పరిమితి పెరుగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా, తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం 'రైతుబంధు' తరహాలో చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ.6,000 పంట పెట్టుబడి ఇస్తామని ఇటీవలి మధ్యంతర బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్బీఐ తాజా నిర్ణయం దేశీయ రైతాంగానికి మరింత ఆర్థిక భరోసాను కల్పించినట్లైంది. వ్యవసాయ రుణాల సమీక్షకు ఓ ఇంటర్నల్ వర్కింగ్ గ్రూప్‌నూ ఏర్పాటు చేయాలని ఆర్బీఐ ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నది.

వృద్ధికి ఊతం: గోయల్



రెపో రేటును తగ్గించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఆర్బీఐ ఊతమిచ్చిందని, ఇక చిన్న వ్యాపారులకు, గృహ కొనుగోలుదారులకు రుణాలు చౌక కానున్నాయని తాజా ఆర్బీఐ ద్రవ్యసమీక్షపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆనందం వ్యక్తం చేశారు. మరిన్ని రంగాలకూ ఈ నిర్ణయం లాభించి ఉద్యోగావకాశాలు పెరుగగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. '6.5 శాతంగా ఉన్న రెపో రేటును 6.25 శాతానికి ఆర్బీఐ తగ్గించడాన్ని స్వాగతిస్తున్నాం. దీనివల్ల బ్యాం కుల రుణాలపై వడ్డీరేట్లు తగ్గేందుకు ఆస్కారమున్నది. ఇది చిన్న వ్యాపారులు, గృహ కొనుగోలుదారులకు లాభం' అని గురువారం ట్విట్టర్‌లో గోయల్ స్పందించారు.

వచ్చే ఏడాది వృద్ధి 7.4 శాతం



వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు 7.4 శాతంగా ఉంటుందని రిజర్వు బ్యాంక్ అంచనావేస్తున్నది. కేంద్ర గణాంకాల శాఖ అంచనావేసిన 7.2 శాతం కంటే ఇది అధికం. బ్యాంకుల వృద్ధిరేటు, కమర్షియల్ రంగంలో ఆర్థిక పరిస్థితులు, అంతర్జాతీయంగా నెలకొన్న మందకొడి పరిస్థితులు దేశీయ వృద్ధిరేటును ప్రభావితం చేయనున్నాయని పరపతి సమీక్ష సందర్భంగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. డిసెంబర్‌లో జరిగిన సమీక్షలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4 శాతంగా ఉంటుందని అంచనావేసిన సెంట్రల్ బ్యాంక్..వచ్చే ఏడాది తొలి అర్ధ భాగంలో 7.5 శాతంగా ఉంటుందని పేర్కొంది. చమురు అధిక దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌పై ఒకవేళ ఇంధన ధరలు భగ్గుమంటే వృద్ధికి వచ్చిన ఢోకా లేదని, డాలర్‌తో పోలిస్తే రూపాయి క్షీణత, గ్లోబల్‌గా డిమాండ్ అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ఈ ప్రభావం అంతంతేనని పేర్కొంది. ముఖ్యంగా అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం ప్రభావంతో గ్లోబల్ వృద్ధికి బీటలు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

ఎవరేమన్నారు?..

ఆర్బీఐ నిర్ణయం భేష్. ప్రస్తుత పరిస్థితుల్లో సరైన విధానాన్ని రిజర్వ్ బ్యాంక్ ప్రకటించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లపై ఉన్న ఆంక్షల్ని తొలగించడాన్నీ స్వాగతిస్తున్నాం
-సుభాష్ చంద్ర గార్గ్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి

అంతర్జాతీయంగా ఎగుమతిదారులు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించేలా ఆర్బీఐ చొరవ తీసుకుంటే ఆర్థిక ఇబ్బందుల్ని అధిగమించవచ్చు
-రవీ సెహగల్, ఈఈపీసీ ఇండియా చైర్మన్

మున్ముందు వడ్డీరేట్లు మరింత తగ్గేందుకు అవకాశాలున్నాయి. ద్రవ్యోల్బణం ఆర్బీఐ నిర్ణీత స్థాయి కంటే దిగువనే ఉన్నందున రాబోయే సమీక్షల్లో వడ్డీరేట్ల కోతకు వీలున్నది
-రజనీశ్ కుమార్, ఎస్‌బీఐ చైర్మన్

ఈ సమీక్షలో రెపో రేటు తగ్గింపును ఊహించలేకపోయాం. ఈ క్రమంలో ఏప్రిల్‌లో జరిగే ద్రవ్యసమీక్షలో మరో పావు శాతం తగ్గవచ్చని భావిస్తున్నాం
-రాధికా రావు, డీబీఎస్ గ్రూప్ రిసెర్చ్

రెపో రేటు తగ్గింపు నిస్తేజంగా ఉన్న వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో నూతనోత్సాహాన్ని నింపింది. బ్యాంకులు కూడా రుణాలపై వడ్డీరేట్లను తగ్గించి ప్రయోజనాన్ని అందించాలి
-రాకేశ్ భారతీ మిట్టల్, సీఐఐ అధ్యక్షుడు

ఆర్బీఐ నిర్ణయంతో హౌజింగ్ డిమాండ్ పెరుగొచ్చు. అయితే ఎన్‌బీఎఫ్‌సీ, హౌజింగ్ ఫైనాన్స్ సంస్థల్లో ద్రవ్యలభ్యత పెరుగుదలకు ఆర్బీఐ మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉన్నది
-జక్సే షా, క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు

రాబోయే ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లు మరింతగా తగ్గాలి. బలమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి, మందగించిన వృద్ధిరేటు పురోగతికి ఆమోదయోగ్యమైన వడ్డీరేట్లు అవసరం
-సందీప్ సోమని, ఫిక్కీ అధ్యక్షుడు

గృహ నిర్మాణ రంగంలో అమ్మకాలు తిరిగి పుంజుకుంటాయని ఆశిస్తున్నాం. ద్రవ్యకొరతను ఎదుర్కొంటున్న రియల్ ఎస్టేట్ పరిశ్రమకు ఆర్బీఐ కొత్త ఊపిరిలూదింది.
-నిరంజన్ హీరానందని, నరెడ్కో అధ్యక్షుడు

వడ్డీరేట్ల తగ్గింపు ఆహ్వానించదగ్గ పరిణామం. ఈ ప్రయోజనాన్ని పరిశ్రమకు బ్యాంకులు అందించాలి. మధ్య, భారీతరహా సంస్థల రుణాల విషయంలో ఆర్బీఐ కనికరించాలి
-బాలకృష్ణన్ గోయెంకా, అసోచాం అధ్యక్షుడు

వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని బ్యాంకులు కొనుగోలుదారులకు బదిలీ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. అప్పుడే ఇండ్ల కొనుగోళ్లు పెరుగుతాయి.
- గుమ్మి రాంరెడ్డి, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు

'చట్టం చూసుకుంటుంది'



ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్ వ్యవహారాన్ని చట్టం చూసుకుంటుందని ఆర్బీఐ గవర్నర్ దాస్ అన్నారు. ఈ అంశంపై తొలిసారి స్పందించిన ఆయన చట్టం తన పని తాను చేసుకుంటూపోతుందని వ్యాఖ్యానించారు. అవినీతి ఆరోపణలపై కొచ్చర్‌ను బ్యాంక్ తొలగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో దర్యాప్తు కొనసాగుతున్నదని, దర్యాప్తు సంస్థలే ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తాయన్నారు.

బల్క్ డిపాజిట్ల పరిమితి పెంపు

బ్యాంకుల వద్ద బల్క్ డిపాజిట్లపై ఉన్న కోటి రూపాయల పరిమితిని రూ.2 కోట్లకు పెంచుతున్నట్లు రిజర్వు బ్యాంక్ ప్రకటించింది. నిధుల సేకరణకు సంబంధించిన బ్యాంకులకు మరింత స్వేచ్ఛ నివ్వాలనే ఉద్దేశంతో ఈ పరిమితిని పెంచినట్లు తెలిపింది. జనవరి 2013లో బల్క్ డిపాజిట్లపై పరిమితులు విధించిన ఆర్బీఐ..మళ్లీ ఐదేండ్ల తర్వాత సవరించినట్లు అయింది. అలాగే అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకులను ఒక్కతాటిపైకి తేవాలనే ఉద్దేశంతో త్వరలో ఒక ఆర్గనైజేషన్‌కు శ్రీకారం చుట్టబోతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్, క్రెడిట్ సొసైటీస్ లిమిటెడ్‌కు స్వస్తి పలుకబోతున్నది.

ఈఎంఐ ఎంత తగ్గేను..



వడ్డీరేట్లను పావు శాతం తగ్గిస్తున్నట్లు రిజర్వు బ్యాంక్ తీసుకున్న కీలక నిర్ణయంతో గృహ, వాహన, వ్యక్తిగత, ఇతర రుణాలను తీసుకున్న వారికి భారీ ఊరట లభించనున్నది. ముఖ్యంగా గృహ రుణాలు తీసుకున్నవారికి ఈఎంఐల భారం నుంచి కాస్త ఉపశమనం లభించనున్నది. రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ ఈ ప్రయోజనాన్ని బ్యాంకులు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు(ఎంసీఎల్ఆర్) రూపంలో తగ్గించాల్సి ఉంటుంది. గడిచిన ఏడాదిగా వడ్డీరేట్లను అరశాతం వరకు పెంచడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రుణ గ్రహీతలకు ఆర్బీఐ నూతన గవర్నర్ శక్తికాంత దాస్ శుభవార్తను అందించారు. దీంతో వారి నెలవారి చెల్లింపుల కలిగే ప్రయోజనాలు ఎలా ఉంటాయో పరిశీలిద్దాం. ఉదాహరణకు పదేండ్ల కాలపరిమితి కలిగిన రూ.25 లక్షల గృహ రుణం తీసుకున్న వారు ప్రస్తుతం 9.55 శాతం సరాసరిగా వడ్డీరేటును చెల్లిస్తున్నారనుకో. అంటే నెలకు ఈఎంఐల రూపంలో రూ.33,715 చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు వడ్డీరేటును పావు శాతం తగ్గిస్తే రుణరేటు 9.30 శాతానికి తగ్గనున్నది. అంటే ఈఎంఐ రూ.1,639 తగ్గి రూ.32,076 చెల్లించాల్సి ఉంటుందన్న మాట. అంతకంటే ఎక్కువ రుణం తీసుకున్న వారికి ప్రయోజనం ఎక్కువగా ఉండనున్నది. అలాగే రూ.75 లక్షల గృహ రుణం తీసుకున్నవారికి ఈఎంఐ రూ.2,177 తగ్గి రూ.64,488కి చేరుకోనున్నది.

రుణం(రూ.)	కాలపరిమితి	వడ్డీరేటు(%)	నూతన రేటు(%)	ఈఎంఐ(రూ.)	నూతన ఈఎంఐ(రూ.)	తగ్గుదల(రూ.)
25 లక్షలు	10	9.55	9.30	33,715	32,076	1,639
50 లక్షలు	20	9.55	9.30	47,705	45,955	1,750
75 లక్షలు	30	9.55	9.30	66,665	64,488	2,177

అరబిందో 125% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 7: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.712.2 కోట్ల నికరలాభాన్ని ఆర్జించినట్లు రాష్ర్టానికి చెందిన అరబిందో ఫార్మా ప్రకటించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి నమోదైన రూ.595 కోట్ల లాభంతో పోలిస్తే 19.69 శాతం ఎగబాకింది. అమ్మకాలు భారీగా పుంజుకోవడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అక్టోబర్-డిసెంబర్ మధ్యకాలంలో ఆదాయం రూ.4,336.11 కోట్ల నుంచి రూ.5,269.67 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ ఎండీ ఎన్ గోవిందరాజన్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూపాయి ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.1.25 లేదా 125 శాతం మధ్యంతర డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. అన్ని విభాగాలు, మార్కెట్లలో బలమైన వృద్ధిని నమోదు చేసుకోవడం వల్లనే ఆదాయంలో 22 శాతం పెరుగుదల నమోదైందన్నారు. మరోవైపు సినర్జీ రెమెడిస్‌లో వాటాను మరింత పెంచుకోవడానికి రూ.15 కోట్ల మేర పెట్టుబడి పెడుతున్నది.

టాటా మోటర్స్‌కు జేఎల్ఆర్ సెగ

క్యూ3లో రూ.26,961 కోట్ల నష్టం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.26, 960.8 కోట్ల నష్టం సంభవించింది. బ్రిటన్‌కు చెందిన తన అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు ఒకేసారి భారీగా నిధులను కేటాయించడం వల్లనే లాభాల్లో గండిపడిందని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి సంస్థ రూ.1,214.6 కోట్ల లాభాన్ని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 4.36 శాతం ఎగబాకి రూ.77,582.71 కోట్లకు చేరుకోవడం విశేషం. గతేడాది ఇది రూ.74,337.70 కోట్లుగా ఉన్నట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఏకీకృత విషయానికి వస్తే పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం రూ.211.59 కోట్ల నుంచి రూ.617.62 కోట్లకు చేరుకోగా, ఆదాయం రూ.16,186.15 కోట్ల నుంచి రూ.16,477.07 కోట్లకు ఎగబాకింది. జేఎల్ఆర్ కంపెనీ ఆదాయం మాత్రం ఒక్క శాతం తగ్గి 6.2 బిలియన్ పౌండ్లకు జారుకున్నది. స్టాక్ మార్కెట్లో లిస్టైన దానికంటే జేఎల్ఆర్ విలువ పడిపోయినందనుకుగాను దీనిని పూడ్చుకోవడానికి 3.1 బిలియన్ పౌండ్లు (రూ.27,838 కోట్లు) నిధులను ఒకేసారి వెచ్చించడంతో టాటా మోటర్స్ లాభాల్లో ప్రతికూల వృద్ధి నమోదైంది. వీటితోపాటు వాహనాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటం, నిర్వహణ ఖర్చులు పెరుగడం కూడా ప్రభావాన్ని మరింత పెంచాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ..దేశీయ వ్యాపారం మరింత బలోపేతం అయిందని, అటు మార్కెట్‌వాటాలోనూ, లాభాల్లోనూ వృద్ధిని నమోదు చేసుకున్నట్లు చెప్పారు. సంస్థను నవీనకరించాలనే ఉద్దేశంతో రూపొందించిన 2.0 వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు, దీంట్లోభాగంగా నూతన వాహనాలను విడుదల చేయడం, నిలకడైన వృద్ధిని సాధించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. కానీ, జేఎల్ఆర్‌తో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తున్నదన్నారు. మూడో త్రైమాసికంలో జేఎల్ఆర్ రిటైల్ విక్రయాలు 6.4 శాతం తగ్గి 1,44,602 యూనిట్లకు పడిపోయాయి.



సామ్‌సంగ్ మొబైల్స్ అమ్మకాల్లో దేశంలోనే 3వ స్థానాన్ని దక్కించుకున్న సందర్భంగా బిగ్‘సి’ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరిని అభినందిస్తున్న కంపెనీ ప్రతినిధులు

బిగ్‘సి’లో సామ్‌సంగ్ మొబైళ్ల హవా

హైదరాబాద్, ఫిబ్రవరి 7: మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ ‘సి’ మరో ఖ్యాతిని గడించింది. సామ్‌సంగ్‌కు చెందిన ఫోన్ల అమ్మకాల్లో దేశంలో బిగ్‘సి’కి మూడో స్థానం వరించింది. గడిచిన 16 ఏండ్లుగా సామ్‌సంగ్ ప్రవేశపెట్టిన ప్రతి మోడల్ విక్రయాల్లో తెలుగు రాష్ర్టాల్లో తొలి స్థానంలో నిలిచినట్లు, సంస్థ అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించడం వల్లనే ఇది సాధ్యమైందని బాలు చౌదరి పేర్కొన్నా రు. సమావేశంలో బిగ్ సి డైరెక్టర్లు వై స్వప్న కుమార్, బాలాజీ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఆర్‌వీ ట్రావెల్ ఎక్స్‌పో విజయవంతం

హైదరాబాద్, ఫిబ్రవరి 7: దేశ, విదేశాల్లో విహారయాత్రలకు వెళ్లేవారి కోసం ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ఆర్‌వీ ట్రావెల్ ఎక్స్‌పో-2019కు విశేష స్పందన లభించింది. రెండు తెలుగు రాష్ర్టాల పర్యాటకులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోగా, ఎక్కడికి.. ఎంత ఖర్చు అవుతుంది?, ఎలా వెళ్ళాలి?.. అన్నది నిర్వాహకులు సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తీసిన లక్కీడ్రాలో గుంటూరుకు చెందిన ముగ్గురు, హైదరాబాద్‌కు చెందిన ఒక్కరు విజేతలుగా నిలిచారు. జీఆర్ మదన్ మోహన్ రెడ్డి (గుంటూరు), పీ రామసీత (హైదరాబాద్) సింగపూర్ ప్యాకేజీ, ఎం రుక్మాంగధరావు (గుంటూరు), పి పద్మశ్రీ (గుంటూరు) దుబాయ్ ప్యాకేజీలను గెలుచుకున్నట్లు ఓ ప్రకటనలో సంస్థ తెలియజేసింది.

సుడోకు

డైలీ సుడోకు 59 సమాధానం

2	8	1	5	4	6	3	9	7
4	5	6	3	7	9	1	8	2
3	7	9	8	1	2	4	6	5
8	3	2	7	9	4	5	1	6
1	4	5	2	6	3	8	7	9
6	9	7	1	8	5	2	3	4
5	6	8	4	3	7	9	2	1
7	1	4	9	2	8	6	5	3
9	2	3	6	5	1	7	4	8

డైలీ సుడోకు -60

					6		2	7
5				3	2			9
						6	1	
		7					5	
		6			4		3	2
9		5	1			8		6
		8	5					
1					3			
						3		5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో



అమీర్‌పేట-హైటెక్‌సిటీ మెట్రోమార్గంలో ట్రయల్‌రన్‌లో భాగంగా గురువారం జూబ్లీహిల్స్‌లో పరుగులు తీస్తున్న రైలు

ప్రభుత్వ పరిశీలనలో మెట్రో-2 డీపీఆర్

- మార్పులు, చేర్పుల అనంతరం క్యాబినెట్ ముందుకు
- మంత్రివర్గ అనుమతి అనంతరం పనులు ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెట్రోరైలు ప్రాజెక్టు రెండో దశ డీపీఆర్ ప్రభుత్వం వద్దకు చేరింది. ఢిల్లీ మెట్రోరైలు కార్పొరేషన్ సమగ్రంగా అధ్యయనం చేసి రూపొందించిన తుది నివేదికను ఇటీవలే ప్రభుత్వానికి అందజేసినట్టు విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం సీఎం కేసీఆర్ పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. ఆయన డీపీఆర్‌ను పరిశీలించి మార్పులు, చేర్పులు సూచిస్తారు. అనంతరం అధికారులు తుది నివేదికను క్యాబినెట్ ముందు ప్రవేశపెడుతారు. అనుమతి లభించిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఎయిర్‌పోర్ట్ మెట్రో పేరుతో చేపట్టనున్న రెండోదశ కారిడార్ మార్గాలపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. ఇప్పటికే మూడు కారిడార్లతో కూడిన మెట్రోరైలు మొదటిదశ దాదాపు పూర్తయింది. 72 కి.మీల మార్గంలో 46 కి.మిలు ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. నాగోల్-మియాపూర్(30 కి.మిలు), ఎల్బీనగర్-అమీర్‌పేట (16 కి.మిలు) మార్గాల్లో రైళ్లు తిరుగుతున్నాయి. అమీర్‌పేట్-హైటెక్‌సిటీ మార్గంలో ట్రయల్ రన్ నడుస్తున్నది. జేబీఎస్-ఎంజీబీఎస్ మార్గం త్వరలో పూర్తికానుంది. ఈ నేపథ్యంలో రెండోదశ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నది.

ఎయిర్‌పోర్ట్‌కు కనెక్టివిటీ..

మెట్రోరైలు రెండో దశ ప్రధాన లక్ష్యం ఎయిర్‌పోర్ట్ వరకు కనెక్టివిటీ కల్పించడం. ఈ దశలోని ఒక కారిడార్‌లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి రాయదుర్గ్ వరకు 31 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. మరో కారిడార్‌లో బీహెచ్‌ఈఎల్ నుంచి లక్డీకాపూల్ వరకు 26.2 కి.మీల మార్గం నిర్మిస్తారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు 5.1 కి.మీల మార్గాన్ని కూడా రెండో దశలోనే చేపడుతారు. ఇప్పటికే మొదటిదశ మెట్రోతో నగరంలో విప్లవాత్మక మార్పులు కలుగుతుండగా, రెండోదశతో నగర రూపురేఖలు మారుతాయని అధికారులు చెప్తున్నారు. ఈ మార్గం పెట్టుబడులను ఆకర్షిస్తూ నగరాభివృద్ధిలో కొత్త బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ అనుమతి లభించిన వెంటనే ప్రాజెక్టును చేపట్టనున్నారు.

రెండోదశలో కారిడార్లు

1. **రాయదుర్గం-శంషాబాద్:** రాయదుర్గం నుంచి గచ్చిబౌలి, ఖాజాగూడ, రాజేంద్రనగర్ మీదుగా శంషాబాద్ వరకు.
2. **బీహెచ్‌ఈఎల్-లక్డీకాపూల్:** బీహెచ్‌ఈఎల్ నుంచి ప్రారంభమై మియాపూర్, మదీనగూడ, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ జంక్షన్, షేక్‌పేట, మెహిదీపట్నం మీదుగా లక్డీకాపూల్ వరకు. ఇక్కడ మొదటిదశలోని కారిడార్1కు అనుసంధానం అవుతుంది.
3. **నాగోల్-ఎల్బీనగర్:** మొదటిదశ ప్రాజెక్టు కారిడార్-3లోని నాగోల్ నుంచి ప్రారంభమై నాగోల్ జంక్షన్, బండ్లగూడ జంక్షన్, కామినేని దవాఖాన మీదుగా ఎల్బీనగర్ వరకు. అక్కడ మొదటిదశ కారిడార్-1కు అనుసంధానం అవుతుంది.
4. **ఎల్బీనగర్-ఫలక్‌నుమా:** ఎల్బీనగర్ నుంచి చాంద్రాయణ గుట్ట, పాతబస్తీ ప్రాంతాల మీదుగా ఫలక్‌నుమాలోని మొదటిదశ కారిడార్-2కు అనుసంధానం అవుతుంది. అక్కడి నుంచి పాత బస్తీ మీదుగా శంషాబాద్‌కు చేరుకుంటుంది.

చేనేతది ఐదువేల ఏండ్ల చరిత్ర

- నూతన పరిజ్ఞానాన్ని అందుకోవాలి
- తెలంగాణ చేనేత వస్ర్తాలు ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందాయి
- నేటినుంచి విశ్వేశ్వరయ్యభవన్‌లో అఖిల భారత సదస్సు
- ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా టీఎస్ సెంటర్ చైర్మన్ డాక్టర్ రామేశ్వర్‌రావు

ఖైరతాబాద్: మన దేశ చేనేతరంగానికి ఐదువేల ఏండ్ల చరిత్ర ఉన్నదని, రామాయణ, మహాభారత కాలంలోనూ పట్టువస్ర్తాలు ధరించారని చరిత్ర చెప్తున్నదని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ జీ రామేశ్వర్‌రావు పేర్కొన్నారు. శుక్ర, శనివారాల్లో హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో 'డైవర్సిటీ ఇన్ హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్, గ్లోబల్ ట్రెండ్స్ ఇన్ ఫ్యాషన్ అండ్ క్లాతింగ్' అనే అంశంపై నిర్వహించే అఖిల భారత సదస్సు వివరాలను గురువారం కార్యదర్శులు టీ అంజయ్య, పీఎల్ పాండా, ప్రొఫెసర్ రమణనాయక్‌తో కలిసి ఆయన మీడియాకు తెలిపారు. రాష్ట్రంలో చేనేతకు ప్రభుత్వం ఎంతో చేయూతనందిస్తున్నదని కొనియాడారు. ప్రస్తుతం 49 వేల పవర్‌లూమ్స్, 17 వేల హ్యాండ్ లూమ్స్ ఉన్నాయని చెప్పారు. వరంగల్, పోచంపల్లి, గద్వాల, సిరిసిల్ల చేనేత వస్ర్తాలు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందాయని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చేనేతరంగం ద్వారా వంద మిలియన్ల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తుల ఎగుమతులు 1971లో ఎగుమతిలో రూ.10 కోట్ల టర్నోవర్ నుంచి మొదలుకొని నేడు రూ.2 లక్షల కోట్లకు చేరుకోవడం అభినందించే విషయమని చెప్పారు. హర్యానా, పంజాబ్ రాష్ర్టాల్లో వంద హ్యాండ్లూమ్ కంపెనీలు పవర్‌లూమ్‌కు అప్‌గ్రేడ్ అయ్యాయని, ఈశాన్య రాష్ర్టాల్లో అత్యాధునిక టెక్నాలజీ ద్వారా వస్ర్తాలను రూపొందిస్తున్నారని గుర్తుచేశారు.మార్పులకు అనుగుణంగా ఈ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ ఆపాదించుకోవాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సదస్సు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్, ఐటీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్కు డైరెక్టర్ శైలజా రామయ్యర్, శనివారం ముగింపు సదస్సుకు ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్యామ్ సుందర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ జీహెచ్‌ఎస్ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. దేశవ్యాప్తంగా 300 మంది నిపుణులు, నిష్ణాతులు హాజరవుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఈశాన్య రాష్ర్టాల్లో అత్యాధునిక పరిజ్ఞానంతో చేనేత కార్మికులు రూపొందించిన పలు వస్ర్తాలను ప్రదర్శించారు.



సదస్సు వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ రామేశ్వర్‌రావు తదితరులు



ఆరాంఘర్‌లో భూ సేకరణ వివరాలను తెలుసుకుంటున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం

వక్ఫ్ ఆస్తులను కాపాడాలి

- వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్‌సలీం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముస్లింల మతపరమైన ఆస్తులను రోడ్డు విస్తరణలో ధ్వంసం కాకుండా కాపాడాలని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం కోరారు. గురువారం ఆరాంఘర్ నుంచి శంషాబాద్ వరకు రోడ్డు విస్తరణలో భాగంగా జాతీయ రహదారుల సంస్థ సేకరించే వక్ఫ్ ఆస్తులను సలీం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారుల నిర్మాణంలో వక్ఫ్ ఆస్తులను సేకరించకుండా ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలని ఎన్‌హెచ్‌ఏ అధికారులను కోరారు. వక్ఫ్ భూములను కొనుగోలుచేయడానికి కూడా అధికారంలేదన్నారు. ఈ అంశంపై టీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో చర్చిస్తామని చెప్పారు. రోడ్ల విస్తరణలో బుద్వేల్ గ్రేవ్‌యార్డ్, బుద్వేల్ మసీద్-ఏ-నూర్, సతంరాయ్ గ్రేవ్‌యార్డ్, దర్గా ఆఘా ఫరీదుద్దీన్ బాబా, శంషాబాద్ గ్రేవ్‌యార్డ్, మసీద్-ఏ-నూర్ సిద్ధాంతి శంషాబాద్ వంటివి ధ్వంసమయ్యే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఈ పర్యటనలో రోడ్డు, రవాణా శాఖ ఎస్‌ఈ పీ రాజేందర్‌కుమార్, ఎన్‌హెచ్ఏఐ ఈఈ పీ ధర్మారెడ్డి, శంషాబాద్ డీసీపీ ఎన్ ప్రకాశ్‌రెడ్డి, జీ రాంరెడ్డి, ఆర్డీవో చంద్రకళ, ఏసీపీ ఎస్ అశోక్‌కుమార్, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

యువకుడి సజీవదహనం

అమరావతి: ఏపీలోని కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని మగ్గాలకాలనీలో ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో మహ్మద్‌బాజీ అనే యువకుడు సజీవ దహనమయ్యాడు. ఇంట్లోని వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

దుర్వాసన దూరం కావాలి

- గడువులోగా క్యాపింగ్ పూర్తిచేయాలి
- 2019 మే లోపు పచ్చదనం ఏర్పాటుకు ఆదేశం
- జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును పరిశీలించిన పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో అమర్చిన ఆధునిక యంత్రాల ద్వారా దుర్వాసన సమస్యను పరిష్కరించాలని పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన డంపింగ్ యార్డును సందర్శించారు. గడువులోగా క్యాపింగ్ పనులు పూర్తి కావాలని.. 2019 మే లోగా పచ్చదనాన్ని ఏర్పాటుచేయాలని అదనపు కమిషనర్‌ను ఆదేశించారు. క్యాపింగ్ పనుల లేయర్ల నిర్మాణ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. ఇసుక లేయర్ల పనులు 90 శాతం పూర్తయ్యాయని, జియో- సింథటిక్ లైనర్, హెచ్‌డీపీఈ లైనర్, జియో- కంపోజిట్ లైనర్ పనులు వేగంగా జరుగుతున్నాయని సిబ్బంది వివరించారు. రోజుకు ఐదారు టన్నుల మేర ప్లాస్టిక్ వ్యర్థాల శుద్ధీకరణ జరుగుతున్నదన్నారు. వ్యర్థాల నుంచి 19.8 మెగావాట్ల విద్యుత్తు తయారీ కేంద్రం పనులను తనిఖీ చేశారు. పనుల పురోగతిపై సిబ్బంది పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు ఎం కోటేశ్వరరావు, ఆర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్ దందా ముఠా గుట్టురట్టు

- రూ.పది లక్షల విలువైన ఎఫాడ్రిన్ డ్రగ్ స్వాధీనం
- అనంతపురం నుంచి తెచ్చి హైదరాబాద్‌లో విక్రయాలు

కంటోన్మెంట్, నమస్తే తెలంగాణ: శరీరం ఉత్తేజంగా ఉండేందుకు క్రీడాకారులు ఎక్కువగా వినియోగించే ఎఫాడ్రిన్ డ్రగ్‌ను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టుచేశారు. వారి నుంచి రూ.పది లక్షల విలువైన డ్రగ్ ప్యాకెట్లతోపాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొన్నారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం మీడియాకు బేగంపేట ఏసీపీ రామిరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. అనంతపురం జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ నివాసి తాడిమర్రి చెన్నకేశవులు రెడ్డి స్థానిక జూనియర్ కాలేజీలో పనిచేస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో డ్రగ్ దందాకు తెరలేపాడు. తాడిపత్రికి చెందిన తప్పాల్ సిలార్ అహ్మద్‌వలీతో జతకలిసి ఎఫాడ్రిన్ డ్రగ్‌ను అనంతపురంలో తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని గాజులరామారం నివాసి ఆకుతోట కిశోర్ సాయంతో విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం బోయిన్‌పల్లిలో డ్రగ్ విక్రయించేందుకు చెన్నకేశవులురెడ్డి, అహ్మద్‌వలీ, కిశోర్ కస్టమర్ల కోసం వేచిఉండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు బోయిన్‌పల్లి పోలీసులు దాడిజరిపి వారిని ఆదుపులోకి తీసుకొని 600 గ్రాముల ఎఫాడ్రిన్ డ్రగ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొన్నారు. డ్రగ్ సరఫరా చేస్తున్న శ్రీనివాస్, రమణ పరారీలో ఉన్నారు. డ్రగ్ విక్రయించే ముఠాను అరెస్టుచేసిన ఇన్‌స్పెక్టర్ రాజేశ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ స్వామిగౌడ్‌ను ఏసీపీ రామిరెడ్డి అభినందించారు.



ప్రముఖ పారిశ్రామిక వేత్త, మైహోమ్స్ సిమెంట్స్ అధినేత జూపల్లి జగపతిరావు కూతురు నిశ్చితార్థ వేడుక గురువారం హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో జరిగింది. మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్, పాలకుర్తి ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం.

- దేవరుప్పల

కెన్యాలో టీఆర్‌ఎస్‌శాఖ ప్రారంభం

- విదేశాల్లో పార్టీ శాఖలు 37కు చేరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కెన్యా దేశంలో టీఆర్‌ఎస్‌శాఖను ప్రారంభించారు. గురువారం స్కైప్ ద్వారా ఎన్నారైశాఖ కోఆర్డినేటర్ మహేష్ బిగాల ప్రారంభించి అడ్‌హాక్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెన్యాశాఖ ఏర్పాటుతో విదేశాల్లో టీఆర్‌ఎస్ పార్టీ శాఖలు 37కు చేరుకున్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లోగా 40 శాఖలు, లోక్‌సభ ఎన్నికల్లోగా 50 శాఖల వరకు విస్తరిస్తామని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ఎన్నారై సలహాదారు, ఎంపీ కవితతో చర్చించి పూర్తిస్థాయి కమిటీని ప్రకటిస్తామని తెలిపారు. అడ్‌హాక్ కమిటీ సభ్యులుగా కల్యాణ్‌కుమార్ కొత్త, రవీందర్‌రెడ్డి ముస్కుల, శివకుమార్ మిట్టపల్లి, నరేందర్‌రెడ్డి గంట్ల, స్వప్నారెడ్డి, రాజేశ్‌రెడ్డి చీమర్ల, ప్రశాంతిరెడ్డి, క్రాంతి పాలపాటి ఎన్నికయ్యారు.

డబ్బుల కోసమే మందకృష్ణ విశ్వరూప సభ

- బాబుతో జతకట్టి ఇప్పుడు తిట్టడమేమిటి?
- వర్గీకరణ బిల్లుపై 14న సదస్సు: డాక్టర్ పిడమర్తి రవి

ఖైరతాబాద్: ఎన్నికల వేళ రాజకీయ పార్టీల నుంచి డబ్బులు వసూళ్లు చేసేందుకే మంద కృష్ణమాదిగ విశ్వరూప సభ పెడుతున్నారని డాక్టర్ పిడమర్తి రవి ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబు ద్రోహం చేశారంటూ ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 19న విశ్వరూప సభ పెడుతున్నట్టు కృష్ణమాదిగ ప్రకటించడంపై రవి మండిపడ్డారు. నిన్నటివరకు బాబు సంకన పట్టుకొని తిరిగి, ఇప్పుడు ఆయనను తిట్టడం ఏం పద్ధతి అని నిలదీశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో పిడమర్తి మాట్లాడుతూ రెండునెలల క్రితం వరకు చంద్రబాబు, కూటమితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించిన మందకృష్ణ ఇప్పుడు బాబు ద్రోహం చేశారంటూ కొత్తస్వరం వినిపిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర చరిత్రలో అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, ఆయన చొరవతోనే కేంద్రంలో కూడా బిల్లు నెగ్గుతుందని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి బాసటగా వర్గీకరణ కోసం అన్ని సంఘాలను కలుపుకొని పోతామన్నారు. వర్గీకరణ బిల్లుపై ఈ నెల 14న సదస్సు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు, వివిధ దళిత సంఘాల నాయకులు యాతాకుల భాస్కర్, మైస ఉపేందర్, మాదిగ జేఏసీ హైదరాబాద్ ఇంచార్జి మంద సురేశ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో వర్గీకరణ బిల్లు అంశాన్ని మ్యానిఫెస్టోలో పొందుపరిచే వారికే మద్దతు పలుకుతామన్నారు.



సోమాజిగూడలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ నేత పిడమర్తి రవి. చిత్రంలో వివిధ దళిత సంఘాల నేతలు

31 జిల్లాలకు కాంగ్రెస్ అధ్యక్షులు

డీసీసీ అధ్యక్షులతో సరిపెట్టిన పీసీసీ

జిల్లా కమిటీల విషయం తేల్చని అధిష్ఠానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర కాంగ్రెస్ చాలాకాలం తర్వాత ఎట్టకేలకు జిల్లా పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం 31 జిల్లాలకు చెందిన అధ్యక్షుల పేర్లను పీసీసీ ఒక ప్రకటనలో విడుదల చేసింది. పట్టణ పార్టీ అధ్యక్షులను కూడా ప్రకటించింది. ఖమ్మం సిటీ అధ్యక్షుడిగా జావెద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దీపక్‌చౌదరి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా అంజన్‌కుమార్ యాదవ్‌లను నియమించింది. కమిటీల కూర్పుపై అధిష్ఠానం ఏవిషయం వెల్లడించకపోవడంతో పార్టీలో తర్జనభర్జనలు జరుగుతున్నాయి.

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వీరే..

ఆదిలాబాద్- భార్గవ దేశ్‌పాండే, మంచిర్యాల- కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, నిర్మల్- రామారావుపటేల్ పవార్, కుమ్రంభీం ఆసిఫాబాద్- ఆత్రం సక్కు, కరీంనగర్- మృత్యుంజయం, జగిత్యాల- లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి- ఎర్ల కొంరయ్య, రాజన్న సిరిసిల్ల- సత్యనారాయణగౌడ్, నిజామాబాద్- మనాల మోహన్‌రెడ్డి, నిజామాబాద్ సిటీ- కేష వేణు, కామారెడ్డి- కైలాస శ్రీనివాసరావు, వరంగల్ అర్బన్ అండ్ రూరల్- నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ సిటీ- కేదరి శ్రీనివాసరావు, జయశంకర్ భూపాలపల్లి- గండ్ర జ్యోతి, జనగామ- జంగా రాఘవరెడి, సంగారెడ్డి- నిర్మల గౌడ్, మెదక్- తిరుపతిరెడ్డి, సిద్దిపేట- టీ నర్సారెడ్డి, వికారాబాద్- రోహిత్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి- కూన శ్రీశైలంగౌడ్, రంగారెడ్డి- చల్లా నర్సింహారెడ్డి, మహబూబ్‌నగర్- ఒబేదుల్లా కొత్వాల్, వనపర్తి- శంకర్‌ప్రసాద్, జోగుళాంబ గద్వాల- పటేల్ ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్- సీహెచ్ వంశీకృష్ణ, సూర్యాపేట- వెంకన్న యాదవ్, యాదాద్రి భువనగిరి- భిక్షమయ్యగౌడ్, మహబూబాబాద్- భరత్‌చంద్రారెడ్డి, నల్లగొండ- శంకర్‌నాయక్, భద్రాద్రి కొత్తగూడెం- వనమా వెంకటేశ్వరరావు, ఖమ్మం- పువ్వాడ దుర్గాప్రసాద్.

ఖనిజాలు ప్రగతికి ఆయువుపట్టు

- భూగర్భ విజ్ఞానశాస్త్రంపై అవగాహన పెరుగాలి
- జీఎస్‌ఐ శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారతదేశ ప్రగతికి ఖనిజాలు ఆయువుపట్టని, భూగర్భ విజ్ఞాన శాస్త్రంపై మరింత అవగాహన పెరుగాల్సిన అవసరమున్నదని భూ విజ్ఞాన సర్వేక్షణ (జీఎస్‌ఐ) శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. జీఎస్‌ఐ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ విద్యార్థులకు అందిస్తున్న శిక్షణ గురించి గురువారం కవాడిగూడలోని పీఐబీలో మీడియాకు వివరించారు. తమ శిక్షణ సంస్థ ద్వారా శాస్త్రవేత్తలకు భూగర్భ విషయ పరిజ్ఞానాన్ని అందిస్తున్నామని, పరిశోధనలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 32 వేలమంది లబ్ధిపొందినట్టు పేర్కొన్నారు. నాగపూర్, కోల్‌కతా, లక్నో, జైపూర్, షిల్లాంగ్ ప్రాంతాల్లో అనుబంధ శిక్షణ సంస్థలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 62 దేశాలకు చెందిన 433 మంది శిక్షణ పొందారన్నారు. 'భూసంవాద్' కార్యక్రమం ద్వారా 2500 మంది వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ టీవీకే రెడ్డి మాట్లాడుతూ మన దేశ ఆర్థిక వ్యవస్థకు ఖనిజాలు ఊతమిస్తాయని అన్నారు. కార్యక్రమంలో జీఎస్‌ఐ డైరెక్టర్ డాక్టర్ తారక్‌నాథపాల్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
శుక్రవారం 8 ఫిబ్రవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

సాగర గర్భంలోకి ప్రయాణం..



సముద్రతీర ప్రజల జీవనాధారం ఏంటని అడిగితే దాదాపు 'సీఫుడ్స్' అని చెపుతారు. చాలా మంది దానిపై ఆధారపడి జీవిస్తుంటారు. కానీ తమిళ నాడులోని ఓ గ్రామాస్తులు ఏం చేస్తున్నారో తెలుసా..? సముద్రాన్ని నమ్ముకునే జీవనం సాగిస్తున్నారు. కానీ సీఫుడ్‌తో కాదు..

అందరూ మహిళలే. వాళ్ల రోజు గడవాంటే సుముద్రంలోకి దూకాలి. లోతుల్లోకి వెళ్లాలి. సముద్ర గర్భాన్ని తాకాలి. 20 ఏండ్ల నుంచి 70 ఏండ్ల వయస్సు ఉన్న ఎవరైనా సరే ఇదే రోజూ చేసేది. ఇలా వయసుతో సంబంధం లేకుండా సముద్రం మీద ఆధారపడుతూ కుటుంబాలను రక్షించుకుంటున్నారు. ఇంతకు వాళ్లు చేసేది ఏంటంటే... సముద్ర అడుగు భాగంలో దొరికే 'సీవీడ్' (సుముద్రపు నాచు మొక్కలు)ను సేకరించి విక్రయిస్తుంటారు. ఈ సీవిడ్ రసాయనాల తయారీకి ఉప యోగపడతాయి. దీనివల్ల వచ్చేదే వారి ఆదాయం. ఇటీవల అక్కడికి వెళ్లిన ఓ వీడియో జర్నలిస్టు వాళ్లతో మాట్లాడి సోషల్ మీడియాలో పంచుకున్నాడు. అక్కడి మహిళలతో మాట్లాడి వారి జీవన విధానాన్ని తెలియజేశాడు. ఆ వీడియో ఇప్పుడు బాగా షేర్ అవుతున్నది. రోజూ సముద్రంలోకి వెళ్లడానికి ఆ మహిళలు కనీసం డైవింగ్ సూట్‌లను కూడా వేసుకోరు. కనీసం ఆక్సిజన్ సిలిండర్ వాళ్లకు తెలియదు. ఎలాంటి రక్షణ పరికరాలు లేకుండానే సాంప్రదాయ డైవర్స్‌గా సముద్రంలోకి వెళ్తారు. నెలలో 12 నుంచి 15 రోజులు ఈ పని చేస్తారు. సుమారు 50 కేజీల సీవీడ్‌ను వాళ్లు రోజూ సేకరిస్తుంటారు. దీన్ని విక్రయించడం ద్వారా వారు నెలకు 8వేల నుంచి 10వేల రూపాయల ఆదాయం పొందుతారు.

అచ్చు పెద్దల్లాగే..!

ఒకప్పుడు ఫ్యాషన్ అంటే పెద్దలకు మాత్రమే అన్నట్లుండేది.. కానీ ఫ్యాషనిస్టులు ఇప్పుడు పిల్లలకు ఆ ట్రెండ్ తీసుకొచ్చారు.. మారుతున్న కాలానికి అనుగుణంగా ముద్దులొలికే పిల్లలకూ.. సరికొత్త డిజైన్లతో మార్కెట్ నిండిపోతున్నది.. పాప.. బాబు.. అనే తేడా లేకుండా ఇద్దరికీ రంగురంగుల్లో.. అచ్చు పెద్దల ఫ్యాషన్ ట్రెండ్‌ని ఫాలో అయిపోతున్నారు.. అలాంటి లేటెస్ట్ కలెక్షన్స్ మీకోసం..



1 సూటు.. బూటు వేస్తే పిల్లలు హుందాగా కనిపిస్తారు. చెక్స్ ప్యాటర్న్‌లో వచ్చిన ఖాకీ కలర్ ప్యాంట్ ఇది. దానికి యెల్లో కలర్ షర్ట్ ఇచ్చారు. పీచ్ కలర్ చెక్స్ జాకెట్ దీనికి పర్‌ఫెక్ట్‌గా మ్యాచ్ అయింది.

2 బ్లూ కలర్ ప్లెయిన్ లాంగ్ గౌన్ ఇది. కింద ఎక్కువ గేర్ వచ్చేలా కుట్టారు. పైన హాఫ్ షోల్డర్‌తో చూడ ముచ్చటగా కనిపిస్తున్నది. ఎర్రని కుచ్చులతో వచ్చిన పువ్వు డ్రెస్ అందాన్ని రెట్టింపు చేసింది.

3 డిఫరెంట్‌గా ఉండాలనుకునే వారు ఈ డ్రెస్ ఎంచుకోవాల్సిందే! ఆకుపచ్చని నెట్ ఫ్యాబ్రిక్‌తో స్లీవ్‌లెస్, లాంగ్ గౌన్ కుట్టారు. దీనికి మల్టీ కలర్ పూసలను అటాచ్ చేశారు. నడుముకు వచ్చిన బెల్ట్, పువ్వు దీనికి అదనపు ఆకర్షణగా నిలిచింది.

4 చెక్స్ ప్యాటర్న్ హవా నడుస్తున్నదీ మధ్య కాలంలో. బ్లూ, యెల్లో కాంబినేషన్‌లో వచ్చిన ప్యాంట్ ఇది. దీనికి ప్లెయిన్ రాయల్ బ్లూ షర్ట్, రెడ్ బౌ పర్‌ఫెక్ట్‌గా ఉన్నాయి.

KLM FASHION MALL

ఓ ఆశా వర్కర్ ఆదర్శం..



గ్రామాల్లో ఆశా వర్కర్ల పాత్ర కీలకంగా ఉంటుంది. మాతా, శిశు సంరక్షణకు వీళ్లు ప్రత్యేక చొరవ తీసుకుంటారు. అలాంటి ఆశా వర్కరే ఉమా పాటిల్. మహారాష్ట్రకు చెందిన ఈ ఉమ ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ గ్రామాల్లో ఆదర్శంగా నిలుస్తున్నది.

ఆశా వర్కర్ అంటే ఉదయాన్నే డ్యూటీకి వెళ్లడం, గ్రామాల్లో సర్వే చేయడం, రికార్డులు నమోదు చేసి పై అధికారులకు అందించడం ఇంతే అనుకుంటాం. కానీ ఆ పని చేయడంలో ఒక్కొక్కరిది ఒక్కో శ్రమ. మహారాష్ట్రలోని ఆరాగ్ గ్రామంలో ఆశా వర్కర్‌గా పని చేస్తున్న ఉమాపాటిల్ కూడా అంతే రికార్డులు రాసి, సర్వేలు చేసి, అధికారులకు అప్పగించడమే కాదు.. ఆమె చూసిన సమస్యలను పరిష్కరించడానికి, మాతా శిశు సంరక్షణకు, మరణాల రేట్లను తగ్గించడానికి కృషి చేస్తున్నది. ఆమె చేసిన కృషికి ప్రభుత్వాస్పత్రిలో ప్రసూతిలు పెరిగాయి. విధి నిర్వహణలో ఆమె పెట్టే ఖర్చు, ఆమె నెల వేతనానికి సగం. రికార్డులు రాయడానికి స్టేషనరీ, గ్రామాల్లో పర్యటించడానికి ఖర్చులు అవ్వన్నీ ఆమే భరిస్తున్నది. ఆమె విధులు నిర్వహిస్తున్న గ్రామంలో సుమారు 15,600 జనాభా ఉంది. ఈ గ్రామ పరిధిలో 15 మంది, అరాగ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో 41 మంది ఆశాలు పని చేస్తున్నారు. గ్రామాల్లో ఆరోగ్య అవగాహన పై దృష్టి సారించింది. దీని వల్ల మరణాల రేటు తగ్గినట్టు నేషనల్ హెల్త్ ఫ్యామిలీ గుర్తించింది. 2005-06లో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతిలు 64.6శాతం ఉంటే నేడు అవి 90.3శాతానికి పెరిగాయి. దీనికి కారణం ఉమాపాటిల్ తీసుకున్న ప్రత్యేక చొరవ అని అధికారులు ప్రశంసిస్తున్నారు. అయితే ఆమెకు వచ్చేది తక్కువ వేతనమే అయినా తన బాధ్యతను నిలుపుకుంటున్నది.

ముఖ సౌందర్యానికి చిట్కాలు..



- ఉదయం లేవగానే మీరు చెయ్యాల్సిన మొదటిపని ముఖానికి ఆవిరి పట్టడం. దీంతో చర్మానికి కొత్త నిగారింపు వస్తుంది. కాంతివంతంగా కూడా మారుతుంది.
- లేచిన కాసేపటి తర్వాత ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. ఇలా చేసుకోవడం వల్ల రాత్రంతా ముఖంపై పేరుకుపోయిన జిడ్డు పోతుంది. అలాగే బ్యాక్టీరియా మొత్తం కూడా పోతుంది.
- నిమ్మకాయ, పైనాపిల్, ద్రాక్షపండ్ల రసాలతో చర్మాన్ని శుభ్రపరచుకుంటే మంచిది. లేకుంటే న్యూట్రాజెనా ఫ్రెష్ ఫోమింగ్ క్లిన్సర్ వంటి ప్రక్రియల ద్వారా కూడా మీ చర్మాన్ని క్లీన్ చేసుకోవచ్చు.
- రోజూ మాయిశ్చరైజింగ్ చేసుకోవాలి. ఇలా చేస్తే చర్మం మృదువుగా ఉంటుంది. సూర్యుని ప్రభావం చర్మంపై పడకుండా ఉండేందుకు ఇది చాలా ఉపయోగపడుతుంది. ముఖం, మెడ, కళ్లు, పెదాలపై రాసుకుంటే మంచిది.
- టోనర్‌ని దూదికి రాసి ముఖానికి రుద్దాలి. అలాగే మెడకి కూడా రుద్దుకోవచ్చు. తర్వాత మాయిశ్చరైజర్ రాసుకోవాలి. చివరన టవల్‌తో కాస్త ముఖాన్ని తుడుచుకోవాలి.

తేనెతుట్టెను వదిలించండిలా?



- ఇంట్లో ఒకటి, రెండు తేనెటీగలు కనిపిస్తే చుట్టుపక్కల ఎక్కడో దగ్గర్లోనే తేనెతుట్టె కూడా ఉంటుంది. త్వరగా తేనెతుట్టెను తీసెయడం మంచిది. కావాల్సిన పనిముట్లను అమర్చుకొని తేనెటీగలను వెతకండి.
- చాలా కంపెనీలు తేనెతుట్టెలను ఉచితంగానే తొలిగిస్తాయి. కాబట్టి తేనెతెట్టె కనిపిస్తే వెంటనే స్థానిక లిస్టింగ్స్ చెక్ చేయండి. తేనెటీగల కీపర్ వాటిని చంపకుండా తెట్టెలను తీసేస్తారు.
- తేనెతుట్టె నుంచి తేనెటీగలను బయటికు తొలిగించడానికి పొగ, అగరుబత్తిని వాడొచ్చు. ఇలా చేస్తే తేనెటీగలు నెమ్మదిగా తేనెతుట్టెను ఖాళీ చేస్తాయి. ఒకసారి తేనెతుట్టె ఖాళీ అయిందంటే దాన్ని సులువుగా తొలిగించవచ్చు.
- తేనెతుట్టె కనిపిస్తే రాత్రిపూట దాని కింద కాగితం, కట్టె ముక్కను కాల్చి పెడితే తేనెటీగలు పారిపోతాయి. తేనెటీగలు దాక్కునే ప్రదేశాలు వదలకండి. లేకుంటే అవి తప్పించుకొని మళ్ళీ వచ్చే అవకాశం ఉంది.
- తేనెటీగలు నీళ్ళు లీకవుతున్న ట్యాంకులు, తెరచి ఉన్న ఫౌంటేన్లకి ఎక్కువ ఆకర్షిస్తాయి. అందుకని ఆ ప్రదేశాలను, వస్తువులును తీసేయండి.
- తేనెతుట్టె తీయడానికి మందపాటి దుస్తులు ధరించండి. గ్లోవ్స్, తలకి హెల్మెట్ లాంటివి పెట్టుకోండి. ఫెర్ఫ్యూమ్ వాడకూడదు.

II.
నమస్తే తెలంగాణ
చింతన
[కరీంనగర్]
శుక్రవారం 8 ఫిబ్రవరి 2019

పర్వదినాలు

- భక్త రామదాసు జయంతి (నేడు)
- వసంతపంచమి (10వ తేది)
- రథసప్తమి (12వ తేది)
- మధ్వనవమి (14వ తేది)

వసంతపంచమి తిరుగులేని శుభదినం!

ఎందుకంటే?



మాఘశుక్ల 'వసంతపంచమి'ని చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినంగా జరుపుకుంటాం. పిల్లలకు అక్షరాభ్యాసం మాత్రమే కాదు, అన్ని రకాల శుభకార్యాలూ ఇవాళ ప్రారంభించుకోవచ్చు. ఇదెంత శుభదినమంటే, ఎవరు ఎలాంటి శుభకార్యమైనా చక్కగా, ప్రత్యేక ముహూర్తాలతో పని లేకుండా ఆచరించుకోవచ్చునని వేద పండితులు అంటారు. ఇంతగా తిరుగులేని శుభదినంగా 'వసంతపంచమి' ప్రాచుర్యంలోకి రావడానికి దీనికి వున్న గొప్ప విశిష్ఠతే ప్రధాన కారణమని వారు చెప్తారు. తిథులన్నింటిలోకీ ప్రతీ 'పంచమి' ఉత్తమమైంది. ఇక, 'వసంతపంచమి' గురించి చెప్పక్కర్లేదు. ప్రాచీన కాలంలో నాలుగే ఋతువులు ఉండేవని, మాఘమాసాన్ని వసంతఋతువులో భాగంగానే అప్పట్లో పరిగణించే వారనీ చెప్తారు. సమస్త సృష్టి మనుగడకు మూలమైన ప్రణవ స్వరూపిణియేగాక పరాశక్తిగానూ సరస్వతీ మాత పూజలు అందుకుంటుంది. మనలోని ఆత్మజ్యోతికి ప్రతీక ఈ వేద మాత. అంతేకాదు, 'సర' అంటే కాంతి. మన జీవితాలకు వెలుగునిచ్చేదనీ అర్థం.

మంచిమాట



వచ్చేటప్పుడు వెంటనేమైన తెచ్చుకున్నది లేదు
హెచ్చుగ నిది తెలియని పామరులు
దురాశను తగులుకొని యిచ్చట నార్జించిన
ధనమెచ్చట కెత్తుకపొయ్యే రయ్యయ్యో.

-కంచర్ల గోపన్న
(భక్త రామదాసు కీర్తన : పొయ్యేటప్పుడు..)

పద్యస్తుతి



శ్రీకంఠ చాపఖండన!
పాకారి ప్రముఖ వినుత భండన! విలస
త్కాకుత్థ్స వంశమండన
రాకేందు యశోవిశాల! రామనృపాల!

-శ్రీమదాంధ్ర భాగవతం (దశమస్కంధం, పూర్వభాగం)

నేర్చుకొందాం

ఆయనకిది కంఠస్థం, మరి మీకు?



పేర్వారం రాములు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఇటీవల జరిగిన ఒక ఛాయాచిత్ర ప్రదర్శన కార్యక్రమంలో మాజీ డిజిపి పేర్వారం రాములు ఆహుతులకు అలవోకగా వినిపించిన పలు మధుర పద్యాలలో ఇదొకటి. శ్రీ రామచంద్రమూర్తిని అద్భుతంగా స్తుతించడమే ఇందులోని అర్థ పరమార్థం. శ్రీ మదాంధ్ర భాగవతం, దశమ స్కంధం (పూర్వభాగం)లోని మొదటి పద్యంగా ఆయన దీనిని పేర్కొన్నారు. ఈ పద్యాన్ని కంఠతా చదువుతుంటే వినే వారికి మృదుమధురంగా ఉంటుంది. ఆసక్తిగల పాఠకులు పలుమార్లు చదివి నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతోనే దీనిని ప్రచురిస్తున్నాం.

ప్రపంచాన్ని ఆంగ్లభాష ఏలుతున్న ప్రస్తుత తరుణంలో మనదైన భాషను, సంస్కృతిని కనీసం మన ముందు తరాల వారి కోసం కాపాడుకోవలసిన బాధ్యత మనపైనే ఉంది. ఆలోచించండి. పాఠకుల్లో ఎవరికైనా సరే, భారతీయ ధార్మిక సంబంధ పద్యాలు ఏవైనా కంఠస్థంగా వచ్చి వుంటే ఇంకెందుకు ఆలస్యం! మాకు రాసి పంపండి. ఇదుగో..ఇక్కడే మీ ప్రతిభను గౌరవమిస్తాం.

ప్రశ్నోపనిషత్



సుసంపన్నమైన భారతీయ తాత్విక జీవనంలోని ఉత్తమ విలువలను మా పాఠకులకు అందించే బృహత్ బాధ్యతతో ఈ శీర్షికను చేపడుతున్నాం. పాఠకుల్లో ఎవరికి, ఏ ధార్మిక పరమైన సందేహం వచ్చినా మాకు రాయండి. అది అందిన వెంటనే ముందు ప్రశ్ననే ప్రచురిస్తాం. ఇదుగో ఇక్కడ ఓ రెండు ప్రశ్నలు. పాఠకుల్లో కూడా పండితులు, ప్రజ్ఞావంతులు ఉంటారు కనుక, ఎవరికైనా ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలిస్తే మాకు రాయవలసిందిగా మనవి.

- **పరమాత్మ స్వరూపమే 'ఆత్మ' అయినప్పుడు రెంటికీ తేడా ఏమిటి?**

-**డి.రామ్‌గోపాల్ శర్మ**, మల్లాపూర్

- **పంచేంద్రియాలతో కూడిన శరీరాన్ని మనిషికి ఇవ్వడం ఎందుకు, మోక్షం కోసం వాటిని జయించమని చెప్పడం ఎందుకు?**

-**శాస్త్రుల కిరణ్‌కుమార్**, మెదక్

మా చిరునామా: ఎడిటర్, చింతన, నమస్తే తెలంగాణ, తెలుగు దినపత్రిక, బంజారాహిల్స్, రోడ్ నంబర్: 10, హైదరాబాద్-34.

సందర్భ శుద్ధి

ఆదిత్య వైభవం

రథసప్తమి సందర్భంగా..

అనూహ్య శక్తి స్వరూపుడైన సూర్యుడు అందరి దైవం. మతాలు, తత్త్వాలు, ప్రాంతాలు, జాతులు, జీవ నిర్జీవాలకు అతీతంగా సమస్త నక్షత్ర మండలానికంతటికీ ఆయనే ఆరాధ్యనీయుడు. ఇంకా, నిక్కచ్చిగా చెప్పాలంటే, ఆస్తికులకే కాదు, దైవిక భావన అంటేనే ఆమడ దూరం పారిపోయే నాస్తికులు సైతం ఆ శక్తి ముందు మోకరిల్ల వలసిందే.



సూర్యతేజో విలాసాన్ని, హృదయ విశాలత్వాన్ని, శక్తి సామర్థ్యాలను, మహోన్నత గొప్పతనాన్ని మన భారతీయ ధార్మిక తాత్వికత గుర్తించినంతగా మరే దేశ, మత తత్త్వ శాస్త్రాలూ వెల్లడించలేదు. ఒక్కమాటలో ఆదిత్యుడంటేనే అనంతుడని, ఆయన సాక్షాత్తు పరమాత్మ స్వరూపమేనని వేద పండితులు అభివర్ణిస్తారు. భౌతికంగా భగభగమండే భానుని హృదయం అంతరాంతరాలలో ఎంత ప్రశాంతమో అంత ప్రసన్నమనీ వారు చెప్తారు. తాను ఆదరించే వారి నుంచి అతి ఆరాధనలను కోరుకోడని, కేవలం ఒక్క కృతజ్ఞతా పూర్వక నమస్కారం చాలునని అనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. శివునికి అభిషేకం, విష్ణువునకు అలంకారం ఎలాగైతే అత్యంత ప్రీతికరమైన భక్తికార్యాలో సూర్యునికి మాత్రం ఒక్క నమస్కారం చాలునని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. అందుకే, 'నమస్కార ప్రియో భాను:' అన్నది వేదవాక్కు.

సంధ్యావందనంలో సూర్యునికి ఇచ్చే అర్ఘ్యప్రధానానికి అత్యంత విలువ ఉన్నది. ఆధునికులు, దైవం పట్ల నమ్మకం లేని వారు సైతం సూర్య నమస్కారాలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తారు. అటు మానసిక ప్రశాంతత, ఇటు భౌతిక వ్యాయామం రెండూ ఏకకాలంలో లభిస్తాయి కనుక అనేకమంది ఆధునికులూ దీనిని పాటిస్తారు. ఉత్తరాయణం మొదలైన తర్వాత మాఘ శుద్ధ సప్తమి ఆదిత్యుని జన్మదినం. నాటినుంచి సూర్యరశ్మి ఉచ్ఛస్థితికి చేరుకొని వేసవికాలం మొదలవుతుందని పండితులు అంటారు. శిశిర ఋతువులో భానుడి తాపానికి భూమిమీది అనేక జలాలు ఆవిరై పోతాయి. అప్పట్నించీ నాలుగు నెలలు సూర్యప్రతాపమే. పుష్యమాసం పూర్తయి, మాఘ ప్రతిపద మొదలైన నాటినుంచి అంటే, మరో ఏడు రోజుల్లో 'రథసప్తమి' పర్వదినం ఉందనగా శిశిర ఋతువు ప్రారంభమవుతుంది. అవాల్టితో సూర్యుని గమన తీరులోనే తీవ్రస్థాయి మార్పు వస్తుందన్నమాట. ఇక, రాబోయేదంతా వేసవే కాబట్టి, అప్పుడు 'తన ప్రతాపాన్ని ఒకింత తగ్గించుకోమంటూ' సూర్యభగవానుని వేడుకోవడంగానూ ఈ పండుగను భావిస్తాం.

'రథసప్తమి'ని 'సూర్య జయంతి'గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. జ్యోతిష శాస్త్రపరంగా ఈరోజు నుంచి ఆకాశంలో నక్షత్రాలు రథాకారంలో భాసిస్తాయని, కాబట్టే ఇది 'రథసప్తమి' అనీ అంటారు. 'సప్తమి' అంటే 'ఏడు'. సూర్యుని రథానికి అశ్వాలు ఏడైతే, సూర్యకిరణంలోని రంగులూ ఏడే. ఇన్ని విశేషాలున్నందునే ఈ ప్రత్యేక పర్వదినం సూర్యారాధనకు అత్యంత విశిష్ఠమని పండితులు చెప్తారు. ఇక, సంవత్సరం పొడుగునా వచ్చే 12 మాసాలకు సూర్యనామాలతో ప్రత్యేకమైన పేర్లున్నాయి కూడా. అంటే, సదరు నెల కాలాన్ని సూర్యుడు ఆ పేరుతో పాలిస్తుంటాడని అర్థం. మధు (చైత్రం), మాధవ (వైశాఖం), శుక్ర (జ్యేష్ఠం), శుచి (ఆషాఢం), నభో (శ్రావణం), నభ (భాద్రపదం), ఇషమ్బర (ఆశ్వయుజం), ఊర్జ (కార్తీకం), సహో (మార్గశిరం), సహస్య (పుష్యం), తపో (మాఘం), తపస్య (ఫాల్గుణం)గా పన్నెండు పేర్లతో పిలుస్తారు. 'రథసప్తమి' నాడే కాకుండా ప్రతి మాసంలో వచ్చే సప్తమి తిథి నాడు, ప్రత్యేకించి ప్రతీ ఆదివారం రోజున సూర్య ఆరాధనలు ఎంతో శుభకరమనీ మన ధర్మశాస్త్రాలు పేర్కొన్నాయి.

ఆదిపరాశక్తి ప్రత్యక్ష ప్రతిరూపాలుగా చెప్పే త్రిమూర్తుల 'ఏకీకృత రూపమే' సూర్యభగవానుడనీ వేద పండితులు అంటారు. సృష్టి, స్థితి, లయకారులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరుల రూపాలు భాస్కరునిలో అనునిత్యం త్రికాలాల్లో ప్రకటితమవుతాయి. ఉదయం పూట బ్రహ్మదేవునిగా, మధ్యాహ్నం పరమశివునిగా, సాయంత్రం మహావిష్ణువుగా సూర్యబింబం భాసిస్తుంది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు ఆయన్ను అనేక విధాలుగా ఎలుగెత్తాయి. సూర్యుడిని త్రిపురుషమూర్తి అని, త్రివేదమయుడు అని వారు అభివర్ణిస్తారు. నాలుగు వేదాలూ ఆయన్ని విరాట్‌మూర్తిగానూ పేర్కొన్నాయి.

నాలుగు వేదాలతోపాటు బ్రహ్మ, మార్కండేయ, మత్స్య, సాంబ, భవిష్య పురాణాలు, సూర్యోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు, నారాయణోపనిషత్తులు, భగవద్గీత, రామాయణ, మహాభారతాలు, తైత్తిరీయ అరణ్యకం, తైత్తిరీయ సంహిత, బృహత్సంహితలు, ధర్మసింధు, సుప్రభేదాగమం, అమరకోశం వంటి అనేక మహద్గ్రంథాలు, శాస్త్రాలు, స్తోత్రాలు అనితర సాధ్యమైన, అనంతమైన సూర్యతేజో వైభవాన్ని ఆవిష్కరించాయి. సౌర విశేషాలలో సాంబపురాణాన్ని 'ఆదిగ్రంథం'గా చెప్తారు. అన్నింటినీ క్షుణ్ణంగా చదివిన వారికి సూర్యుని శక్తి సామర్థ్యాలేకాదు, సౌర కిరణాలలోని ఆరోగ్య రహస్యం, మహత్తు, జీవశక్తి తెలుస్తాయి. అమరకోశంలో ఆదిత్యుడిని 52 పేర్లతో పిలిచారు.

సూర్యుడే ఉదయించకపోతే...?



ఇది మాట మాత్రానికైనా మనం కోరుకోకూడదు. నిజానికి సృష్టికి విరుద్ధమైన ఈ పని జరగదనే అనుకోవాలి. ఒకవేళ పొరపాటున సూర్యుడు కనీసం మూడు- నాలుగు రోజులు అసలు ఉదయించకుండా ఉంటే మాత్రం చాలా ఘోరాలు జరిగిపోతాయి. జీవకోటికి కావలసిన ప్రాణశక్తినిచ్చే సూర్యునిల్లే జ్ఞానం, బుద్ధి, శక్తి, మేధ, చైతన్యం వంటివన్నీ సిద్ధిస్తాయని వైదిక గ్రంథాలు పేర్కొన్నాయి. సూర్యరశ్మిలోని డి-విటమిన్ ఆవశ్యకత గురించి వేరే చెప్పక్కర్లేదు. కిరణాల్లోని సప్తవర్ణాలకు అనేక దీర్ఘకాలిక వ్యాధులను నిర్మూలించే శక్తి కూడా ఉన్నట్టు పలు ధార్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రతీ ఏడాది 'రథసప్తమి' పర్వదినం వచ్చినప్పుడల్లా, ఇంకా సూర్యనారాయణమూర్తిని తలచుకున్నప్పుడల్లా అనేక తరాల తెలుగువారికి గుర్తొచ్చే వినసొంపైన 'ఆకాశవాణి' భక్తిరస గేయం 'శ్రీ సూర్యనారాయణా మేలుకో'. బాలాంత్రపు రజనీకాంతరావు కలం నుండి జాలువారిన ఈ అద్భుత గీతం తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. ఆ పాట పల్లవి ఒక ఎత్తయితే చరణాలన్నీ మరో ఎత్తు. అవి వింటుంటే, కవి అద్భుత పూల వర్ణనల్లో దివాకరుని తేజస్సు ఎలా ప్రకృతితో మమేకమవుతున్నదో పూసగుచ్చినట్లు అర్థమవుతుంది.

ఇక, 'సూర్యరశ్మి' అన్న పదం వెనుక వాల్మీకి కవితా హృదయం ఉంది. ఆయన సూర్యుణ్ణి 'రశ్మిభావనుడు'గా పిలిచాడు. 'రశ్మ'లంటే 'అదుపులో వుండే కిరణాలు' అన్న అర్థం వస్తుంది. సూర్యకిరణాలు రకరకాల ప్రభావాలతో ఉంటున్నప్పటికీ జీవకోటికి నష్టం చేయనివీ వాటిలో ఉంటై. పైగా, జీవధాతువులను, శక్తిని, ఆరోగ్యసత్తువనూ అవి ప్రసాదిస్తాయి కూడా.

సూర్యుడిని సాక్షాత్తు పరమాత్మ స్వరూపంగానే 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు పేర్కొనడం విశేషం. అందుకే, సూర్యనారాయణ స్వరూపంగా ఆయన్ని చెప్తారు. 'విష్ణువు' అన్నా కూడా సర్వత్రా వ్యాపించి వున్నాడని అర్థం. సూర్యుడూ అంతే కదా. సూర్య మండల పర్యంతం ఆయన కిరణ దృష్టి పరివ్యాప్తమై ఉంటుంది. 'ఆదిత్య హృదయం' గొప్పతనం రామాయణంలో ప్రస్ఫుటమవుతుంది. దీనిని 'పారాయణం'గా పఠించడం ఎంతో పుణ్యప్రదమనీ పెద్దలు అంటారు.

... దోర్బల బాలశేఖరశర్మ

ఇలా చేద్దాం

పుణ్యస్నానానికి వేళ ఇదే!



మాఘ, ఫాల్గుణ మాసాలు శుభకార్యాలకు మాత్రమే కాక పుణ్యకార్యాలకు కూడా ఎంతో ఉత్తమమైన మాసాలుగా శాస్త్రాలు చెబుతున్నాయి. మాఘమాసం విశిష్ఠతను మాఘపురాణం ద్వారా తెలుసుకోవచ్చు. ఈ నెలలో మనం చేయాల్సిన మంచి పనులలో నదీ స్నానం ఒకటి. శుభ్రమైన జలాలు వున్న యెడల చెరువులు, కాల్వలలోనూ పుణ్యస్నానం చేయవచ్చు. ఇంకా సముద్ర స్నానాలు కూడా ఆచరించవచ్చునని పెద్దలు అంటారు. మూడుసార్లు నీళ్లలో మునిగి సూర్యునికి నమస్కారం చేయాలి. ఎందుకంటే, ఈ నెలలోనే రథసప్తమి పర్వదినమూ వస్తుంది కనుక సూర్యుని ఆరాధన అత్యంత పుణ్యప్రదం. మాఘ పురాణంలో మొత్తం 30 అధ్యాయాలుండగా, చివర ఫలశ్రుతి ఉంటుంది. ఒకటో అధ్యాయంలోనే మాఘమాస విశిష్ఠతను చదువుతాం. అలాగే, మాఘ స్నానానికి సంబంధించిన సంకల్ప విధానమూ ఇందులోనే ఉంటుంది.

మేల్కొలుపు

ధాటీషు తే విహగరాజ మృగాధిరాజ
నాగాధిరాజ గజరాజ హయాధిరాజా:
స్వస్వాధికార మహిమాదిక మర్థయంతే
శ్రీ వేంకటా చలపతే తవ సుప్రభాతమ్ ॥ 17 ॥

- శ్రీ వేంకటేశ్వర సుప్రభాతమ్



పక్షిరాజు గరుడుడు, మృగరాజు సింహం, నాగుల అధిపతి ఆదిశేషువు, ఏనుగుల శ్రేష్ఠుడు ఐరావతం, అశ్వాలలో ఉత్తముడు ఉచ్చైశ్రవం .. వీరంతా తమ మహిమలు, అధికారాలను పొందడానికి నీ అనుగ్రహం కోసం వేచి ఉన్నారు. ఓ స్వామీ.. వేంకటా చలపతీ! నీకిదే మా సుప్రభాతమ్.

అర్థం- పరమార్థం

అర్యమణంను దేవం కన్యా అగ్నిమయక్షత:
స ఇమాం దేవో అధ్వర:ప్రేతో ముంచాతి
నా ముతస్సు బద్ధా మముతస్కరత్ స్వాహా ॥



వివాహ తంతులో భాగమైన లాజహోమం జరిగే సమయంలో వరిపేలాలను అగ్నిలో వేసే వేళ పురోహితుడు చెప్పే మంత్రమిది. కన్య (వధువు) వివాహం జరిగిన తర్వాత తల్లిగారింటి నుంచి అత్తవారింటికి వెళుతుంది. అంత మాత్రాన తల్లిగారింటి నుండి ఆమె వేరైనట్టు కాదు. 'కన్యలతో పూజలు అందుకొనే ఆ పరమేశ్వరుడు నన్ను మా పిత్రు గృహం నుండి వేరు చేయకుండా చూడవలసింది' అని వధువు వేడుకోవడం ఇందులోని పరమార్థం.

సుడోకు

డైలీ సుడోకు 59 సమాధానం

2	8	1	5	4	6	3	9	7
4	5	6	3	7	9	1	8	2
3	7	9	8	1	2	4	6	5
8	3	2	7	9	4	5	1	6
1	4	5	2	6	3	8	7	9
6	9	7	1	8	5	2	3	4
5	6	8	4	3	7	9	2	1
7	1	4	9	2	8	6	5	3
9	2	3	6	5	1	7	4	8

డైలీ సుడోకు -60

					6		2	7
5				3	2			9
						6	1	
		7					5	
		6			4		3	2
9		5	1			8		6
		8	5					
1					3			
						3		5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



నా కుటుంబంలోని కీలకమైన మహిళలు ఖతిజా, రహీమా, సైరా, నీతా అంబానీ.

ఏ.ఆర్. రెహమాన్
@arrahman

రెహమాన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
21,120,310

కామన్‌మ్యాన్ వాయిస్

సోషల్ మీడియా లేకపోయుంటే ఈ పచ్చ మీడియా చేస్తున్న అతిని తట్టుకోవడం కష్టమయ్యేది. వాళ్లు చేస్తున్న దుష్ప్రచారానికి ఆధారాలతో సహా కౌంటర్ ఇవ్వగలగడం మామూలు విషయం కాదు. నెటిజన్లకు హ్యాట్సాఫ్.

-Thirmal Reddy Sunkari

యవ్వనం పియర్స్ సబ్బులాంటిది. చూస్తుండగానే కరిగిపోతుంది. అప్పు లైఫ్ బాయ్ సబ్బులాంటిది. ఎంత రుద్దినా ఇంకా మిగిలే ఉంటుంది.

-Chandu Thulasi

ఎవరో చినబాబుని ఉద్దేశించి పండిత పుత్ర పరమ శుంఠ అన్నారు. నాకు చాలా కోపమొచ్చింది. సగం కరెక్ట్ ఉన్న సామెతలు చెప్పకు అని ఏకి పారేసా. ఏ సగం కరెక్ట్ అని అడగకండి.

-Om Prasad

వైరల్ వీడియో



విశాల్, రాశీ ఖన్నా జంటగా నటిస్తున్న నూతన చిత్రం అయోగ్య. ఈ సినిమా టీజర్ యూట్యూబ్‌లో విడుదలై హల్‌చల్ చేస్తున్నది.

Ayogya Official Teaser | Vishal, Raashi Khanna, R.Parthiepan | Venkat Mohan | Sam CS | B.Madhu

Total views : 1,713,990+
Published on Feb 6, 2019

III. నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
శుక్రవారం 8 ఫిబ్రవరి 2019


మహేష్‌బాబు, పూజాహెగ్డే

మహర్షి ఔన్నత్యం

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మహర్షి'. వంశీపైడిపల్లి దర్శకుడు. దిల్‌రాజు, అశ్వనీదత్, పీవీపీ ప్రసాద్ నిర్మాతలు. పూజాహేగ్డే కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. మరోవైపు ఈ చిత్ర నిర్మాణానంతర పనుల్లో భాగంగా గురువారం డబ్బింగ్ కార్యక్రమాల్ని ఆరంభించారు. ఏప్రిల్ 25న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలో మహేష్‌బాబు కాలేజీ విద్యార్థిగా, రైతుగా భిన్న కోణాల్లో సాగే పాత్రలో కనిపించబోతున్నారని సమాచారం. ఇటీవలే పొల్లాచ్చిలో మహేష్‌బాబు వ్యవసాయం చేస్తున్న కొన్ని కీలక ఘట్టాల్ని తెరకెక్కించారు. ద్వితీయార్థంలో వచ్చే ఎపిసోడ్‌లో ఆయన రైతు పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. స్నేహం, కుటుంబ అనుబంధాల ఔన్నత్యాన్ని తెలియజెప్పే కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో మహేష్‌బాబు స్నేహితుడిగా అల్లరి నరేష్ నటిస్తున్నారు. మహేష్‌బాబు నటిస్తున్న 25వ చిత్రమిది కావడం విశేషం. ఈ సినిమా కోసం ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



కొన్ని రోజుల క్రితం ప్రముఖ హాస్య నటుడు బ్రహ్మానందంకు ముంబయిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ జరిగిన విషయం తెలిసిందే. ఇటీవలే హైదరాబాద్ వచ్చిన ఆయనను హీరో అల్లు అర్జున్ కలుసుకున్నారు. ఆయన నివాసానికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత బ్రహ్మానందంతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియా ట్విట్టర్‌లో అభిమానులతో పంచుకున్నారు. అల్లు అర్జున్. 'రియల్ ఐరన్ మ్యాన్. ధృఢమైన మనసున్న మనిషి. ఫన్నీ అండ్ ఫియర్‌లెస్. నా కిల్ బిల్ పాండేను ఇలా చూస్తున్నందుకు చాలా సంతోషంగా వుంది' అని ట్వీట్ చేశారు.



డిటెక్టివ్ పాత్రలో సల్మాన్!

ప్రస్తుతం సల్మాన్‌ఖాన్ 'భారత్' చిత్రంలో నటిస్తున్నారు. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకుడు. కత్రినాకైఫ్ కథానాయిక. దేశభక్తి ప్రధాన కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్ర టీజర్ ఇటీవలే విడుదలై అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇదిలావుండగా ఈ సినిమా తర్వాత సల్మాన్‌ఖాన్ డిటెక్టివ్ పాత్రలో ఓ చిత్రాన్ని చేయబోతున్నట్లు తెలిసింది. దక్షిణ కొరియా చిత్రం 'వెటరన్' ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు. పోలీస్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలందుకుంది. బాలీవుడ్‌కు చెందిన ఓ అగ్ర నిర్మాణ సంస్థ హిందీ రీమేక్ హక్కుల్ని సొంతం చేసుకున్నట్లు తెలిసింది.

కర్నూల్‌లో తెనాలి రామకృష్ణ

సందీప్‌కిషన్, హన్సిక జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'తెనాలి రామకృష్ణ బీఏబీఎల్'. జి.నాగేశ్వర


సందీప్‌కిషన్

రెడ్డి దర్శకుడు. ఇటీవలే ఈ చిత్రం ప్రారంభమైంది. రెగ్యులర్ షూటింగ్‌ను గురువారం కర్నూల్‌లో మొదలుపెట్టారు. నాయకానాయికలు సందీప్‌కిషన్, హన్సికపై ముఖ్య సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. సంపూర్ణ హాస్యరసభరిత చిత్రంగా తెరకెక్కిస్తున్నామని, ప్రేక్షకులకు ఆద్యంతం చక్కటి వినోదాన్ని పంచుతుందని చిత్ర బృందం తెలిపింది. సందీప్‌కిషన్ పాత్ర చిత్రణ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. మురళీశర్మ, వరలక్ష్మి శరత్‌కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీ ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిశ్రీరామ్, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాతలు: అగ్రహారం నాగిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, సంస్థ: శ్రీ నీలకంటేశ్వర స్వామి క్రియేషన్స్.


అలియాభట్

ఆ సంగతి తర్వాత..

కథానాయికలు తమ ప్రేమ వ్యవహారాల గురించి మీడియా ముందు స్పందించడానికి నిరాకరిస్తారు. ఏదో ఒక సమాధానం చెప్పి దాటవేసే ధోరణిని ప్రదర్శిస్తారు. అయితే బాలీవుడ్ నాయిక అలియాభట్ మాత్రం తన ప్రేమ, పెళ్లిపై స్పష్టత నిచ్చింది. పెళ్లి గురించి పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానమిచ్చింది. వివరాల్లోకి వెళితే...అగ్రహీరో రణభీర్‌కపూర్, అలియాభట్ కొంతకాలంగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. అయితే తమ వ్యవహారం గురించి వీరిద్దరూ ఏనాడు బహిరంగంగా స్పందించలేదు. త్వరలో ఈ ప్రేమజంట పెళ్లిపీటలెక్కబోతున్నారనే వార్తలు బాలీవుడ్ చిత్రసీమలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇటీవల మంబయిలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న అలియాభట్‌ను ఓ విలేకరి మీ పెళ్లెప్పుడని ప్రశ్నించారు. అందుకు ఆమె 'ప్రియాంకచోప్రా, దీపికాపదుకునే వివాహ వేడుకలు ఘనంగా జరిగాయి. మనందరం ఆ ఉత్సవాల్ని ఆస్వాదించాం. నా పెళ్లికి మరికొంత సమయం ఇవ్వండి. ప్రస్తుతం నేను వృత్తిపరమైన పనులతో బిజీగా ఉన్నాను. నా పెళ్లి విషయంలో మీ అందరి కోరిక తప్పకుండా నెరవేరుతుంది' అంటూ రణభీర్‌తో పెళ్లి విషయాన్ని కన్‌ఫర్మ్ చేసింది. ప్రస్తుతం రణభీర్‌కపూర్, అలియాభట్ కలిసి 'బ్రహ్మాస్త్ర' చిత్రంలో నటిస్తున్నారు. అయాన్‌ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటున్నది.

ప్రేమ పరిచయం


కరిష్మాకౌల్, రజత్‌రాఘవ్

రజత్ రాఘవ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ప్రేమ పరిచయం'. 'నేచర్ ఆఫ్ లవ్' అని ఉపశీర్షిక. శివ.ఐ దర్శకుడు. సిద్ధికి శర్మ, కరిష్మాకౌల్ కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రేమ్ ప్రొడక్షన్స్ పతాకంపై ఎం. పెరమాండ్లు నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పూజాకార్యక్రమాల అనంతరం చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి పారిశ్రామిక వేత్త సుభాష్ రెడ్డి క్లాప్‌నివ్వగా, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ యువతీ యువకులు తెలిసీ తెలియక తప్పులు చేస్తుంటారు. వాటి ప్రభావం భవిష్యత్తుపై వుంటుందని చెప్పే ప్రయత్నమే మా సినిమా. వినోదం, రొమాన్స్‌తో పాటు అన్ని అంశాలున్న చిత్రమిది. ఈ నెల 11 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'దర్శకుడిగా ఇది నా తొలి సినిమా. ప్రేమ నేపథ్యంలో ఎన్నో చిత్రాలొచ్చాయి. అయితే అసలు ప్రేమ ఎలా మొదలవుతుంది? అనే విషయాన్ని లోతుగా చర్చిస్తూ ఈ సినిమాలో చూపించే ప్రయత్నం చేస్తున్నాం. ఈ చిత్రం ద్వారా సరికొత్త సాంకేతికతను పరిచయం చేస్తున్నాం. సినిమా బ్యాక్‌గ్రౌండ్‌లో వచ్చే నేచర్‌ని గ్రాఫిక్స్ ద్వారా కొత్తగా చూపించబోతున్నాం' అన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ 'దర్శకుడు శివ నాకు చాలా కాలంగా తెలుసు. ప్రేమ నేపథ్యంలో ఇప్పటి వరకు చాలా చిత్రాలొచ్చాయి. కానీ వాటిలో ఇది భిన్నంగా వుంటుందని భావిస్తున్నాను' అన్నారు.


నవీన్‌చంద్ర, గాయత్రి సురేష్

పైరసీ నేపథ్య ప్రేమకథ

సినిమా పైరసీ నేపథ్యంలో రూపొందుతున్న ప్రేమకథ 'హీరో హీరోయిన్'. 'అడ్డా' ఫేం జీయస్ కార్తీక్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో నవీన్‌చంద్ర కథానాయకుడు. గాయత్రి సురేష్, పూజా జవేరి నాయికలు. 'ఏ పైరెటెడ్ లవ్‌స్టోరీ' అనే ఉపశీర్షికతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని స్వాతి పిక్చర్స్ పతాకంపై భార్గవ్ మన్నె నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది. పైరసీ బ్యాక్‌డ్రాప్‌లో కొనసాగే ఈ లవ్‌స్టోరీలో అన్ని ఎమోషన్స్ వుంటాయి. నవీన్‌చంద్ర పాత్ర ఆకట్టుకునే విధంగా వుంటుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు తప్పకుండా నచ్చే చిత్రమిది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'దర్శకుడు చెప్పిన కథ మాకు ఎంతో నచ్చింది. ఎక్కడా రాజీపడకుండా రిచ్‌గా చిత్రాన్ని నిర్మించాం. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. అతి త్వరలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని తెలిపారు. నవీన్‌చంద్ర, గాయత్రి సురేష్, పూజా జవేరి, అభిమన్యు సింగ్, కబీర్‌సింగ్, జయప్రకాష్ రెడ్డి, షేకింగ్ శేషు, రణధీర్, గౌతంరాజు, శివన్నారాయణ, బమ్‌చిక్ బబ్లూ, సారిక రామచంద్రరావు తదితరులు నటిసున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఆర్ట్: కిరణ్‌కుమార్ మన్నె, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: వెంకట్ గంగాధరీ, ఎడిటర్: జునైద్ సిద్ధికి, ఫైట్స్: రియల్ సతీష్, నిర్మాత: భార్గవ్ మన్నె, కథ-స్క్రీన్‌ప్లే-మాటలు-దర్శకత్వం: జీయస్ కార్తీక్.

ఏజెంట్ ఆత్రేయ పరిశోధన

నవీన్ పొలిశెట్టి, శృతిశర్మ నాయికా నాయికలుగా పరిచయం చేస్తూ రూపొందిస్తున్న తాజా చిత్రం 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'. స్వరూప్ ఆర్‌ఎస్‌జె దర్శకుడు. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్క నిర్మిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'మళ్లీ రావా' చిత్రం తరువాత విభిన్నమైన కథాంశంతో ఆద్యంతం వినోదాత్మకంగా 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కు మంచి ఆదరణ లభించింది. ఓ డిటెక్టివ్ ఏజెంట్ చేసిన నేర పరిశోధన నేపథ్యంలో వినోదాత్మకంగా సాగే చిత్రమిది. షూటింగ్ పూర్తయింది. మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీంతం: మార్క్ కె. రాబిన్, సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి, సౌండ్ ఇంజినీర్: నాగార్జున తాళ్లపల్లి, ఆర్ట్: క్రాంతి ప్రియం.


శృతిశర్మ

నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

ఐఎల్‌బీఎస్‌లో పోస్టులు

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ బిలియరీ సైన్సెస్(ఐఎల్‌బీఎస్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల (కాంట్రాక్టు ప్రాతిపదికన) భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 207
- ఖాళీల వివరాలు: ప్రొఫెసర్-11, అడిషనల్ ప్రొఫెసర్-4, అసోసియేట్ ప్రొఫెసర్-5, అసిస్టెంట్ ప్రొఫెసర్-14, సీనియర్ రెసిడెంట్-17, జూనియర్ రెసిడెంట్-7, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్-8, ఎగ్జిక్యూటివ్ నర్స్-50, జూనియర్ ఎగ్జిక్యూటివ్ నర్స్-70 తదితర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి.
- **పీహెచ్‌సీ అభ్యర్థులకు..** సీనియర్ రెసిడెంట్-3, జూనియర్ రెసిడెంట్-1, జూనియర్ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్-2, జూనియర్ ఎగ్జిక్యూటివ్ నర్స్-3 ఖాళీలు ఉన్నాయి.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, డిగ్రీ, మాస్టర్ డిగ్రీ (నర్సింగ్), పీహెచ్‌డీ, ఎంబీబీఎస్, ఎండీ/డీఎన్‌బీ, ఎంఎస్‌ల్లో ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.ilbs.in

ఐఐఎస్సీలో పీజీ ప్రవేశాలు

బెంగళూరులోని ప్రతిష్ఠాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) 2019-20 విద్యాసంవత్సరానికి రిసెర్చ్ ప్రోగ్రాం, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.



- రిసెర్చ్ ప్రోగ్రామ్స్ (పీహెచ్‌డీ, ఎంటెక్ రిసెర్చ్)
- **విభాగాలు:** పీహెచ్‌డీ ఇన్ సైన్స్, ఎంటెక్ రిసెర్చ్ అండ్ పీహెచ్‌డీ ఇన్ ఇంజినీరింగ్, పీహెచ్‌డీ ఇన్ ఇంటర్ డిసిప్లినరీ ఏరియాలు.
- **అర్హత:** నాలుగేండ్ల ఇంజినీరింగ్/టెక్నాలజీలో బ్యాచిలర్ డిగ్రీ లేదా సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ. మాస్టర్ డిగ్రీ (ఎకనామిక్స్, జాగ్రఫీ, సోషల్ వర్క్, సైకాలజీ, మేనేజ్‌మెంట్, కామర్స్, ఆపరేషన్స్ రిసెర్చ్, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్), పీజీ (ఇంజినీరింగ్/టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, అగ్రికల్చర్, ఫార్మసీ, వెటర్నరీ సైన్సెస్), ఎంఎస్/ఎంబీఏ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంబీబీఎస్/ఎండీ, బీఫార్మసీ, బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణత. వినియోగంలో ఉన్న గేట్ స్కోర్/నెట్ జేఆర్‌ఎఫ్, జీప్యాట్‌లో అర్హత సాధించాలి.
- మాస్టర్ ప్రోగ్రాం (టెక్నాలజీ, డిజైన్, మేనేజ్‌మెంట్)
- **అర్హతలు:** ఎంటెక్ (మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ) కోర్సుకు.. బీఈ/బీటెక్, మాస్టర్ డిగ్రీ (సైన్స్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్), ఎంసీఏతోపాటు గేట్ స్కోర్ ఉండాలి.
- **మాస్టర్ ఆఫ్ డిజైన్ (ఎం. డిజైన్)** కోర్సుకు.. ఇంజినీరింగ్/టెక్నాలజీ, డిజైన్, ఆర్కిటెక్చర్‌లో డిగ్రీతో పాటు గేట్ స్కోర్/సీఈఈడీ స్కోర్ ఉండాలి.
- **మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎం.ఎంజీటీ)** కోర్సుకు ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. వినియోగంలో ఉన్న గేట్ స్కోర్/క్యాట్, సీమ్యాట్ స్కోర్ ఉండాలి.
- **ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ** (బయాలజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్)
- **అర్హత:** బీఎస్సీ (బయాలజికల్, కెమికల్, ఫిజికల్ మ్యాథమెటికల్), బ్యాచిలర్ డిగ్రీ (ఫార్మసీ, వెటర్నరీ, అగ్రికల్చర్) ఉత్తీర్ణత. జామ్/జెస్ట్‌లో అర్హత సాధించాలి.
- **ఈఆర్‌పీ ప్రోగ్రామ్**
- **అర్హత:** ఏదైనా సంస్థలో పనిచేస్తున్న ప్రొఫెషనల్స్ (ఆర్ అండ్ డీ, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మస్యూటికల్, వెటర్నరీ)
- **ఎంపిక:** ప్రవేశపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ. 800/- ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400/- , ఈఆర్‌పీ ప్రోగ్రామ్‌కు రూ. 2000/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 25
- **వెబ్‌సైట్:** www.iisc.ac.in

ఎలిజిబిలిటీ టెస్ట్-2019

హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (బీఆర్‌ఏఓయూ) 2019-20 విద్యా సంవత్సరానికి మూడేండ్ల డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎలిజిబిలిటీ టెస్ట్-2019 ప్రకటన విడుదల చేసింది.

- **అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణులైనవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. ఎటువంటి విద్యార్హత లేని 18 ఏండ్లు నిండిన అభ్యర్థులు ఎలిజిబిలిటీ టెస్ట్‌లో అర్హత సాధించాలి.
- **వయస్సు:** 2019 జూలై 1 నాటకి 18 ఏండ్లు నిండి ఉండాలి.
- ఈ ఎలిజిబిలిటీ టెస్ట్ ద్వారా మూడేండ్ల బీఏ/బీకాం, బీఎస్సీలో ప్రవేశం పొందవచ్చు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 300/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 28
- **ఎలిజిబిలిటీ టెస్ట్:** ఏప్రిల్ 28
- **వెబ్‌సైట్:** www.braouonline.in

ప్రాజెక్టు అసిస్టెంట్లు


హైదరాబాద్(బోడుప్పల్)లోని ఐసీఏఆర్- నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఆన్ మీట్ (ఎన్‌ఆర్‌సీఎం) లో ఖాళీగా ఉన్న ప్రాజెక్టు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- ప్రాజెక్టు అసిస్టెంట్-2 ఖాళీలు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణత.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూతేదీ:** ఫిబ్రవరి 15
- **వెబ్‌సైట్:** www.nrcmeat.icar.gov.in

ఐఐపీలో పీజీ డిప్లొమా

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపీ) 2019-21 విద్యాసంవత్సరానికి రెండేండ్ల పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ (ఫుల్‌టైమ్) కోర్స్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్
- మొత్తం సీట్ల సంఖ్య: 300
- దేశవ్యాప్తంగా ఖాళీలు: ముంబై-80, ఢిల్లీ-100, కోల్‌కతా-60, హైదరాబాద్-60
- **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, అగ్రికల్చర్, ఫుడ్ సైన్స్, పాలీమర్ సైన్స్, ఫార్మా, ఇంజినీరింగ్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 30 ఏండ్లకు మించరాదు.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-
- **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా, న్యూఢిల్లీ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జూన్ 7
- **రాతపరీక్ష:** జూన్ 13
- **వెబ్‌సైట్:** www.iip-in.com


SHIVA MEKA
PRESENTS
70mm ENTERTAINMENTS
నేడే విడుదల
యాత్ర
PRODUCED BY VIJAY CHILLA & SHASHI DEVIREDDY
WRITTEN & DIRECTED BY MAHI V RAGHAV
DOP SATHYAN SOORYAN MUSIC K EDITOR SREEKAR PRASAD LYRICS SIRIVENNELA SEETHARAMA SASTRY
PRODUCTION DESIGN RAMAKRISHNA - MONIKA SOUND DESIGN SYNC CINEMA
CHOREOGRAPHER BRINDA SOUND MIXING KANNAN GANPAT
Paytm CASHBACK
#YatraTheMovie /70mmEntertainments /70mmEntertains
amazon prime video